TIGHT BINDING BOOK

# brown book

UNIVERSAL LIBRARY
OU_206172
UNIVERSAL LIBRARY

ప్రబోధమండలి, ౧.

౬ కాణా



# కర్మయోగము.

శ్రీ వివేకానంద ప్రణీతము.

మంగిపూడి పురుషోత్తమశర్మచే పరివర్తితము.


ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాల,

బెజవాడ.

౧౯౨౧.


సర్వస్వామ్యసంకలితము.] [వెల. ౦-౮ ౨-౭.

ఓమ్

# ప్రబోధమండలి.

---

మాన వేతిహాసమున నియ్యది యుగసంధి. పూర్వ పాశ్చాత్యములును, ప్రాచీన నవీనములును, ఆధ్యాత్మిక భౌతికములును అపూర్వభంగి నేకకటాహమున బడి కరగిపోవుచున్నవి. బాహ్యమున నెల్లెడను సంరంభము, సంఘట్టనము, సంగ్రామము, కాని యంతరమున ప్రశాంతముగ సమరస భావమే ప్రవహించుచున్నది. ఈ సమ్మేళనమునుండి సనాతనమయ్యు నూతనమై, జాతీయమయ్యు విశ్వజనీనమై, విభిన్నమయ్యు నేకమై యలరారు నవధర్మ మొండు ప్రాభాతకాంతులతో నావిర్భవించుచున్నది. నిర్వాణముయొక్క మృత్యుశాంతియందు నిలీనమగుటకంటె విశ్వజీవనమున మిలనమై యనం దనంత ముఖముల తొలుకాడు నమృతబిందువుల నాస్వాదించుటయే దీని పరమావధి. పుడమిని చైతన్య విహీనమగు శ్మశానవాటికగా జేయుటకన్న సౌందర్య విలసితమగు స్వర్గయారామముగ జేయుటయే దీనియాశయము. మానవ సౌభ్రాతృత్వము విశ్వజనీన జీవనము దీనిసాధనములు. దీనిప్ర

భావముచే మానవజాతి పరిశుద్ధమై, నవ్యదీప్తులతో ప్రకాశిం
చుచు ఋషులు గానముచేసిన, ప్రవక్తలు ప్రవచించిన, దీన
మానవకోటి యుగయుగములుగ ఫలవించిన సత్యయుగము
స్వర్ణయుగము ధాత్రిపై నుదయింపగలదు. దీని మహిమచే
మానవుడనంత కాలమునుండి యావరించిన యజ్ఞాన తమ
స్సునుండి వెలువడి దివ్యజ్ఞాన కాంతులతో సిద్ధుడై విరాజిల్ల
గలడు. భూతలము స్వర్గతలము కాగలదు.

ఈధర్మమునే నవయుగము నందు నిద్రా నిలీఢమైన
భారత జాతి ప్రథమమున రామమోహనునిద్వారా అస్ఫుట
స్వనమున కలవరించెను. దీనినే మహర్షి బ్రహ్మనందులును,
దయానందులును అవ్యక్తస్వరముల వ్యక్తము సేయజూచిరి.
దీనినే శ్రీరామకృష్ణ వివేకానందులు విశ్వవీథియందు ప్రస్ఫుట
వాక్కులతో ప్రబోధ మొనరించిరి. దీనినే రవీంద్రకవి కల
కంఠముతో జగన్మోహనముగ నాలాపించుచున్నాడు. దీనినే
యరవిందయోగి నవభావములతో లోకమునకు ప్రవచించి
చాటుచున్నాడు. ఈధర్మామృతమునే గాంధి మహాత్ముడుస్వీయ
జీవనపాత్ర యందు నింపుకొని సమగ్ర జాతీయ జీవనమునందు
ప్రవహింపజేయ జూచుచున్నాడు. ఈధర్మ రహస్యమునే విశ్వ
మంతయు భారతవర్షముయొక్క పాదపీఠము వద్ద నాసీనమై
యాస్థతో నభ్యసించుచున్నది. ఆంధ్రులుకూడ నీనవ ధర్మ
ప్రబోధము నాలకించి తమ ధార్మిక, సాంఘిక, జీవితములను
తన్మయముగ గావించుకొన్నగాని ప్రస్తుత జడదాస్యమునుండి
విముక్తినొందజాలరు.

ఆంధ్ర దేశమునందీ నవధర్మప్రబోధమును గా-
టమే **ప్రబోధమండలి** యొక్క పరమోద్దే
శ్యము. ఈయుద్దేశ్యము ననువర్తించు నుత్తమ గ్రంథములను
సమర్థులచే రచియింపజేసియు, నన్యభాషలనుండి పరివర్తింప
జేసియు ప్రకటించుటకు ఈమండలి శాయశక్తుల ప్రయత్నింప
గలదు. ఆంధ్ర మహాజనులందఱు మాయుద్యమమునకు
చేయూతనిచ్చి ప్రోత్సాహ మొసంగెదరుగాక.

# మనవి

ఈగ్రంథమును చదువునప్పుడు ఇందలి విషయములు శ్రీ వివేకానందస్వామి యమెరికాలో తన శిష్యులకొఱకై యుల్లేఖించిన వ్యాఖ్యానములని చదువరులు జ్ఞాపక ముంచుకొనుట యావశ్యకము. అచ్చుతప్పులు పుష్కలముగా దొరలుటచే శుద్ధపత్రిక చేర్పబడినది. చదువరులు క్షమించి ముందుగా తప్పులు సవరించుకొందురుగాక.

అనువాదకుడు.

శ్రీరామకృష్ణ పరబ్రహ్మణేనమః

# కర్మయోగము.

## ప్రథమాధ్యాయము

---

### కర్మః స్వభావము

'కర్మ' యను పదము 'కృఞ్' ధాతువునుండి యుత్పన్నమైనది; కృఞ్ అనగా చేయుట; సమస్త వ్యాపారమును కర్మయే. కర్మఫలమను నర్థమునగూడ నీ పదమును సాంకేతికముగ వాడుదురు. అధ్యాత్మ శాస్త్రమున కొన్నియెడల నీ పదము మన పూర్వకర్మల ఫలితమనియు నర్థ మిచ్చును. కాని కర్మయోగమున మనకు కావలసిన యర్థము కర్మ యనగా పని. మానవ కోటికి జ్ఞానము పరమావధి; ప్రాగ్దేశ తత్వశాస్త్రము మనకీ యేకాదర్శము నొసంగియున్నది. మానవుని లక్ష్యము సుఖము కాదు. జ్ఞానము. సుఖసంతోషముల కంతము కలదు. సుఖమే ప్రాప్య మనుకొనుట తప్పు; అవివేకముచే జనులు సుఖసాధనయే జీవితలక్ష్యమని భావించుటవలననే యీ లోక మింత దుఃఖభూయిష్ఠముగ నున్నది. కొంతకాల మైనపిదప మానవుడు తాను పోవుచున్నది సుఖము వంకకు గాక జ్ఞానము వైపునకే

యనియు, సుఖదుఃఖములు రెండును మహోపదేశకులే యనియు, శుభమునుండివలెనే యశుభమునుండియు తా నెంతో నేర్చుకొనుచున్నట్లును తెలిసికొనుచున్నాడు. మానవాత్మ సుఖదుఃఖములనుభవించునప్పు డాయాసంస్కారములు దానియందు శేషించియుండును. ఈసంస్కారసమ్మేళనముయొక్క పర్యవసానమే మానవుని స్వభావము. ఎవ్వని స్వభావము పరిశీలించినను అది యాతని వివిధ మనఃప్రవృత్తుల సంయోగఫలితమే యనియు, దానికి సుఖదుఃఖములు రెండును సమకారణములే యనియు గోచరింపగలదు. స్వభావనిర్మాణమున మేలుకీళ్లకు సమముగ పాలుగలదు. కొన్నియెడల సుఖముకన్న దుఃఖమే యుత్తమ గురువనుటకును నిదర్శనము లున్నవి. ఈభూమండలమం దుదయించిన మహనీయుల చరిత్రములం దిలకించుదుమేని పెక్కుమంది విషయమున సుఖముకంటెను దుఃఖమే, భాగ్యముకన్నను దారిద్ర్యమే విశేష బోధదాయక మయ్యెననియు, స్తుతిపాఠముసకన్న కష్టాఘాతములే యంతర్వహ్ని నధికముగ వెలార్చెనని యు నుడువ సాహసించెదను.

ఈజ్ఞానము మానవునియందు సహజముగ నిహితమై యున్నది; ఏ జ్ఞానము కాని బాహ్యమునుండి రాదు; సర్వము నంతరమందే యున్నది. ఒకడు తెలిసికొనుచున్నాడని మనము సామాన్యముగా వాకొనునది వాస్తవమున 'ఆవిష్కరించుచున్నాడు' లేక 'వెలివరచుచున్నాడు' అని యుండవలయును. మానవాత్మ అనంతజ్ఞానఖని. ఆతడు నేర్చుకొనుట యనగా తన యాత్మ నావరించియున్న యాచ్ఛాదనముం దొలగించి జ్ఞాన

ముం బ్రకాశింపజేయుటయే. భూమి కాకర్షణశక్తి కలదని న్యూటన్ కనుగొనె నందుము. అది యాతనికొఱకు నిరీక్షించుచు నెందే నొకమూల గూర్చుండెనా? అది యాతని మనఃకోశమునందే యుండెను. సమయము వచ్చినంతనే యాతడు దానిం గనుగొనెను. ప్రపంచమునందలి సమస్తజ్ఞానమును మనస్సునుండియే వచ్చుచున్నది. ఈ విశ్వ మనెడి యనంత జ్ఞానకోశమును నీ మనస్సు నందే యున్నది. బాహ్యప్రపంచము నీ మనోజగత్తును పరిశీలించుటకు కేవల సూచనయు, నిమిత్తమాత్రమునే; కాని నీవు పరిశీలించునది నిరంతరము నీ మనస్సునే. రేగుపండు నేలపై బడెను. అది నిమిత్తముగా న్యూటను తన మనస్సును పరిశీలించెను; తన జ్ఞాన సమన్వయమున పూర్వక్రమమును మార్చికొని యొక నూతన సూత్రమును గనుగొనెను; అదియే భూమి కాకర్షణశక్తిని ప్రతిపాదించు ప్రకృతిసూత్రము. అది రేగు పండునందుగాని భూమధ్యమందలి యేపదార్థమందుగాని లేదు. కావున ప్రకృతివిజ్ఞానమును, ఆత్మజ్ఞానమును, సమస్తమును మానవుని మానసమునందే కలదు. పలువిషయములం దది యింకను వెలివడలేదు; మఱుగుపడియే యున్నది. ఆ యావరణమును మెల్లగా తొలగించునప్పుడే 'నేర్చికొనుచున్నా' మందుము; ఈ యావిష్కరణ మెంత జరిగిన జ్ఞానాభివృద్ధియు నంతగా జరుగును. ఎవ్వనినుండి యీ యావరణ తొలగుచున్నదో యాతడే విజ్ఞుడు; ఎవ్వనిదట్టముగ నాచ్ఛాదించునో యాతడే యజ్ఞుడు; ఎవ్వనినుండి పూర్ణముగ దొలగినదో యాతడే సర్వజ్ఞుడు. ఎందఱో సర్వజ్ఞు లుండిరి; ఇంకను నుండగల

రు; భావియుగములం దెందఱో యపరిమితముగా నుందురని నా విశ్వాసము. అరణియం దగ్నివలె మనస్సునందు జ్ఞాన మున్నది. దానిని బహిర్గతము చేయు మథనమే నిమిత్తము. అట్లే మన సమస్త మనోభావములును, చేష్టలును మనశ్శోకభాష్పములును, మందస్మితములును, మన సుఖదుఃఖములును, మోదఖేదములును, ఆశీశ్శాపములును, నిందాస్తోత్రములును—ప్రతిభావమును, మనము సావధానముగ మన మనస్సులను పరీక్షింతుమేని, మన హృదయాంతరాళమునుండియే మథనపరంపరల చేనావిర్భవించునట్లు తేటపడగలదు. ఇందుకు పర్యవసానము మన ప్రస్తుతస్థితియే; ఈ మథనపరంపరయొక్క సమవాయమునే కర్మయందుము. ఆత్మను మథించి యందుండి స్వీయశక్తిని, జ్ఞానమును ప్రజ్వలింపజేయు ప్రతి మానసిక భౌతికానుభూతియు కర్మయను పదముకు పూర్ణవ్యాప్తియం దర్థ మిచ్చును; ఈవిధముగా మనము నిరంతరమును కర్మ చేయుచునే యున్నాము. నేను మీతో మాట్లాడుచున్నాను: అది కర్మ. మీరు వినుచున్నారు. అది కర్మ. మన మూపిరి విడుచుచున్నాము. అది కర్మ. మనము నడచుచున్నాము: కర్మ. మనము చేయు ప్రతి కాయిక మానసిక కార్యమును కర్మయే; అది మనయందు తన జాడలను విడిచిపోవును.

కొన్ని మహాత్కార్యము లున్నవి; అవియెన్నియో చిన్నకార్యములు చేరి యేర్పడును. సముద్రతీరముననిలచి శిలలపై బడు తరంగనిస్వనము నాలకింతుమేని యది మహానిర్ఘోషముగా దలంతుము. లక్షోపలక్షల చిన్ని యలలు చేరి యొక

మహాతరంగ మేర్పడుచున్నదని మనమెఱుంగుదుము; ప్రతి చిన్నియలయు నొకచిన్న చప్పుడు చేయుచున్నది. కాని మనము దానినిగుర్తింపనేరకున్నాము; అన్నియు గలసినప్పుడే మనము వినజాలునది. అట్లే మన హృదయము కావించు ప్రతి స్పందనమును కర్మయే; కొన్ని విధముల కర్మ గ్రాహ్యముగ నుండును; దానిని మనము గుర్తింతుము; అది యనేకసూక్ష్మ కార్యముల సమష్టిఫలము. నీవెన్వాని స్వభావమునైన నిర్ణయింపగోరుదువేని ఆత డొనరించిన మహాత్కార్యములను పరికింపకుము. ఎంతటి మూర్ఖుడైన నేదియో యొక తరుణమున వీరుడుగా మారవచ్చును. ఆతని సాధారణ నిత్యకృత్యములనే పరిశీలించుము; అవియే మహనీయుల యుదాత్త స్వభావమును వెల్లడింపగలవు. ఉత్కృష్టసమయములం దెంత యధముడైనను కొంత యుత్కృష్టతను జూపకపోడు; కాని యెవ్వడు సర్వవేళలందును, సర్వస్థితులందును ధీరోదారతనే ప్రకటించునో యాతడే నిక్కమైన వీరుడు.

పురుషుని స్వభావము కర్మాధీనమగుటచే నాతఁడెదుర్కొన వలసినశక్తులలో కర్మ మిక్కిలి కఠినతమమైనది. ఆతడు కేంద్రస్థానముగనుండి విశ్వశక్తులనెల్లను తనవంక కాకర్షించుచున్నాడు. మరల నీకేంద్రముననే వానిని సంయోగము చేసి యొక మహాప్రవాహముగ వెలుపలకుఁ బంపుచున్నాఁడు. అట్టి కేంద్రస్థానమే సర్వశక్తుఁడు, సర్వజ్ఞుఁడు నగు పురుషుఁడు;ఆతఁడుసమస్త జగత్తును తనకడ కాకర్షించు కొనుచున్నాఁడు. మంచిచెడుగులును ,సుఖదుఃఖములును సకలము నాతనిదరికే పరు

గులు వారుచు నాతని నంటి పట్టుకొనియున్నవి. వానినుండియే యాతఁడు స్వభావమను ప్రవృత్తిప్రవాహమును నిర్మించి బాహ్యాముఖముగఁ బంపుచున్నాఁడు.

ఈలోకమున మనము చూచు సకల కార్య కలాపమును, మానవసమాజము నందలి సమస్తోద్యమములును, మనచుట్టును జరుగు సకల వ్యాపారములును మానవుని తలఁపుల యొక్కయు, సంకల్పముల యొక్కయు నభివ్యక్తియే. యంత్రములుగాని, పరికరములుగాని, నగరములుగాని, నౌకలుగాని సమస్తమును మనుజుని సంకల్పశక్తి యొక్క ప్రకాశరూపములే. ఈసంకల్పశక్తికి హేతువు స్వభావము. ఈస్వభావమునకు కర్మ కారణము. కర్మ యెట్టిదైన సంకల్పాభివ్యక్తి యట్టిదగును. ఈప్రపంచమున దవతరించిన మహాసంకల్ప శాలురెల్లరు మహోద్యోగులై యప్రతిమాన కర్మపరులైయుండిరి. వారు మహాత్ములు. వారిసంకల్పములు విశాలములు. వారిశక్తి లోకమును తలక్రిందుసేయఁజాలినది. వారికిట్టి సంకల్ప బలము యుగయుగముల యవిచ్ఛిన్న కృషిచే లభించినది. బుద్ధునియొక్కకాని, క్రీస్తుయొక్కకాని సంకల్ప పటుత్వ మొక్కజన్మలో లభ్యముకాదు. ఏమన? వారితండ్రులెట్టివారో మనకుఁ దెలియును. వారు మానవుల శ్రేయముకై యొక్కపలుకాడి నట్లయిన నెఱుఁగము. క్రీస్తుతండ్రి జోసెఫునంటి వడ్రంగులు లక్షలాది పుట్టిరి; లక్షలు పుట్టుచున్నారు. శుద్ధోదనునిఁబోలు సామాన్య దేశాధీశులెందఱో యీధాత్రీతలమును మెట్టి గిట్టినారు. ఇయ్యది కేవలము పరంపరాగతశక్తియే యైనచో తనభృత్యుల

సుస్తనలనైన ప్రాయికముగఁ బొందియుండని యొక చిన్న రా
జ్యాధిపతి యేడ? అవనితలమునం దర్ధభాగముచే నవిరళభక్తి
నై నర్చనలంగొను పుత్రనతంసమేడ? ఊరుపేరులేని పేదవఁడ్రం
గియేడ? జనకోటులచే దైవముగఁ బూజింపఁబడు నీకుమారర
త్నమేడ? ఈతారతమ్యమునకు కారణమేమి? పారంపర్య
సిద్ధాంత మిచ్చట మౌనము వహించవలసినదే. బుద్ధదేవుఁడును
క్రీస్తును ప్రదర్శించిన యద్భుత సంకల్పశక్తి యెచ్చటనుంచి వ
చ్చినది? ఈవెల్లువ యెందుండి ప్రవహించినది? అదియుగయుగ
ములు నందుండి, నానాఁటబృహత్పరిణామమున వర్ధిల్లుచు తుద
కొక్కుమ్మడిగ నొక్క బుద్ధరూపముగనో, క్రీస్తురూపముగనో
మానవకోటిపైఁబడి నేటివరకును ప్రచండ కల్లోల వేగముతో
ప్రవహించుచునే యున్నది.

ఇంతయు కర్మచేతనే నిర్ణయమగుచున్నది. గడించుకొ
న్నఁ గాని యెవ్వనికి నెద్దియు లభింపదు. ఇది శాశ్వత నియమ
ము. ఒక్కొకప్పుడు మనమట్లు కాదనుకోవచ్చును. కాని యె
న్నటికైన ననమ్మకతీరదు. ఒకఁడు యౌవనజీవితమును ధనముకై
దోరిపోవచ్చును. వేలాదిజనులను వంచింప వచ్చును. కాని తుద
కు తాను లక్ష్మీకటాక్షమునకు పాత్రుఁడుకాఁడని తెలిసికొనును.
ఆతనిజీవితము దుఃఖమయమై దుర్భరమగును. మనము భోగ
ముకొఱకై వస్తుసంచయము చేయవచ్చును. కాని దేనిని మన
మనుభవించు చున్నామో అదియే నిజముగా మనసొత్తు. మూ
ఢుఁడొకఁడు ప్రపంచమునందలి గ్రంథజాలమంతయు కొనవచ్చు
ను; తన యాగారమున నింపవచ్చును;కాని వానికి పఠనార్హత

యెంతవరకుఁ గలదో యంతవరకే చదువును. ఈయర్హతయూ తని కర్మననుసరించి యుండును. మనమెంత వరకర్హులమో, యెంతవర కిముడ్చుకోఁగలమో మనకర్మయే నిర్ణయించును. మన వర్తమానస్థితికి మనమే బాధ్యులము. మనమెట్లు కాఁగోరి ననట్లగుటకు వలయు సామర్థ్యము మనయందున్నది. మనవర్త మాన స్థితి పూర్వకర్మల ఫలితమైనచో మనము కోరు భావిస్థితియు మనప్రస్తుత కర్మలచే నేర్పడుట వాస్తవము. కావున కర్మచేయుట యెట్లో మనమూరయువలయును. "కర్మ చేయుటెట్లో నేర్చుకొన్నలాభమేమి? లోకమునందందఱు నేదో యొక తీరున పనిచేయుచునేయున్నారు." అని నీవడుగవచ్చును. కాని మనము మనశక్తుల నేకాగ్రము చేయక చెదరఁగొట్టుచుందుము. కర్మయోగవిషయమున గీత "యోగః కర్మసు కౌశలం" అని చెప్పుచున్నది. కర్మాచరణ పద్ధతి నెఱిఁగినచో నుత్తమఫలములఁ బడయఁగలము. కర్మయనఁగా ఆత్మ నుద్బుద్ధముచేయుటకై మనస్సునం దంతరితములైయున్న శక్తులను బహిర్గతము చేయుటయేయని నీవు జ్ఞప్తియుంచుకోవలెను. ప్రతిమానవుని లోను శక్తియున్నది; జ్ఞానమున్నది; ఆశక్తని, జ్ఞానమును రగుల్కొలిపి యుజ్వలితముచేయు మథనమువంటివి మనకర్మలు.

మానవుఁడు వివిధోద్దేశ్యములతో కర్మలాచరించును. ఉద్దేశ్యములేని కర్మ యుండఁబోదు. కీర్తికాములు కొందఱు; వారు కీర్తికై యత్నింతురు. ధనకాములు కొందఱు; వారుధనముకై పనిచేయుదురు. అధికారకాంక్షులు మఱికొందఱు; వారధికారమునకై కృషిచేయుదురు. కొందఱికి స్వర్గముపై కోరి

క. వారందుకై కష్టింతురు. ఇఁక కొందఱికి మరణానంతరమున పేరు మోయవలెనని యభిలాష; చీనాదేశమునందట్లు చేయుట వాడుక; ఆదేశమున సజీవుఁడగు వాఁడెవ్వఁడును బిరుదములొందఁ జాలఁడు. మనపద్ధతి కన్న నది మెఱుఁగేకదా? ఆదేశమం దెవ్వఁడేని సత్కార్యముఁగావించినచో నాతనితండ్రికిఁగాని తాతకుఁగానిబిరుదములిచ్చిగౌరవింతురు. కొందఱు వీనికై ప్రాకులాడుదురు. మహమ్మదీయులలో కొన్నిశాఖలవారు తాము చచ్చినపిదప గొప్పగోరీలు కట్టించుకొనుటకై యావజ్జన్మమును కష్టపడుదురు. కొన్నితెగలు బిడ్డపుట్టినతోనే సమాధిని తయారుచేయుటకూడ నేనెఱుఁగుదును. ఇంతకన్న మానవుఁడు చేయదగిన ఘనకార్యము లేదని వారి యభిప్రాయము. సమాధియెంతగొప్పగా, నందముగానున్న నాతడంత భాగ్యశాలియని వారెన్నుదురు. వేరొక కొందఱు తపోరూపమగు కర్మ చేయుదురు. చేయరానికార్యములు చేసేది, ఏదేవళమునో కట్టించేది, స్వాములకు దిట్టముగా దుడ్డునర్పించి యనుగ్రహము సంపాదించేది, వారివద్ద స్వర్గమున కనుజ్ఞాపత్రము పొందేది, ఈలాటి దాతృత్వము తమ్ము పాపవిముక్తులుగఁ జేయుననియు. తామింక తప్పించుకొని నిర్భయముగా నిస్సంశయముగాఁ బోవచ్చుననియు వారు నమ్ముదురు. ఇట్లు ప్రతికర్మయు నేదియో యొక యుద్దేశ్యముతోఁ గూడియుండును.

కర్మనిమిత్తమేకర్మ. ప్రతిదేశమునకును ప్రాణతుల్యులగు కొందఱుకర్మపరులుందురు. వారు కర్మకొఱకే కర్మను చేయుదురు. వారు పేరు ప్రతిష్ఠలను గోరరు. స్వర్గమునైన నభిల

షింపరు. శ్రేయోదాయక మని కర్మను చేయుదురు. కొందరంతకన్నను మేలిభావముతో దీనులకుఁ దోడ్పడుచు లోకసంగ్రహము చేయుదురు. వారికి లోకశ్రేయమునందు తాత్పర్యమెక్కువ. ప్రేమయెక్కువ. కీర్తికామత్వము సామాన్యముగ వెంటనే ఫలింపఁజాలదు. ఏవృద్ధాప్యముననో, అవసానదశయందో మనకది ఫలించును. నిష్కామకర్మవలన మనకు ఫలము కలుగదా? కలుగును. దానివల్లనే యుత్తమఫలము కలుగును. నిస్స్వార్థత్వమే విశేష లాభకరము. కాని దానినభ్యసించుటకు మన కోపిక లేదు. ఆరోగ్య విషయమునఁ జూచినను అదియే చాల శ్రేయస్కరము. ప్రేమ, సత్యము, పరార్థ పరత్వము అనునవి శబ్దాలంకారములు మాత్రమే కావు. అవి మనము హెచ్చు మాదర్శములు. వానియందే తో శక్తివికాసమున్నది. ఐదు [illegible] లగాని, తుద [illegible] దు నిమిషములుగాని నెట్టి స్వలాభా[illegible] యు [illegible] తనభవిష్యమునుగూర్చియుగాని స్వర్గనరకములం గూ[illegible], [illegible]ట్టి విషయ[illegible] గూర్చియుఁగాన తలంపు పెట్టు [illegible] పనిచేయుఁ జాలునాతఁడు మహాధార్మిక బలసంప[illegible] [illegible] [illegible]చేయుట కష్ట[illegible]. కాని దానివిలువయు, ప్ర[illegible] [illegible] మనహృదయమునకుఁ దెలియును. ఈయాత్మని[illegible] [illegible] దఖండశక్తి ప్ర[illegible]టనమగుచున్నది. బాహ్యస్థాన [illegible]టు నాత్మసంయమమునందే యధికశక్తి వ్యక్తము [illegible] నాల్గుగుఱ్ఱములు [illegible] కొండనుండి క్రిందికి నిరాఘాటముగ [illegible] పరుగెత్తి పోవచ్చును; లేక బండివాఁడు గుఱ్ఱ

ములను పగ్గములఁబట్టి యాఁపవచ్చును. ఎంత యధికశక్తి బయల్వె డలుచున్నది? గుఱ్ఱములను పోనిచ్చుట యుండదా? నిల్పుట యుండదా? గాలిలో చాలదూరముపోయి యొకఫిరంగి గుండు నేలఁబడుచున్నది. ఇంకొకటి గోడకుతగిలి యాగిపోవుచు నాతాకుడుచే చాలనుష్ణశక్తిని పుట్టించుచున్నది. స్వార్థభావముతో బయల్వెడలు శక్తియంతయు వ్యర్థమైపోవుచున్నది. అది నీశక్తిని మరల నీవద్దకుఁ బంపదు. కాని నిగ్రహము నీశక్తిని వృద్ధిఁ బొందించును. ఈయాత్మనిగ్రహముచే బుద్ధ, క్రీస్తులను బోలు మహాసంకల్ప బలమును, దృఢస్వభావమును జనింపఁగలవు. అవివేకులీరహస్యమును గుర్తెఱుంగరు. కాని వారు జగత్తునంతను ఏలఁ జూతురు. మూఢుఁడైనను సరే; ప్రయత్నము చేయుచు వేచి యుండునేని లోకమునంతను పాలింపఁగలఁడు. అతఁడు కొంత కాలము తాళి రాజ్యమునందలి యవివేకకాంక్షను నిగ్రహింపనిమ్ము. ఆయాశ పూర్తిగా నీ[illegible]నే [illegible] మానవ కోటిలో నొక మేటి నాయకుఁడగును. కొన్ని జంతువులు కొన్ని యడుగులకు ముందుఁ జూడఁజాలవు. అట్లే మనలో ననేకులు కొన్ని యేండ్లకవ్వలఁ జూడఁజాలరు. మనజగత్తంతయు నొక చిన్న కొద్దిపాటి వలయము. దానికావల పరిశీలించుటకు మన కోపిక లేదు. కావుననే యవినీతులము కుత్సితులము నగుచున్నాము. ఇదియే మన దౌర్బల్యము. ఇదియే మన యశక్తత.

ఎంతకొద్దిపనియైనను తృణీకరింపరాదు. తెలియనివాఁడు

స్వలాభము కొఱకో, కీర్తికొఱకో కర్మచేయునుగాక! కాని ప్రతిమనుజుఁడు నంతకంత కున్నతభావములను గ్రహించి వాని నవలంబించుటకు యత్నించుచుండవలెను. "కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన" కర్మయందే మనకధికారమున్నది. ఫలమునందు లేదు. ఫలాపేక్ష విడువుము. దానిజోలియేల? నీ వెవ్వనికైన తోడ్పడఁగోరుదువేని అతనికి నీయందెట్టి భావముం డవలెనో యెన్నఁడు యోచింపకుము. నీవొకసత్కార్యమును గాని మహాత్కార్యమునుగాని చేయగోరుదువేని ఫలితమును గురించి యెన్నఁడును కలఁతనొందకుము.

ఈకర్మాదర్శమందొక్క చిక్కుగలదు. ప్రచండ కార్యోత్సాహము కావలెను; మనము నిరంతరము పనిచేయవలసినదే. పనిచేయక యొక్క త్రుటియైన బ్రదుకఁజాలము. ఇఁక విశ్రాంతి యేది? జీవిత సంగ్రామమున నొకపక్షము మనలను సుడివోలె గిఱ్ఱున త్రిప్పు కర్మ. రెండవపక్షము ప్రశాంతమై, ప్రపంచదూరమగు సర్వపరిత్యాగము. అంతయు నిశ్చలము, నిశ్శబ్దము, నిరాడంబరము. లతాకుసుమప్రకరము, జంతుసంతానము, శైలపంక్తులు, వీనితో ప్రకృతి గంభీరముగ శోభిల్లుచుండును. కాని యీరెంటిలో నేదియు సమగ్రముకాదు. కడలిలోతు [illegible]ళ్లనోఁ దిరుగాడు మత్స్యము పుడమిపై వైచినంతనే మీఁద జ[illegible]రము లేనందున విశీర్ణమై ఖండఖండములుగ విడిపోవునట్లే

యేకాంతమున కలవడిన మనుజుఁడు ప్రపంచకల్లోలమునఁ జిక్కె నేని నలిగిచచ్చిపోవును. జీవన సంరంభమునకు, కోలాహల మునకు నభ్యాసపడిన మనుష్యుడుఁ నిర్జనప్రదేశమున నివసింప జాలునా? అతఁడింతింతనరాని వ్యధపాలై తుదకున్మత్తుఁడగును. ఎవ్వఁడేకాంత ప్రశాంత మధ్యమున తీవ్ర కార్యోత్సాహమును, తీవ్రకార్యోత్సాహమందు నిభృత శాంతినిఁ గ్రోలఁగలఁడో యాతఁడే యాదర్శపురుషుఁడు. అతని కాత్మ సంయమ రహస్యము తెలియును. ఆతనికి మనోజయములభించినది. జనసంకులములగు నగరవీథులలో సంచరించుచున్నను గుహామధ్యమందుఁ గూర్చున్నట్లే యాతని మనస్సు ప్రసన్నమైయుండి కార్యోత్సాహముతో పొంగిపోవుచుండును. అదియే కర్మయోగమునకు పరమావధి. దానిం జేరితి వేని నీవు కర్మరహస్యమును సాధించినట్లే.

కాని మనమింకి నక్షరాభ్యాసమునే మొదలిడవలసియున్నాము, మనవంతుకు వచ్చు కర్తవ్యములం దీర్చుచు దినక్రమేణ స్వార్థ రాహిత్యము నభ్యసింపవలసియున్నాము. మనము కర్మలను జేయుచు మనలం బ్రేరేచిన భావములను పరిశీలింపవలెను. ప్రారంభవత్సరములలో తప్పక ప్రతిభావమును స్వార్థ జన్యముగనే యుండును. కానివిడువక కృషి చేసినచో కాలక్రమమున స్వార్థ మునశించి పూర్ణముగ పరార్థ ప్రాపకులము కాగలము. మన

మెల్లరము నిట్లే జీవయాత్రలు చేయుచు పోగా పోగా నొకనా టికి సంపూర్ణస్వార్థ రహితులము కాగలము. అట్టి స్థితిని చెం దిన ముహూర్తమందే మనశక్తులన్నియు కేంద్రీకృతము లగు ను. మనస్జ్ఞానము ప్రదీప్తమగును.

---

# కర్మయోగము.

——:o:——

## ద్వితీయాధ్యాయము.

"ఎవని స్థానమున వాడు గొప్ప"

సాంఖ్యసిద్ధాంత ప్రకారము ప్రకృతి సత్వరజస్తమస్సులను మూడు శక్తులచే నేర్పడుచున్నది. వీని భౌతిక రూపములను సమత, చలనము, జడత యని చెప్పవచ్చును. అంధకారమును, స్తబ్ధతయు తమస్సుయొక్క లక్షణములు; రజస్సనగా ప్రవృత్తి, ఆకర్షణ ప్రతిసారణములు దాని లక్షణములు; సత్వమీరెంటియొక్కయు సమస్థితి.

ప్రతి మానవునందు నీ త్రివిధశక్తులును గలవు. కొన్ని సమయములందు తమస్సు విజృంభించును; అప్పుడు మనము సోమరులమై కదలజాలము; కొన్ని యభిప్రాయములచేతనో, కేవల మాలస్యముచేతనో కట్టువడి నిష్ప్రయత్నుల మగుదుము. కొన్నివేళల రజస్సు ప్రకోపించును. కొన్నిపట్టుల నీరెంటియొక్కయు నిశ్చల సమావస్థ ప్రబలముగానుండును. మఱియు ప్రతిమనుష్యునం దీశక్తులలో నేదియో యొకటి ప్రవర్ధమానముగ నుండును. ఒకని లక్షణము నిష్క్రియత్వము, జాడ్యము, నిద్ర; ఇంకొకని లక్షణము శక్తి, ఉత్సాహము, ఉత్కర్ష; వేఱొకని లక్షణము ప్రశాంతము, ప్రసన్నము. ఇట్టి సృష్టియంతటను త్రివిధ ప్రకృ

వృత్తిజాతులందు వివిధశక్తుల విశిష్టవికాసరూపములను చూడఁ గలము.

కర్తవ్యయోగ విషయమై మూడుశక్తుల గూర్చియు ప్రత్యేకము గ వివరింపవలసియున్నది. ఇది యొక స్వాభావికమైనదియని తెలిసి వాని ప్రయోగవిధాన మెట్టిదో నిరూపించి మనము కర్మలను తెన్నుగా నిర్వర్తించుటకు అవసరము. మానవసమాజమును ధర్మ శ్రేణులతో సమకూర్చినది. ధర్మమునకు దేశ, స్వభావములను బట్టి భేదమో మనమెఱుంగుదుము; ఆయా దేశములు విశిష్టదేశము లలో విశిష్టధర్మములుగా నున్నవి. ఒక దేశములో ధర్మమనఁ బడు నొకానొక దేశములో కేవల మధర్మముగా పరిగణింపఁబడు చున్నది. ఉదాహరణము, ఒక దేశమునందు తోబుట్టువులు వివాహమాడుచున్నారు. ఇంకొక దేశములో నిది మిగుల నిషిద్ధము; ఒక దేశమున స్త్రీపురుషులు తాము వలచినవారి పెండ్లాడఁ గూడును; ఇంకొక దేశములో నది గొప్పదోషము; ఒక దేశములో స్త్రీపురుషుల కొకమారు వివాహమైన విడాకులు చెల్లవు; మఱొక దేశమందట్టి నియమము లేదు. ఇట్లే యనేక ధర్మ విషయములందు భిన్నదేశీయులకు నభిప్రాయభేదము కలదు. ఐనను విశ్వజనీనముగ నొక ధర్మశాస్త్ర మేర్పడవలెనని నా యూహ.

స్వధర్మ విషయము నింక నిరూపించెద. స్వధర్మమును గూర్చి వివిధజాతులలో వివిధాభిప్రాయములు కలవు; ఒక దేశములో నొక కార్యమును చేయుట తప్పు; ఆకార్యమునే మఱొక దేశములో చేయకుండుట యపరాధము. ఐనను స్వధర్మజ్ఞుఁడ-

గూడ నొక సార్వజనీ నాదర్శ ముండవలెనని మన యభిప్రా
యము. అట్లే యొక సంఘమునకు కొన్ని కార్యములు కర్త
వ్యములు; వానినే మఱొక సంఘము ఘోరముగా దలచి, కేవ
లము తద్వ్యతిరిక్త కార్యముల నవలంబించును. మనకు రెండు
మార్గములున్నవి. ఒకటి యవివేక మార్గము, సత్యమున కొ
క్కటేదారి, తక్కిన వన్నియు తప్పు అని తలచునది; రెండవది
వివేకమార్గము, మన మనస్స్థితుల తారతమ్యములం బట్టి ధర్మ
మును, స్వధర్మమును ప్రతి మానవునికిని భేదించునని యంగీక
రించును. ప్రధానాంశ మేమనగా, ధర్మ స్వధర్మముల యందు
విశేషముగ సంఘర్షణములు కలవనియు, నొక జీవితావస్థ యం
దు నొక పరిస్థితి సందర్భమునందు కర్తవ్య మగునది వేరొకప్పుడు
కాజాలదనియు మనము గుర్తెఱుంగవలెను.

ఇందుకు నిదర్శనము:— లోకమునం దవతరించిన యా
చార్య పురుషు లందఱు "దౌష్ట్య మును నిరోధింపకుము," అని
బోధమె పరమధర్మ మని యుగ్గడించియున్నారు. మనలో
కొంద రీధర్మమును పూర్తిగా నాచరింపబూనినచో సంఘవిచ్ఛి
త్తి యగుననియు, దుర్మార్గులు చెలరేగి మన ప్రాణమాన ధన
ములను కొల్లబెట్టుదురనియు మనకు తెలియును. ఈ ధర్మము
నొక్క దినము మాత్రమే యాచరించినను ముప్పు తప్పక వా
టిల్లును. ఐనను మన హృదయమందు సహజముగా "దౌష్ట్యము
ను నిరోధింపకు" మన్న ధర్మముయొక్క యథార్థము గోచరించు
చునే యుండును. ఇది సర్వోత్తమాదర్శ మని మనకు తోచును;
కాని యీ ధర్మమును మాత్రమే బోధించుట మానవులోటలో

విశేషభాగమును ఖండించుట యగును. అందుచే వారు నిత్య మును దోషములే చేయుచున్నట్లుతలచి యడుగడుగునకు, ప్రతి కార్యమునకు ధర్మసంశయ పీడితులగుదురు; అందుచే వారి చిత్త దౌర్బల్యము హెచ్చును. అట్టి యనవరతాత్మనిరసనముకన్న హానికరమగు దుర్గుణము వేరొండు లేదు. ఆత్మద్వేషికి మృత్యు ద్వార మప్పుడే యపావృతమై యున్నది; జాతివిషయమున గూడ నంతే.

మన ప్రథమకర్తవ్యము మనలను ద్వేషించుకొనకుండు ట; ఏలయన నభివృద్ధికి మొదట నాత్మవిశ్వాసము, అవ్వల నీశ్వరవిశ్వాసము నావశ్యకములు; ఆత్మవిశ్వాసహీనున్యునకు దేవునియందును విశ్వాసముండజాలదు. కాబట్టి భిన్నపరిస్థితుల యందు ధర్మము భిన్నరూపములు దాల్చుననియు, నధర్మము ను నిగ్రహించుట యనపరాధముమాత్రమే కాక కొన్ని యె డల కర్తవ్యము కూడ నగుననియు మన మంగీకరింపక తప్పదు.

గీతలలో ద్వితీయాధ్యాయమున నర్జునుడు బంధుమిత్రుల ను జంపుటకు మన సాడక యనిరోధమే ప్రేమధర్మమునకు పరమాదర్శమని రణవిముఖుడైనప్పుడు శ్రీకృష్ణు డాతని దాం భికుడు, పంద యనినిందించుటచూచి పాశ్చాత్యవారకు లాశ్చర్య మగ్నులు కావచ్చును. మనము నేర్చుకోవలసిన విశేషాంశ మొకటి కలదు: ద్వంద్వము లెల్లప్పుడు నత్యంతావస్థయందు తుల్యఫలము నిచ్చును. కాంతితరంగములు మిగుల మెల్లగా పోయినను, అతివేగముగా పోయినను గూడ చూడ జాలము. ధ్వని మిగుల మందమైనను, చాల హెచ్చయినను గూడ

వినజాలము. నిరోధానిరోధములకు గల భేదముకూడ నిట్టిదే. ఒకడు సోమరి, శక్తిహీనుడు నగుటచే నిరోధింపడు; ఇచ్ఛ లేక కాదు, చేతగాక. ఇంకొకడు తలచినచో దెబ్బతీయగలడు; కాని శత్రువును ముట్టక దీవించి పంపును. బుద్ధుడు తన సింహాసనమును, సర్వస్వమును పరిత్యజించెను. అది నిజమైనత్యాగము. కాని పుట్టుబోడియగు బిచ్చగానియందు త్యాగమున కవకాశ మెక్కడ? కావున నీ యనిరోధమును ప్రేమాదర్శమును గురించి మనము ప్రస్తావించునపుడెల్ల మన భావమేమో మనము జాగ్రతగా పరిశీలింపవలెను. మొదట నిరోధకశక్తి కలదో లేదో తెలియవలెను. శక్తియుండియు త్యజించి నిరోధింపకుండుమేని ప్రేమమయమగు నొక యుత్కృష్టకార్యమును గావించినట్లే; కాని నిగ్రహసామర్థ్యము లేక కూర్చుండియు ప్రేమధర్మ ప్రేరితుల మైతిమని భ్రమచెందినచో సంతసించెను హీనకృత్య ముండబోదు. అర్జునుడు తన యెదుట బారులు తీరిన సేనానివహములం జూచి భీతిల్లెను. తన ప్రేమచే, ప్రభువు నెడలను, దేశము నెడలను గల విధులను మఱచెను. కావుననే శ్రీకృష్ణుడు "నీ వాడునది ప్రజ్ఞావాక్యములు, చేయునది భీరుకృత్యము; లెమ్ము, యుద్ధము చేయుము!" అని మందలించెను.

అదే కర్మయోగముయొక్క ముఖ్యాభిప్రాయము. ఆ నిరోధమే పరమధర్మము, అది సంపూర్ణబల సంయుక్తము కావలెను, అధర్మ నిరోధ మీ యనిరోధధర్మమునకు సోపానము, అని యెవ్వడు గుర్తెఱుగునో యాతడే కర్మయోగి. ఈ యుత్తమాదర్శమును జేరకపూర్వ మధర్మ నిరోధమే కర్తవ్యము; కర్మ

చేయవలసినదే, కదన మొనరింపవలసినదే, శత్రువును వధింప వలసినదే. అప్పుడే, నిగ్రహాశక్తి యలవడినప్పుడే, యనిరోధము సుగుణముగ పరిగణింప బడును.

నే నొక మనుష్యుని చిరకాలముగా నెఱుగుదును. ఆతడు వట్టి మూర్ఖుడు, సోమరి; ఏమియు తెలియదు; తెలియవలెనన్న కుతూహలమును లేదు; కేవలము పశుతుల్యుడు. ఆతడొకసారి నావద్దకు "వచ్చి బ్రహ్మమును తెలియుటెట్లు? ముక్తిని పొందుటెట్లు?" అని ప్రశ్నించెను. "నీ వబద్ధమాడగలవా?" యని యడిగితిని. "చేత కాదు." అని బదులు చెప్పెను. "అట్లైన నసత్య మాడుట నేర్చుకొనుము. పశువులాగు, మొద్దువలె నుండుటకన్న కల్లలాడుట మేలు. నీవు జడస్థితియం దున్నావు. సర్వకర్మాతీతమగు శాంతప్రసన్నస్థితి నీ కెంతో దూరమం దున్నది. సోమరితనముచే చెడుపనిని గూడ నీవు చేయజాలవు." అని యంటిని. అయితే యాతని విషయము వేరు; ఆతనితో హాస్యముగ నట్లంటిని; కాని నా భావ మేమనగా, మనుజుడు పూర్ణశాంతిని బడయుటకు పూర్ణముగా ప్రవృత్తిపరుడు కావలెను.

నివృత్తి యెప్పుడును కూడదు. ప్రవృత్తి యనగా నిరోధమే. మానసిక భౌతికాది సకల క్లేశములను నిరోధింపుము. అట్లు చేయగలిగితివేని శాంతిని బడయ గలవు. "ఎవ్వనిని ద్వేషింపకుము, దుర్మార్గమును నిరోధింపకుము," అని చెప్పుట సులభమే, కాని యాచరణమం దది యెంతకష్టమో మనకు తెలియును. ప్రజల యెదుట మనము సహనశీలురం ప్రదర్శింప

వచ్చును, కాని మన గుండెలో గాయము లేక పోవునా? అసం
తోషఫలముగు శాంతిలేదు; సంతోషించుటయే మేలుగా తోచు
ను. నీవు ధనాశ యుండినయెడల లోకనిందకు జడియుదువేని ధనసం
పాదనకు సాగవు; కాని నీ హృదయము మహాన్నితులను ద్రవ్యము
మీఁదికి పరుగెత్తుచునే యుండును. ఇది కాపట్యము, నిష్ఫలము.
ప్రపంచమందు మనుష్యులెప్పుడు నంతులేని కష్టసుఖముల
కొంతవరకనుభవించిన యప్పటికి త్యాగము రాజాలదు; అప్పుడే
శాంతి రాగలదు. కావున నీ యధికారాది సకల వాంఛలను
సంతృప్తి పరచుము; కోరికలు తీరుటచేనే వాని నిష్ప్రయోజ
నత్వము నీకు తెలియఁగలదు. కాని ఏ యథాప్రవృత్తి యైన
నేకాని, ప్రవృత్తిని పూర్తిగ వదలినఁ గాని, నీకు శాంతిలేదు.
త్యాగము లేదు. అనేక మహాస్తోత్రములుగా నీ శాంతిత్యాగములం
గూర్చి యుపదేశించుచున్నారు. బాల్యము నుండియు మన
మీ ధర్మములంగూర్చి వినుచున్నాము; కాని యెట్టి స్థితిని జె
ందినవారము కానున్నాము? నేను లోకమందు సర్వభాగము తిరిగితిని,
కాని యింతవరకు మార్గమైన చూపినవాడు లేదు.

ప్రతివాని మనస్సునందు ప్రత్యేకాదర్శమును నేర్పాటని, దా
నిని సాధించుటకు ప్రయత్నింపవలెను. అన్యాదర్శములను స్వీకరించి
విఫలుల మగుటకంటె నిది యెంతయు నధిక వృద్ధికి సులభోపా
యము. ఒక చిన్న దృష్టాంతము చెప్పెదను, ఒక బిడ్డను పిలిచి
యిరువదిమైళ్లుడుగుల నడువ నాజ్ఞాపింపుము, ఆతఁడు దారిలో
చిక్కి చచ్చును, లేదా వెంట నొకఁడెత్తి నను చచ్చి
పెట్టెలో బెండకాయల సమాధానము చేసెదను. సామాన్యముగ

మనము నడుచుకొను రీతి యిదియే. ఏ సంఘమున గాని స్త్రీపురుషుల కందఱకు నొక్క తీరు మనస్సు, సామర్థ్యము, చాకచక్యము నుండ జాలవు; వారికి వేర్వే రాదర్శము లుండవలసినదే; యేయాదర్శముం జూచి కాని పరిహసించుటకు మనకు హక్కు లేదు. ప్రతి మనుజుడును తన యాదర్శముం జేరుటకై స్వీయశక్తికొలది పాటుపడనిమ్ము. నా ప్రమాణముచే నిన్ను నిర్ణయించుట కాని, నీప్రమాణముచే నన్ను నిర్ణయించుట కాని యుక్తము కాదు. రేగును, గోగును పోల్చి నిర్ణయింప బూనుట తప్పు; రేగుకు రేగును గోగుకు గోగును మాత్రమే ప్రమాణముగ జేసి బాగోగుల నిర్ణయముకు కూర్చుండుము.

నానాత్వమం దేకత్వము సృష్టివిధానము. మనుష్యుల లో వ్యక్తిభేద మెంతయున్నను అనుగున నేకత్వముకలదు. స్త్రీపురుషులందలి భిన్నస్వభావములు సృష్టి యందలి సహజ విభేదము. కావుననే మనము వారి నందఱ నేకప్రమాణముచే నిర్ణయించుట కాని, ఏకాదర్శానుద్ధుల జేయుటకాని ప్రమాదము. అట్లు చేసిన యో మనము త్రికల్లోలమున దగులక్కాని మనుజుల తన్ను ద్వేషించు కొనుచు దుర్మార్గుడై విశ్వాస హీను డగును. కావున ప్రతివానిని తన పరమాదర్శముం జేరుకొనుటకు ప్రోత్సహించుచు నాయాదర్శము సాధ్యమగునంత వఱకు సత్యము సమీపించులాగు చేయుటయే మన కర్తవ్యము. హిందూ ధర్మమున నీవిషయ మతి పురాతనకాలమందే గుర్తింపబడినది. హిందూధర్మ శాస్త్రములలో బ్రహ్మచర్య, గార్హస్థ్యాది వివిధాశ్రమములకు ప్రత్యేక ధర్మములు విధింపబడినవి.

హిందూశాస్త్రానుసారముగ ప్రతివ్యక్తికిని సామాన్య మానవధర్మములుమాత్రమే కాక-విశిష్ట ధర్మములు కూడా కలవు. హిందూ పురుషునకు బ్రహ్మచర్యముతో జీవితమారంభ మగును. ఆవల పాణిగ్రహణము చేసి గార్హస్థ్యమున ప్రవేశించును; వార్ధక్యమున వానప్రస్థమును కడకు సర్వపరిత్యాగము నొనరించి సన్యాసమును స్వీకరించును. ప్రతి యాశ్రమమునకు ప్రత్యేక ధర్మములు గలవు. ఏ యాశ్రమమునకుగాని యింకొక యాశ్రమముకన్న నాధిక్యము లేదు; బ్రహ్మచర్యముకన్న గార్హస్థ్య మెక్కువకాదు; వీధులూడ్చు పాకివాడును సింహాసనాసీనునితో సమానుడే. రాజు నొక్కమాఱు సింహాసనమునుండి దించి పాకిపని జేయుమనుడు ఆతడెట్లు నిర్వాహము చేయునో చూతెము. పాకివానికే పట్టము గట్టి యాతని పరిపాలన జూడుడు. ప్రపంచ మధ్యమందుండువాని కంటె ప్రపంచమును పరిత్యజించిన వాడధికుడని చెప్పుట నిరర్థకము; ప్రపంచమును విడిచి స్వేచ్ఛా జీవనమును హాయిగా జరుపుటకంటె ప్రపంచమందుండియు నీశ్వరసేవ సలుపుట యధిక ప్రయాస. తొల్లింటి చతురాశ్రమములును క్రమశః గార్హస్థ్య సన్యాసములను రెండాశ్రమములుగా మారినవి. గృహస్థుడు సంసారమందుండి చతుర్విధపురుషార్థములను నెరవేర్చును. సన్యాసి మోక్షసాధనకై కృషి చేయుచు భక్తి జ్ఞానముల నుపదేశించును. గృహస్థధర్మములను సరిగా నిర్వహించు టెంత దుర్లభమో మహానిర్వాణ తంత్రము నందలి యీ క్రింది శ్లోకములవలన తెలియగలదు.

శ్లో. బ్రహ్మనిష్ఠో గృహస్థ స్స్యాత్ బ్రహ్మజ్ఞానపరాయణః
యద్య త్కర్మ ప్రకుర్వీత తద్బ్రహ్మణి సమర్పయేత్॥
మాతరం పితరంచైవ సాక్షా త్ప్రత్యక్ష దేవతామ్
మత్వా గృహీ నిషేవేత సదా సర్వప్రయత్నతః॥
తుష్టాయాం మాతరి శివే! తుష్టే పితరి పార్వతి!
తవ ప్రీతి ర్భవేత్ దేవి! పరబ్రహ్మ ప్రసీదతి॥
ఆసనం శయనం వస్త్రం పానం భోజన మేవ చ
యత్తత్ సమయ మాజ్ఞాయ మాత్రే పిత్రే నియోజయేత్॥
శ్రావయే న్మృదులాం వాణీం సర్వదా ప్రియ మాచరేత్
పిత్రో రాజ్ఞానుసారీ స్యాత్ సత్పుత్రః కులపావనః॥
ఔద్ధత్యం పరిహాసంచ తర్జనం పరిభాషణమ్
పిత్రో రగ్రే న కుర్వీత యదీచ్ఛే దాత్మనో హితమ్॥
మాతరం పితరం వీక్ష్య నత్వోత్తిష్ఠేత్ ససంభ్రమః
వినాజ్ఞయా నోపవిశేత్ సంస్థితః పితృశాసనే॥
మాతరం పితరం పుత్రం దారా నతిథిసోదరాన్
హిత్వా గృహీ న భుంజీయాత్ ప్రాణైః కంఠగతై రపి॥
వంచయిత్వా గురూన్ బంధూన్ యోభుంక్తే స్వోదరంభరః
ఇహైవ లోకే గర్హ్యో సౌ పరత్ర నారకీ భవేత్॥
జనన్యా వర్ధితో దేహో జనకేన ప్రయోజితః
స్వజనైః శిక్షితః ప్రీత్యా సోఽధమ స్తాన్ పరిత్యజేత్॥
ఏషా మర్థే మహేశాని! కృత్వా కష్టశతాన్యపి
ప్రీణయేత్ సతతం శక్త్యా ధర్మో హ్యేష సనాతనః।
స ధన్యః పురుషో లోకే స కృతీ పరమార్థవిత్

బ్రహ్మనిష్ఠః సత్యసంధో యో భవేద్భువి మానవః
న భార్యాం తాడయేత్ క్వాపి మాతృవత్ పాలయేత్ సదా
నత్యజేత్ ఘోరకష్టేఽపి యది సాధ్వీ పతివ్రతా॥
తిష్ఠేషు స్వీయదారేషు స్త్రియమన్యాం న సంస్పృశేత్
దుష్టేన చేతసా విద్వా నన్యథా నారకీ భవేత్॥
విరలే శయనం వాసం త్యజేత్ ప్రాజ్ఞః పరస్త్రియా
అయుక్త భాషణంచైవ స్త్రియం శౌర్యం న దర్శయేత్॥
ధనేన వాససా ప్రేమ్ణా శ్రద్ధయా మృదు భాషణైః
సతతం తోషయేత్ దారాన్ నాప్రియం క్వచి దాచరేత్॥
యస్మిన్ నరే మహేశాని! తుష్టా భార్యా పతివ్రతా
సర్వో ధర్మః కృతస్తేన భవతీప్రియ ఏవ సః
చతుర్వర్షావధి సుతాన్ లాలయేత్ పాలయేత్ పితా
తతః షోడశపర్యంతం గుణాన్ విద్యాంచ శిక్షయేత్॥
వింశత్యబ్దాధికాన్ పుత్రాన్ ప్రేరయేత్ గృహకర్మసు
తతస్తాన్ తుల్యభావేన మత్వా స్నేహం ప్రదర్శయేత్॥
కన్యాఽప్యేవం పాలనీయా శిక్షణీయాఽతి యత్నతః
దేయా వరాయ విదుషే ధనరత్న సమన్వితా॥
ఏవం క్రమేణ భ్రాతౄంశ్చ స్వసృభ్రాతృసుతానపి
జ్ఞాతీన్ మిత్రాణి భృత్యాంశ్చ పాలయేత్తోషయేత్ గృహీ
తతః స్వధర్మ నిరతా నేకగ్రామ నివాసినః
అభ్యాగతా నుదాసీనాన్ గృహస్థః పరిపాలయేత్॥
యద్యేవం నాచరేద్దేవి! గృహస్థో విభవే సతి
పశురేవ స విజ్ఞేయః స పాపీ లోకగర్హితః॥

నిద్రాలస్యం దేహయత్నం కేశవిన్యాస మేవచ
ఆసక్తి మశనే వస్త్రే నాతిరిక్తం సమాచరేత్॥
శూరః శత్రౌ వినీతః స్యాత్ బాంధవే గురుసన్నిధౌ
జుగుప్సితాన్ న మన్యేత నావమన్యేత మానినః॥
సౌహార్దం వ్యవహారాంశ్చ ప్రవృత్తిం ప్రకృతిం నృణాం
సహవాసేన తర్కైశ్చ విదిత్వా విశ్వసేత్ తతః।
స్వీయం యశః పౌరుషంచ గుప్తయే కథితంచ యత్
కృతం యదుపకారాయ ధర్మజ్ఞో న ప్రకాశయేత్॥
విద్యాధనయశోధర్మాన్ యతమాన ఉపార్జయేత్
వ్యసనం చాసతాంసంగం మిథ్యాద్రోహం పరిత్యజేత్॥
జితేంద్రియః ప్రసన్నాత్మా సుచింత్యః స్యాత్ దృఢవ్రతః
అప్రమత్తో దీర్ఘదర్శీ మాత్రాస్పర్శాన్ విచారయేత్॥
సత్యం మృదు ప్రియం ధీరో వాక్యం హితకరం వదేత్
ఆత్మోత్కర్షం తథానిందాం పరేషాం పరివర్జయేత్॥
జలాశయాశ్చ వృక్షాశ్చ విశ్రామగృహ మధ్వని
సేతుః ప్రతిష్ఠితో యేన తేన లోకత్రయం జితమ్॥
సంతుష్టౌ పితరౌయస్మి న్ననురక్తాః సుహృద్గణాః
గాయంతి యద్యశోలోకాః తేన లోకత్రయం జితమ్॥
సత్యమేవ వ్రతం యస్య దయా దీనేషు సర్వదా
కామక్రోధౌ వశే యస్య తేన లోకత్రయం జితమ్॥
విరక్తః పరదారేషు నిస్పృహః పరవస్తుషు
దంభ మాత్సర్యహీనో యస్తేన లోకత్రయం జితమ్॥

జ్ఞానినా లోకయాత్రాయై సర్వత్ర సమదృష్టినా
క్రియన్తే యేన కర్మాణి తేన లోకత్రయం జితమ్॥"

"గృహస్థుడు బ్రహ్మనిష్ఠుడై బ్రహ్మజ్ఞానపరుడై సమస్త కర్మలను బ్రహ్మమునందు సమర్పింపవలెను. తల్లి దండ్రులను ప్రత్యక్షదైవములుగా నెంచి వారిని సర్వదా సేవింపవలెను. వారు సంతసించినచో పార్వతీ పరమేశ్వరులు సంతసింతురు. పుత్రుడు సమయమును కనిపెట్టి వారికి శయ్యాసనములను, వస్త్రములను భోజనపానీయములను సమకూర్పవలెను. వారితో మృదు భాషణలు చేయుచు వారికి ప్రియ మొనరింపవలెను. వారి యాజ్ఞానువర్తి యగువాడే సుపుత్రుడు, కులపావనుడు. వారి యెదుట పతిశయమును, పరిహాసమును, తర్జనమును, అధిక ప్రసంగమును చేయరాదు. వారిని చూచుటతోనే సంభ్రమముతో నమస్కరించి నిలువవలెను; వారి యాజ్ఞ యగువరకు కూర్చుండరాదు. గృహస్థుడు తన ప్రాణములు పోవుచున్నను, తల్లి దండ్రులను, భార్యాపుత్రులను, అతిథులను, సోదరులను విడిచి భుజింపరాదు. గురువులను బంధువులను వంచించి కుక్షింభరుడై భుజించు నాతడు ఇహలోకమున నింద్యుడై యవ్వల నరకమును జెందును. ఈదేహము తండ్రిచే నీయబడినది, తల్లిచే పెంపబడినది, స్వజనులచే శిక్షింపబడినది, కాన వారిని పరిత్యజించు నాత డధముడు. ఎన్నివందల కష్టములు పడినను వారిని సర్వదా శక్తికొలది సంతోషపెట్టవలెను. ఇదియే సనాతన ధర్మము. ఎవ్వడు బ్రహ్మనిష్ఠుడై సత్యసంధు డగునో యాతడే ధన్యుడు, కృతార్థుడు. భార్య నెప్పుడును కొట్టరాదు,

తల్లినివలె నెల్లప్పుడు కాపాడవలెను; సాధ్వీ, పతివ్రత యగునా మెను ఘోరకష్టము సంభవించిన విడువరాదు. స్వదార యుండగా దుర్మనస్కుఁడై పరకాంతను స్పృశించువాఁడు నరకమును పొందును. ఏజనమునందు పరకాంతాసంగోద్యమమును వాంఛమును పరిత్యజింపవలెను; స్త్రీలముందఱ నయుక్త సంభాషణము కూడదు. స్వశౌర్యమును ప్రకటింపరాదు. ధన వస్త్రములచేతను, శ్రద్ధాప్రేమలచేతను, మృదుభాషణములచేతను భార్యను సర్వదా సంతోషపెట్టవలెను; ఆమె కెప్పుడు నప్రియము నాచరింపరాదు. ఎవ్వనివలన పతివ్రతయగు పత్ని సంతుష్టి నొందునో యాతఁడు సర్వధర్మములును నెఱవేర్చినట్లు; ఆతనియం దీశ్వర ప్రీతి చెందును. పుత్రులను నాలుగేండ్లవఱకు తగఁ లాలించుచు పాలింపవలెను; ఆవల పదునారేండ్లవఱకు విద్యాబుద్ధులను నేర్పవలెను. ఇరువదేండ్లుదాటిన పిదప గృహకార్యములందు ప్రవేశపెట్టవలెను. అవ్వల సమానునిగా నెంచి స్నేహము చూపవలెను. కన్యనుగూడ నిట్లే పాలించుచు శ్రద్ధతో విద్య గఱపవలెను; అవ్వల నామెను ధనరత్న సమన్వితనుగా జేసి విద్వాంసుఁడగు వరున కీయవలెను. ఇట్లు క్రమముగా సోదరులను, సోదరీ సోదరుల పుత్రులను, జ్ఞాతులను, మిత్రులను, భృత్యులను పాలించుచు సంతోషపఱుపవలెను. ఆవల స్వధర్మప్రవృత్తులగు నేకగ్రామవాసులను, అభ్యాగతులను, మిత్రామిత్రులు కాని యుదాసీనులను, పాలింపవలెను. సంపద కలిగియు నిట్లాచరింపని గృహస్థుఁడు పశువు, పాపి, జననింద్యుఁడు. నిద్ర, ఆలస్యము, దేహరక్షణ, కేశవిన్యాసము, అన్నవస్త్రాసక్తి నధికముగా చే

చేయరాదు. శత్రుసేనల శౌర్యమును, గురుబాంధవులందు
వినయమును జూపవలెను. అవగుణములను వర్ణింపరాదు, మాన
వనములను తిరస్కరింపరాదు. మనుజుల సౌహార్ద్యమును, వ్యవహార
ములను, ప్రవృత్తిని, స్వభావమును, సహవాసముచేతను ఆలో
చనచేతను గ్రహించి పిమ్మట విశ్వసింపవలెను. స్వయశమును,
పరాపవాదమును, గర్వమును, చేసిన మేలును, ప్రకటింపరాదు. వి
ద్యను, ధనమును, కీర్తిని, శస్త్రమును ప్రయత్నముతో నార్జింపవలె
ను. వ్యసనములను, దుస్సాంగత్యమును, అసత్యమును, ద్రోహము
ను వర్జింపవలెను. తేజస్వియును, ప్రసన్నచిత్తుడును, సవిచారుడును,
స్నేహశీలుడును, అక్రోధుడును, కృతజ్ఞుడును నై సమయసంబంధ
ములను విచారించి చేయవలెను. సత్యము, మృదువు, ప్రియము,
హితకరము నగు వాక్యమును పలుకవలెను. గోష్ఠిని, సభ
లందు మితముగ పలుకవలెను. ఎవ్వాని సంగ్రామసమయమునను, ప్రతా
పమును, పరాక్రమము ప్రభావములను, వంశములను వర్ణించు
వారు ముగ్గురు లోకత్రయమును జయించుచున్నారు. ఎవ్వాని
బంధుమిత్రులు సంతుష్టులో, స్త్రీజనులు అనురక్తులో, ఎవ్వాని
యశస్సును లోకములు గానముచేయునో ఆతడు లో
కత్రయమును జయించుచున్నాడు. ఎవ్వాడు సత్యవ్రతుండై, దీన
దయాళువో, శీతకామక్రోధుడో ఆతడు లోకత్రయమును
జయించుచున్నాడు. ఎవ్వాడు పరదారలయందు విరక్తుడో, పర
వస్తువులందు నిస్పృహుడో, దంభమాత్సర్యహీనుడో ఆతడు
లోకత్రయమును జయించుచున్నాడు. ఎవడు జ్ఞానియై సమదృ

ష్టి కలిగి లోకయాత్రకొఱకు సర్వకర్మలను చేయుచున్నాడో ఆతడు లోకత్రయమును జయించుచున్నాడు.

ఈ గృహస్థధర్మము కర్మయోగమునం దొక భాగము. ఆపల నింకొక శ్లోకము కలదు:—

"న బిభేతి రణాద్యోవై సంగ్రామే-ప్యరాఙ్ముఖః
ధర్మయుద్ధే మృతో వాపి తేన లోకత్రయం జితమ్.

"ఎవడు రణమున్న వెఱువడో, సంగ్రామమునుండి పారి పోడో ఆతడు ధర్మయుద్ధమున మృతుడైనను లోకత్రయమును జ యించుచున్నాడు." ఇందుచే నొకనికి ధర్మమగునది యింకొకనికి ధర్మము కాదని తెలుచున్నది. మఱియు నొక ధర్మ మూర్ధ్వగతి కని, ఇంకొకటి యధో గతికిని హేతువగునని భేదముచేయుటలే దు. ప్రతిధర్మమునకు నొక స్థాన మున్నది; కాలానుసారముగ మనము కర్తవ్యములను నిర్వహింపవలెను.

ఎట్టి దౌర్బల్యమును కూడదనుటయే దీనికంతకును సా రాంశము. మన శ్రుతి స్మృతులలో ఋషులు చేసిన యుపదేశ ములందెల్ల నిదియే నాకు నచ్చినది. వేదము లడుగడుగునకు "అభయమ్, అభయమ్," అని ఘోషించుచునే యుండును. భయపడకుము, దేనికని భయపడకుము. భయము దౌర్బల్య చిహ్నము. పురుషుడు లోకుల హాస దూషణములను లెక్కింప క తనవిధిని నెరవేర్పవలెను.

ఈశ్వరారాధనకై ప్రపంచమును విడిచి పోవునాతడు, పరోపకారార్థము ప్రపంచమం దుండువారి నీశ్వరసేవకులు కా దనరాదు. దారాపుత్రాదులతో ప్రపంచమం దుండువారు

ప్రపంచ పరిత్యాగులను తిరుగుబోతు లనుటయు గూడదు. ఎవరి స్థానమున వారు గొప్ప. ఇందుకు దృష్టాంతముగా నొక కథ చెప్పెదను.

పూర్వ మొకరాజు తనదేశమునకు వచ్చిన సన్న్యాసుల నెల్లను. "ఎవ రెక్కువ—ప్రపంచమును విడచి సన్న్యాసియైనవాడా, ప్రపంచమందుండి గృహస్థ ధర్మముల నాచరించువాడా?" అని యడుగుచుండెను. ఎందఱో ప్రత్యుత్తర మియ్య జూచిరి. కొందఱు సన్న్యాసియెక్కుడనిరి. రాజందుకు ఋజువు కోరెను. కాని వారు చూపలేకపోయిరి. అందుకు వారిని పెండ్లాడి గృహస్థులుకండని రాజాజ్ఞాపించెను. ఇంకొందరు వచ్చి "స్వధర్మాచరణగల గృహస్థుడే గొప్పవాడనిరి." వారివలన గూడ రాజు దాఖలా కోరెను. వారు చూప జాలనందున గృహస్థులు కండని యాజ్ఞాపించెను. చివరకొక పడుచు సన్న్యాసి వచ్చెను. ఆతనిగూడ రా జెప్పటియట్ల ప్రశ్నించెను. అందుకాతడు "ఎవరిస్థానమున వారు గొప్పయని బదులు చెప్పెను. రాజు నిదర్శనము కోరెను. "నీవుముందుగా నాతో వచ్చి కొన్నాళ్లుండిన నిదర్శనము చూపెద" నని సన్న్యాసి చెప్పెను. రాజు సరేయని బయలు దేరెను. ఇరువురును కలసి యెన్నియో దేశములు దాటిపోయిరి. కడకొక గొప్ప రాజ్యమున ప్రవేశించిరి. ఆ రాజధానియందు మహోత్సవము జరుగుచుండెను. రాజును, సన్న్యాసియు గీతావాద్యములను జయజయధ్వానములను వినిరి. జనులు విలాసముగా నలంకరించుకొని వీధులలో గుమి గూడిరి. ఏదియో ప్రకటన చేయు చున్నారు. రాజును సన్న్యాసియు నీవేడుక చూచుటకై నిలిచిరి. ఆ దేశపు రా

జపుత్రిక రాకొమారులలో నొక్కని స్వయంవరము చేసికొనును
నని ప్రకటించిరి. జగదేక సుందరియగు నా కన్యకాపాతివ్రత్యము,
తన కనురూపుడగు నొక జగన్మోహనాకారుని పెట్టినట్లు నిశ్చ
యించెను. ఆ దేశాధీశుడును తన యనంతరము తన రాజ్య స
ర్వస్వము నల్లునకు పట్టము గట్టెదనని చాటించెను. అట్టి యసా
సమాన రూప లావణ్యములం గూర్చి పలువురలు విని యుం
డుటచే నా దేశములో రాకుమారులు పాశ్చాత్య మహారాజకుమారులందరు
నత్తై చను చెంచిరి. ఇదివరలో నెన్నియో మారులెక్కి స్వయం
వరోత్సవములు జరిగెను. కాని యామెకు నచ్చిన వారెవ్వరు లేక
పోయెను. నేడు మరల స్వయంవర దినము. రాజకుమారులందరు
ను నానాలంకారములతో నెప్పటివలె విహరించుచున్న సుందరులౌ
సజ్జాల వస్త్రాలంకారాభూషితులై రమణీయమగు విగ్రహములవలె గ
భామధ్యమున నధివసించి యుండిరి. కవులును గాయకులు సంగీతమా
ర్గములు వారి గుణాధిక్యము గొనియాడుచుండిరి. ఇంతలో రా
కుమారి యొక యందలమునై సభాస్థలిం బ్రవేశించి రాజ్యశ్రేణికై
ప్రక్కలం జూచెను. ఒకరొక్కని నామే వినుచు కటాక్ష
వీక్షణములం బరికించుచు వాహనులను "ముందుకు
నడుపు" డని యుచ్చరించుచుండెను. సభ యంతయు
జట్టివచ్చెను. కాని యామె మనసు నాకర్షింప జాలిన సత్య
తోహరుడెక్కడ! రాజకుమారులు హతమనోరథులై విన్న
బోయిరి. ఈమారుకూడ స్వయంవరయత్నము విఫలమేనా?
ఇంతలో నొకవెనుండి యొక సన్యాసి [illegible] దిగి
వచ్చిన ద్యుమణియోయనున సభాస్థలమును జేరవచ్చెను. అతి

వాకమూలనిలచి యీయుత్సవమును దిలకించుచుండెను. ఇం
తలో పల్లకి యాతనియొద్దకువచ్చి నిలచెను. రాజపుత్రి యం
దుండి దిగి పుష్పహారమును నాతనికంఠమున వైచెను. ఆ సన్యాసి
“ఛీ! ఇదియేమి? నేను సన్యాసిని. నాకు పెండ్లియేల?” అని
యాహారము దీసివైచెను. ఆ దేశాధీశ్వరుడు నాతడు పేదయ
గుటచే సంశయించుచున్నాడని తలచి “నా కొమార్తెతో ని
వ్వాహము నాయర్ధరాజ్యమును, నాయనంతరము నా రాజ్యసర్వ
స్వము నీ కగుద” నని యాహారమును మరల నాసన్యాసి
కంఠమున వైచెను. కాని యాతడు దానిని మరల తీసివైచి “ఛీ!
నాకు పెండ్లి యక్కఱలే” దని యటనుండి చివాలున లేచిపో
యెను.

ఆ రాజపుత్రి కాతనియందలి మోహాతిశయమున మేరలేకుండె
ను. “అతని పెండ్లియైన నాడవలెను, లేదా చావవలెను” న
కృతనిశ్చయురాల య్యెను. ఎట్లైన నాతని బ్రతిమాలి వెం
తేవలెనని యాతనివెంట నరిగెను. ఈ చిత్రమును దిలకించుచున్న
మన సన్యాసి రాజుతో “రాజా! వీరి వెంబడింతము, రమ్ము,”
అని యిరువురు వారి వెనుక దూరదూరముగా మెల్లమెల్లగ
బోవుచుండిరి. రాజకుమారిని వలచిన సన్యాసి యెన్నియో యా
మడలు నడచి యొక వనము ప్రవేశించెను. ఆకన్యకయు నాతని
వెంట నడవిలో జొచ్చెను. మన రాజును సన్యాసియు వారిని
వెనుదగిలియే యుండిరి. ఈ యడవిలో నా సన్యాసి యెఱుగ
ని దారి లేదు. అందుచే నాతడు చిక్కుత్రోవలం బట్టి యొక్క-
డ హఠాత్తుగా నదృశ్యు డాయెను. రాజకుమారి యాతనికై

వెదకి వెదకి వేసారెను. కాని తన ప్రియుని గానలేకపోయెను. ఆఘోరాటవిలో దారి తెన్ను తెలియక యేడువసాగెను. అప్పుడు మన రాజును, సన్న్యాసియు నామెను సమీపించి "అమ్మా! యేడువకుము; ఈ యడవినుండి యావలకు నీకు దారిచూపెదము. కాని యిప్పుడు చీకటి పడుచున్నది. ఇదిగో, యొక పెద్ద వృక్షము. దీనిక్రింద నేటికి శయనించి రేపకడనే లేచి పోవుదము." అని చెప్పిరి.

ఆచెట్టుపై నొక చిన్నపిట్ట తన భార్యతోను, మూడు పిల్లలతోను నివసించుచుండెను. పక్షి క్రింద చూచెను. ముగ్గురు మనుష్యులు కానబడిరి. అంత నది భార్యతో "ప్రేయసీ! ఏమి చేయుదము? అతిథులు వచ్చిరి; శీతకాలము; నిప్పైనను లేదే;"
అని యెందో యెగిరిపోయెను. మఱు నిముసముననే యగ్గితో
యొక కట్టెను నోటకఱచి తెచ్చి యా యతిథులముందు
డిచెను. అందుపై వారు నాలుగుచిదుకులు చేర్చి మంట
కాని యా పక్షికి తృప్తికాలేదు. "ప్రేయసీ! ఏమిచే
చేసికొనిరి. హారముగ నిచ్చుటకై మనయొద్ద నేమియులే
యుదము? వార కాకలిబాధగా నుండును. మనము గృహ
దు; పాపము, వారి వచ్చినను పూజించుటమనవిధి. నే
స్థలము; మన యింటికె వచ్చి చేయవలెను; వీరికి నాదేహము ని
నిప్పుడు చేతనగునదేమో బడి యాహుతి యయ్యెను.
చ్చెదను." అని యా యగ్నిలో కాని వారియత్నము నిష్ఫల
అతిథులు దానిం గాపాడజూచిరి;
మయ్యెను.

ఆమగపక్షి తన పతి కృత్యముంగాంచి యిట్లనుకొనెను, "ఇక్కడ ముగ్గురు మనుష్యులున్నారు; కాని వారి క్షుధ దీర్చుటకై యొక్కటే పక్షి కలదు. అది చాలదు. నాపతి సంకల్పము నీడేర్చుట నావిధి. నా దేహమును గూడ నిచ్చి వారికి బుభుక్షాపూర్తి చేసెదను." అని యామె చితింజొచ్చి యసువులు విడిచెను.

తమ తల్లిదండ్రుల కార్యముజూచి యా మూడు పులుగు బిడ్డలు నిట్లూహించెను. "అయ్యో! మన తల్లిదండ్రులు చేతనగుదానిం జేసిరి అయినను వీరి యాకలి యింకను తీరలేదు. వారు పూనినపని కొనసాగించుట మన ధర్మము; కాన మనముకూడ నగ్నిం జొత్తము." ఇట్లని యవియున్నియు మంటలో దూకెను.

ఈ దృశ్యముగాంచిన ముగ్గురు నాశ్చర్యచకితులైరి. ఆ పక్షుల నట్లే భక్షింపక విడిచి యా రాత్రి నిరాహారముండిరి. తెల్లవారగనే రాజును, సన్యాసియు నా రాకొమార్తెకు మార్గముం జూపిరి. ఆమె తండ్రికడకు మరలి పోయెను.

అంతట సన్యాసి రాజుతో నిట్లనెను, "రాజా! ఎవని స్థానమునందు వాడు గొప్పయని నీ విప్పుడు చూచి యుంటివి. నీవు ప్రపంచమును దూరముచేసి, ఆపక్షులవలె నేక్షణమందైన నితరులకై ప్రాణమిచ్చుటకు సిద్ధముగా నుండుము. ప్రపంచమును పరిత్యాగము చేసిన సౌందర్యరాశియగు కన్యకారత్నమును వివాహరాజ్యమును తృణప్రాయముగ

నిరసించిన యాసన్యాసియు నతనివలె నుండుము. నీవు సంసారివిగా నుండగోరుదువేని నీ జీవితమును పరోపకారార్థము వినియోగింపుము; సన్యాసివిగా నుండ గోరుదువేని, సౌందర్య ధనాధికారములవంక కన్నెత్తియైన చూడకుము. ఎవనిస్థానమున వాడు గొప్ప, కాని యొకని స్వధర్మ మింకొకని ధర్మము కానేరదు.

# కర్మయోగము.

## తృతీయాధ్యాయము.

### కర్మరహస్యము.

ఇతరులకు భౌతికావశ్యకములను దీర్చి వారికి తోడ్పడుట మహనీయమైనదే; కాని యావశ్యకాధిక్యమును, సాహాయ్య పరిమితిని బట్టియు తోడ్పాటు గణ్యాతిశయమగును. ఒక మనుష్యుని యొక్క గంటకాల నక్కఱ నొకగడియ నేర్పైన దీర్చుదుమేని యాతనికి నిశ్చయముగా సహాయము చేసినట్లే; ఒక్క సంవత్సరకాల మాతని కక్కఱలు తీరుచు నిలుగడుంచి చేసినచో నింకను సహాయముచేసినవారమగుదుము; ఇక శాశ్వతముగ నతని కక్కఱలోపమును లేకుండ జేసినచో నతనికంతకు నుత్తమసాహాయ్య ముండబోదు. ఆత్మజ్ఞానము మాత్రమే మన దుఃఖముల నిత్యముగ నాశనము జేయగలదు; తదితర జ్ఞానమేదైనను తాత్కాలికముగ మాత్రమే సంతుష్టి నీయగలదు. కావున నాధ్యాత్మిక సహాయమే మానవునకు మానవుని కొసగగల యుత్తమ సహాయము; అధ్యాత్మోపదేశకులే మానవజాతికి మహోపకారులు; కావుననే వారెల్లప్పుడును మానవులందెల్ల నధికారప్రాబల్యము నందుచున్నారు. అధ్యాత్మమే మన జీవనమునందలి సమస్తోద్యమములకును మూలాధారము. అధ్యాత్మబలసంపన్నుడు తలచిన

చో నన్నివిషయములందును బలాఢ్యుడు కాగలడు; ఆత్మబల హీనునకు శరీరావశ్యకములైనను తీరజాలవు. అధ్యాత్మసహాయము తరువాత జ్ఞానసహాయమును పేర్కొనదగును; జ్ఞానదాన మన్నవస్త్రదానములకన్న నెంతో యుత్కృష్టమైనది; జ్ఞానమే జీవనము; అజ్ఞానమే మరణము; కావున ప్రాణదానముకన్నను జ్ఞానదానమే ప్రశస్తము. జీవన మంధకారబంధురము, దుఃఖభూయిష్ఠము నైనచో నద్దాని ప్రయోజనమేమి? జ్ఞానమునకు పిమ్మట భౌతిక సాహాయ్యము చెప్పనగును. కావున పరోపకారమును గూర్చితలంచునప్పుడు భౌతికసహాయముకన్న చేయదగిన దేద్దియు లేదని మనము తలంపరాదు. అది నిత్యసంతుష్టి నీయజాలమిచే నన్నింటికన్న సంత్యము, నధమము నైనది. భోజనముచే నాకలిబాధ పోవును. కాని మరల వచ్చును; ఎట్టియపేక్షయు లేకుండ సంతుష్టుడ నైనప్పుడే నాదుఃఖమంతయు నంతరింపగలదు. అప్పు డేలాటి యలజడియు, నెంతెటి విషాదవృత్తమును నన్ను చలింప జేయజాలవు. కనుకనే మనల నాత్మబలస పన్నులుగ జేయు నాధ్యాత్మికసహాయము ప్రధమగణ్యము. ఆవల జ్ఞానసహాయమును, పిమ్మట భౌతిక సహాయమును గణనకు వచ్చును.

భౌతికసహాయమువల్లనే ప్రపంచముయొక్క దుఃఖమంతయు తొలగజాలదు; మానవప్రకృతి మారసంతవరకు విషయాపేక్షలు తప్పవు; తత్ఫలితముగ దుఃఖమును విధాయకమే; ఎట్టి భౌతికసహాయముగాని దుఃఖమునుండి పూర్ణముగ తప్పింపజాలదు. ఇందుకు ప్రతిక్రియ మానవజాతి పరిశుద్ధమగుటతప్ప

వేరు లేదు. అజ్ఞానమే మనము చూచు సకల దుఃఖములకును మూలకారణము. మానవులు జ్ఞానవంతులు, శుద్ధాంతఃకరణులు, ఆత్మబలసంపన్నులు నైనప్పుడే లోకమునుండి దుఃఖము మాయమగును, అందాక నింతే. మనము దేశమునందలి ప్రతి గృహమును ధర్మశాలగా మార్పవచ్చును; దేశమునంతను వైద్యాలయములతో నింపవచ్చును; అయినను. మానవస్వభావము పరివర్తనమొందువరకు లోకమిట్లు శోకమయముగ నుండక మానదు.

మనము సర్వదా కర్మ చేయవలెనని భగవద్గీతయందు చదువుచున్నాము. సకలకర్మయు సహజముగా శుభాశుభములతో మిశ్రితమై యున్నది. ఎవనికో యొకనికి లాభింపనికర్మను మనము కావింపలేము; ఒకనికి నష్టముకాని కార్యమును మనము చేయలేము. ప్రతికార్యమును శుభాశుభమిశ్రమమే; అయినను సర్వదా తప్పక పనిచేయవలెనని యాదేశము. సదసత్కర్మలు రెండును ఫలజనకములే. సత్కర్మ సత్ఫలమును, దుష్కర్మ దుష్ఫలమును ఇచ్చితీరును. కాని యీరెండును నాత్మబంధములే. కర్మబంధమునుండి తప్పించుకొనుటకై గీత "సంగరహితముగ కర్మ చేయుము, అదినీయాత్మను బంధింపజాలదు." అని యుపాయము బోధించుచున్నది. కర్మయందు అసక్తత్వమనునే మాణిక గ్రహింప యత్నింతము.

ఇదియే గీతల ప్రధానభావము; నిరంతరము కర్మచేయుము; కాని దానియందు సంగముంచకుము. మన హృదయము నే యొక సరోవర మనుకొందము; అందు ఉండు ప్రతికెర

గము సంభవించినను నిశ్చయముగ సహించి [illegible], ఆ తరంగములు మరల [illegible] కొన్ని విడచి పోవును. అట్టి సాధ్యశక్తు [illegible] సన్న్యాసము. మనము చేయు ప్రతికార్యమును, [illegible]; అవి [illegible], [illegible] పనిచేయు [illegible]. [illegible]. ఈ [illegible] సన్న్యాస [illegible]. [illegible] నిక్షేపించుచున్నది. [illegible] వము [illegible]; [illegible] చేయుచు, [illegible] లాచరించుచు [illegible]; ఆ [illegible] లేక [illegible] పరివర్తన మొందును. ఈ [illegible] నా [illegible] చేయుము [illegible]: అం దుచే నాతడు [illegible]; [illegible] గములు [illegible] శక్తి యగును. [illegible] చేయుచు. సత్కార్యము లాచరించు [illegible] వాని [illegible] మంచి దగును; అందుచే నాత డిష్టము లేకున్నను, సత్కార్య [illegible]

విధిగా చేయును. ఒక మనుష్యుఁడు సర్వదా సద్భావనాశీలుఁడై సత్కార్యానుష్ఠాతయై, యప్రతిహతమగు సదాచరణప్రవృత్తి కలిగి యున్నప్పుడు, ఒక వేళ దుష్కార్యమును చేయఁగోరినను ఆతని మనస్సు సత్సంకల్పబలముచే నట్లు చేయనీయదు; ఆతని మనోవృత్తులు ఆ యసత్కార్యమునుండి మళ్లించును. ఆతడు తన యుత్తమచిత్తవృత్తులకుపూర్ణముగ వశుఁడగును. ఇట్టి లక్షణము కలిగినప్పుడే యుత్తమస్వభావ మలవడెనని చెప్పుదుము.

తాబేలు తనతలను, పాదములను లోనికి ముడుచుకొని పొడిచినను, చంపినను, వెలికి రానట్లే శమ దమ సంపన్నుఁడగు వాని స్వభావము నిశ్చలమై, నిర్వికారమై, సుప్రతిష్ఠిత మగును. ఆ త ఁ డ ం త శ్శ క్తు ల ను ని య మి ం చు ను; ఆతని యిచ్ఛ లేక యేదియు నాతని యింద్రియముల నాకర్షింప జాలదు. ఈ నిరంతర సద్భావనల వేలను, సత్సంస్కార వ్యాప్తి చేతను సదాచరణప్రవృత్తి దృఢతరమై మన మింద్రియములను నిగ్రహింప జాలుదుము. ఈ రీతిగనే సుస్వభావ మేర్పడును; అప్పుడే మనుజుఁడు సత్యమును గ్రహింపఁగలఁడు; అట్టివానికిక నెప్పటికిని భయము లేదు; ఆతఁడెట్టి దుష్కార్యమును చేయఁజాలఁడు; ఆతని నెట్టి సహవాసమున నుంచినను సరే, యే హానియు నుండదు. ఈ సుస్వభావము కన్నను శ్రేష్ఠమగు స్థితి వేరొండు కలదు; అది మోక్షేచ్ఛ. సమస్త యోగములకును మోక్షమే గమ్యస్థానము; అన్నియు మనల నచ్చటి కమానముగఁ జేర్చును. ఇది స్మృతియం దుంచుకొనదగిన విషయము. ధ్యానమార్గము బుద్ధియును, ప్రార్థనలు [illegible]

నే కర్మవలన మనము చేరవచ్చును. బుద్ధుడు కర్మపరుడైన జ్ఞాని; క్రీస్తు భక్తుడు, కాని యుభయులు నేక సిద్ధినే పడసిరి. ఇక్కడనే చిక్కు. మోక్షమనగా పూర్ణవిమోచనము—పాప బంధమునుండి విమోచనము, పుణ్యబంధమునుండియు విమోచనమే. స్వర్ణశృంఖలము కూడ నినుప సంకెల వలెనే సంకెల. నా వ్రేలిలో ముల్లు నాటినది; దానిని తీయుటకు వేరొక ముల్లు వాడెదను; అది వచ్చినంతనే రెంటిని పారవేయుదును; రెండును ముండ్లే కావున రెండవ ముల్లును సైతము వదిలము చేయును. అట్లే దుష్ప్రవృత్తులను సత్ప్రవృత్తులవల్లను, కుసంస్కారములను సుసంస్కారముల చేతను పారద్రోలి దుశ్శీలమును నాశము చేయవలెను, లేదా మనస్సునందొకమూల నిగ్రహించి యణచిపెట్టవలెను; కాని యావల సత్ప్రవృత్తులనుగూడ నిరోధించుట యావశ్యకము. ఈ విధముగా 'కర్మసంగుడు' 'నిస్సంగుడు' కాగలడు. కర్మచేయుము; కాని కర్మను గాని చింతనుగాని నీ మనసున గాటముగ నాటనీయకుము; ఆ తరంగములను వచ్చి పోనిమ్ము. మహాత్కార్యములు నీ భుజస్కంధముల వలనను, మస్తిష్కము వలనను నిర్వాహము లగును గాక, అవి నీ యాత్మ నెంతమాత్రము నంటనీయకుము. ఇది చేయుటెట్లు? మనము సంగయుక్తముగ జేయు ప్రతి కార్యముయొక్క సంస్కారమును నిలిచియుండుట యనుభవ విషయమే.

నే నొకనాడు వందలకొలది జనులను చూచియుండవచ్చును. వారిలో నాస్నేహితు డొక్క డుండ వచ్చును; రాత్రి

విశ్రమించినప్పుడు పగలుచూచిన ముఖముల నన్నింటిని నేను స్మరింప యత్నింపవచ్చును, కాని యా ముఖమే — ఒక నిమిషమాత్రము కంటబడిన, నా ప్రేమస్థానమైన ముఖబింబమే మరలమరల నా మనోదర్పణమున ప్రతిఫలించును; ఇతరములన్నియు మాయమగును. ఈ ప్రత్యేక వ్యక్తియెడ నాకు గల యనురాగముచే నాతని ముఖము తక్కిన వానికన్న నా హృదయమున గాఢతర సంస్కారమును గావించెను. శరీర శాస్త్ర రీత్యా సంస్కారము లన్నియు సమానములే; నే చూచిన ముఖము లన్నియు నా కంటిపాపపై ప్రతిఫలించెను; ఆ రూపములను మస్తిష్కము గ్రహించెను; ఐనను, అవి యన్నియు మనస్సుపై సమానముగ పనిచేయుటలేదు. చాల ముఖములు ప్రాయికముగ నాకు నూతనములు కావచ్చును, ఎన్నడును నా తలపున బారక పోవచ్చును; కాని యొం వదన మొక్కటియు నొక్కించుక దృష్టిగతమైనంతనే నా మనస్సునం దెన్నియో సంబంధములను గల్పించుకొనెను. బహుశః ఆతని రూపము నేండ్లకొలదిగ నూహించు కొనియుందును, ఆతనిగురించి యెన్నియో యంశములు తెలిసికొనియుందును, ఈ నూతన ముఖ సందర్శనముచే నామనస్సున నిద్రాణములై యున్న యనేక స్మృతులు ప్రబుద్ధములు కావచ్చును; అన్ని రూపములకన్నను ఈ ముఖరూపము నాకు నెట్లధికముగ గోచరమగుటచే మనస్సునందు దాని సంస్కారము విశేషముగ సంకితమగును.

కావున సంగము వలదు; అంగములు పని చేయనిమ్ము; మస్తిష్కము పని చేయనిమ్ము; అనవరతము పనిచేయుము;

కాని యొక్క తలపైన నీ మనస్సునను కలచకుండుమనుగాక. ఈ పుడమిపైనన్యదేశీయునివలె, మార్గస్థునిలాగున పని చేయుము; అహోరాత్రములు పనిచేయుము; కాని యాపనిచే బద్ధుడవు కాకుము; బంధము భయంకరమైనది. ఈ ప్రపంచము మన యావాసము కాదు, మన మెక్కి పోవుచున్న పెక్కు సోపానములలో నిది యొక్కటి. "సర్వ ప్రకృతియు నాత్మకొఱకే, ఆత్మ ప్రకృతి కొఱకుగాదు". అన్న సాంఖ్యమహాసూక్తిని స్మరింపుము. ప్రకృతి యాత్మశిక్ష కొఱకే యున్నది; దానికి వేరు ప్రయోజనము లేదు. ప్రకృతిచే నాత్మకు జ్ఞానమును, జ్ఞానముచే మోక్షమును లభ్యమగుచున్నవి, ఇదియే ప్రకృతియొక్క పరమార్థము. మన మీ సత్యమును నిత్యమును స్మరింతుమేని ఎన్నడును ప్రకృతి సంగులము కాజాలము, ప్రకృతి మనము చదువవలసిన యొక్క పుస్తకమనియు, చదివి సారమును గ్రహించిన పిదప నది నిరర్థకమనియు మన మెఱుగగలము. అట్లు చేయుటకు బదులుగా మనలను ప్రకృతితో నైక్యము భావించుకొనుచున్నాము; పురుషుడు ప్రకృతికొరకమనియు, ఆత్మ దేహముకొఱకనియు తలచుచున్నాము; పొట్టకొఱకే బ్రతుకనిము, బ్రతుకుకై పొట్ట కాదనియు నెంచుచున్నాము; ఇదియే మన మెప్పుడును చేయు తప్పు; ప్రకృతిని మనముగనే భావించి దానియందు మనము సక్తుల మగుచున్నాము; సంగము కలిగినంతనే మన యాత్మయందు గాఢ సంస్కార మేర్పడి, మనలను బద్ధుల గావించి మోక్షమును గాక బంధనములగు మనచే క్రియల చేయించును.

నీవు ప్రభువువలె కర్మ చేయవలెను కాని బానిసవలె కాదు, ఇదియే గీతా యుపదేశసారము; నిరంతరము కర్మ చేయుము; కాని బానిసకర్మ కాదు. అందఱు నెట్లు కర్మ చేయుచున్నారో నీవు చూచుటలేదా? ఎవ్వనికి నించుకైన శాంతిలేదు; వానిలో ననేకులు నూటికి తొంబదితొమ్మండుగురు బానిసలవలె కర్మ చేయుదురు, తత్ఫలితము దుఃఖము; అది యంతయు స్వార్థబుద్ధితో గూడిన కర్మ. స్వాతంత్ర్యముతో కర్మ చేయుడు! ప్రేమతో కర్మ చేయుము! ప్రేమయను శబ్దము గ్రహించుట దుస్సాధము; స్వాతంత్ర్యము నబ్బువఱకు ప్రేమ లేదు. బానిసలో నెన్నటికి ప్రేమ యుండుట కవకాశము లేదు. నీ వొక బానిసను కొని, గొలుసులతో కట్టి నీకై పనిచేయించినచో వాడను కష్టపడి పనిచేయును, కాని వానియందు ప్రేమ యుండ నుండదు. అట్లే మనము ప్రపంచమునకై కర్మ చేయుచుండ మనయందు ప్రేమ యుండనియెడల, మన కర్మ బానిస కర్మ కాజాలదు. బంధుమిత్రుల కొఱకును, మన యాత్మ కొఱకును చేయు కర్మ యంతయు నిట్టిదే. స్వార్థముతో కూడిన కర్మ బానిసకర్మ; దానికి యొక ప్రమాణము కలదు. ప్రతి ప్రేమకార్యమున సుఖము నిచ్చును: ఆనందము కలిగించని ప్రేమ కార్యమేదియు నుండ నేరదు. సత్యము, జ్ఞానము, ప్రేమ, ఇవి నిత్యము వొకదానితో నొకటి సంబంధము కలిగియున్నవి; మూడును నొక్కటి; ఒకటి యున్నచో మిగిలినవి కూడ నుండవలసినదే; అవి యద్వితీయమగు సచ్చిదానందము యొక్క మూడు రూపములు. వ్యవహారమునందు ఆ సత్తే ప్రపంచ మగుచున్నది; ఆ చిత్తే మన

యజ్ఞాన మగుచున్నది; ఆ యానందమే మానవహృదయమం దలి పరిశుద్ధ ప్రేమ యగుచున్నది. కావున యథార్థ ప్రేమచే ప్రేమించువారికిగాని ప్రేమింపబడు వారికిగాని దుఃఖము కలుగజాలదు. ఒక పురుషు డొక స్త్రీని ప్రేమించె ననుకొందము. ఆమె తననే కాని యన్యులను తలంపనైన రాదని యాతని కోరిక; ఆతడనుమానముచే నామె ప్రతిచర్యను ఆగ్రహముతో పరికించును; ఆమె తనవద్దనే కూర్చుండవలెను, తనవద్దనే నిలువవలెను; తనతో భుజించవలెను, తన యాజ్ఞవొప్పక కదలవలెను. ఆత డామెకు బానిస; ఆమె కూడ తనకు బానిస కాగోరును. అది ప్రేమ కాదు; ప్రేమనామము తాల్చిన బానిసయొక్క వికృత మోహము. అది దుఃఖకర మగుటచే ప్రేమ కాజాలదు; ఆమె తన వాంఛలను చెల్లింపకున్న నాతనికి బాధకలుగును. ప్రేమవల్ల నెప్పుడును దుఃఖము కలుగదు; ప్రేమ యానందము నిచ్చును; అట్లుకానిచో నది ప్రేమకాదు; దేనినో ప్రేమ యని భ్రమించుచున్నాము. ఎట్టి యనుమానమును, దుఃఖమునును గలుగకుండ నీవు నీ భార్యను, బిడ్డలను, లోకమును, నిఖిల జగత్తును ప్రేమింపజాలితివేని నిస్సంగత్వమునకు తగిన స్థితి యుండుందువు.

శ్రీకృష్ణుడు (అర్జునా! ఇటు చూడుము, ఒక్క ముహూర్తము నేను కర్మ చేయుట విరమించినచో విశ్వసృష్టియు విలయమొందును. కర్మవల్ల నాకు ప్రయోజన మేమియు లేదు; నే నేక ప్రభుడను; ఐనను ఎందుకు కర్మ చేయుచున్నాను? నాకు లోకమునందు గల ప్రేమచే.' అని చెప్పుచున్నాడు.

ఈశ్వరుఁడు ప్రేమపూర్ణుఁడు, కనుక సంగరహితుఁడు. సత్యమగు ప్రేమ మనలను నిస్సంగులుగ జేయును. ఎచ్చట సంగముకలదో, ఐహిక విషయానురక్తి యున్నదో అది భౌతికము, జడపరమాణువుల యాకర్షణము; అది రెండు పదార్థములను దగ్గరకాకర్షించి యట్లు చేర్పజాలనిచో దుఃఖము కలిగించును; కాని యథార్థప్రేమ భౌతిక సంగముపై నాధారపడదు. అట్టి ప్రియులు వేలకొలది మైళ్లదూరముగ నుండుదురుగాక. వారి ప్రేమ యట్లె వెలుగుచుండును; దానికెట్టి భంగమును లేదు, దానిచే నెట్టి దుఃఖమును కలుగదు.

ఈ నిస్సంగత్వమును సంపాదించుటకు చాలా పెక్క జన్మ పట్టును; కాని యీ స్థితిని జెందినమీఁదట ప్రేమయొక్క పరమావధిని జేరి ముక్తిని పొందినట్లే; ప్రకృతిబంధము మనమండి జారిపోవును; దానియథార్థరూపము మనకు గోచరమగును; అది మనకొరకికి నెట్టి శృంఖలములను నిర్మింపజాలదు; మనము పూర్ణస్వాతంత్ర్యముం జెంది కర్మఫలము గూర్చి విచారింపము. ఫలిత మేమైనను మనకేకావలెను.

నీవు నీ బిడ్డల కేమైన నిచ్చి ప్రతిఫల మపేక్షింతువా? వారి నిమిత్తము పాటుపడుట నీ విధి; అంతే గాని ప్రశ్న లేదు. నీవొక మనుష్యునికొరకు గాని, పురముకొరకు గాని, రాజ్యము నిమిత్తముగాని పాటుపడునప్పుడు పిల్లలబిడ్డలయెడ గల భావముతోనే పనిచేయుము, ఏ ప్రతిఫలమును నిరీక్షింపకుము. నీవవిరత వితరణశాలివై నీవిచ్చు ప్రతిపదార్థమును లోకమునకు కుచితార్థముగ నెట్టి ఫలాపేక్షయు లేక యొసంగితివేని, ఆ కర్మవలన నీ కెట్టి

సంగమును గలుగదు. ఫలాకాంక్షయుంటే సంగము కలదు.

బద్ధునివలె చేయు కర్మ స్వార్థపరతను సంగమును కలి
గించునట్లే ప్రభువువలె చేయు కర్మ నిస్సంగత్వజన్యమగు నిరతి
శయానంద మొసంగును. మనము సామాన్యముగ ధర్మమును,
న్యాయమును గురించి మాట్లాడుదుము; కాని లోకమునందవి
యర్థవిహీనములగు బాలప్రలాపములని గుర్తించుచున్నాము.
మానవుల ప్రవృత్తిని శాసించు విషయములు రెండు: బలము,
దయ. బలమును ప్రయోగించుట యనగా నెల్లపుడును స్వార్థభా
వమును ప్రయోగించుటే. స్త్రీపురుషులందఱును స్వకార్యసాధ
నకై తమ యధికారమును శక్తిని సాధ్యమగునంతవఱకు విని
యోగింతురు. దయయే స్వర్గము; మనము సాధుజనులము కా
గోరుదుమేని దయాశాలురము కావలెను. ధర్మమును, న్యాయ
మును గూడ దయమీదనే నిలువవలెను. కర్మఫలాపేక్ష మన
యాత్మాభివృద్ధికి భంగకరము; అది కడకు దుఃఖమునుగూడ
తెచ్చును. ఈ దయాదానములు నాగరికతలోనికి వచ్చుటకు
మరొక మార్గమున్నది. అదేమన, మనము సగుణబ్రహ్మము
నందు విశ్వాసముంచలేని సమస్త కర్మల నర్పించినగాని ఫలము
వచ్చును. ఇందు సకల కర్మఫలమును పరమేశ్వరునకే వదలు
చున్నాము; ఇట్లు భావించుటచే మానవకోటినుండి యెట్టి
ప్రతిఫలమును కోరుటకును మనకు హక్కులేదు. ఉత్సాహముతో ని
రంతరము కర్మచేయుచు నిస్సంగులమై యున్నాము. పద్మపత్రము
ను జలము తడుపజాలనట్లే కర్మయు స్వార్థరహితుని ఫలా
సక్తిచే బంధింపజాలదు. స్వార్థరహితుడు, సంగవర్జితుడునగు పురు

షుఁడు జనసంకీర్ణమై పాపకూపమగు పురమధ్యమందున్నను కలుషితుఁడు కాజాలఁడు.

ఈ సంపూర్ణస్వార్థత్యాగమున కొక్క కథ నిదర్శనముగా నిచ్చెదను:— కురుక్షేత్రసంగ్రామము ముగిసిన పిమ్మట పాండవు లశ్వమేధయాగ మొనరించి పేదల కమూల్యములగు మహాదానములు కావించిరి. ప్రజలందఱు నా విభవమును, వితరణమును గాంచి యచ్చెరు వంది యిట్టి యాగమును మున్నెన్నఁడు కనివిని యెఱుంగమనిరి. యాగము పూర్తియయ్యెను; అంత నొక ముంగిస వచ్చెను. దాని దేహము సగము పసిఁడి వన్నె, సగము బూడిదరంగు. అది యాగశాలయందు నేలపై పొరలి చుట్టు నున్న జనులతో "మీరందఱు కల్లలాడుచున్నారు, ఇది యాగమే కాదు!" అనెను. అంతట వారు "ఏమి! ఇది యాగము కాదా? ఎంత ధనము, ఎన్ని యాభరణములు దానముచేసిరి! ఎందఱు దరిద్రులు భాగ్యవంతులై నుల్లాసము నొందుట లేదు? ఎవరింత యద్భుతమగు యాగము గావించిరి!" అని విస్మితులైరి. అందుకు ముంగిస యిట్లు బదులు చెప్పెను: "మున్నొక గ్రామమున నొక బ్రాహ్మణుఁడుండెను. ఆయన కొక భార్య, కొమరుఁడు, కోడలు కలరు. ఆయన మిగుల దరిద్రుఁడు. ఉపదేశములు చేయుచు, చదువులు చెప్పుచు, పొట్టపోసికొనుచుండెను. ఇట్లుండ నొక మూఁడేండ్లు కఱవు వచ్చెను. బ్రాహ్మణుని స్థితి చెప్పనలవిగానంత దుర్భరమయ్యెను. ఆ కుటుంబమునకు కొన్నాళ్లు గంజైన లేకుండెను. ఒకనాఁటి యుదయమున నాఁటికిఁ గొంత అదృష్టవశమున కొంచెము యవలు దొరికెను.

వానిని వండుకొని నలుగురు నాల్గు పాళ్లుగా జేసి తినబోవుచుం డిరి. ఇంతలో ద్వారము తట్టినట్లయ్యెను. ఆయన తలుపు తెరచె ను. ఎదుట నొక యతిథి ప్రత్యక్షమయ్యెను. తోడనే యాబ్రా హ్మణుడు "స్వామీ దయచేయుడు, మా యాతిథ్యమునందుకొ ని మమ్ము కృతార్థుల గావింపుడు "అని యాదరముతో లోని కి గొంపోయి తన యన్నభాగమును వడ్డించెను. అతిథి కది యొ క్కపట్టైనను కాలేదు. ఆయన యాతురతతో "అయ్యో! చంపివేసితివే! పదిదినములనుండియు నన్నము లేక యుంటిని. ఇప్పుడీ స్వల్పాహారముచే నా యాకలిచిచ్చు మఱింత ప్రజ్వలిం చుచున్నది. "అనెను. అంత నా బ్రాహ్మణుని భార్య తన భాగ మునుగూడ నతిథికి వడ్డించుమని చెప్పెను. కాని భర్త వలదనె ను. అందు కామె "ఈయన యన్నాతురుడు; మనము గృహ స్థులము; ఈయన యాకలి తీర్చుట మన విధి, మీవద్ద నింక నిచ్చుట కేమియు లేనందున నేను మీ గృహిణినగుటచే నా భాగము నిచ్చుట ధర్మము." అని చెప్పి తన యాహారము నొ సగెను. ఆతడు దానిని గూడ నారగించి యింకను కడుపు మం డుచున్నదనెను. అందుకు కొడుకు "నా పాలుకూడ గైకొనుడు, తండ్రి కర్తవ్యముం దీర్చుటకై పుత్రుడు సాయము చేయుట ధర్మము." అని తన భాగమును గూడ నిచ్చెను. కాని యతిథి యాకలి శమింపలేదు. అందుచే కోడలుకూడ తన యాహారము ను సమర్పించెను. అంతతో నాయనకు సంతృప్తియై యా కుటుం బమును దీవించి పోయెను. ఆరాత్రి యాకలికి తాళలేక యు నలుగురున మేనులు విడిచిరి. ఆయోగిరమున నాల్గుకణములు

నేలపైబడగా నా దేహమును వానిపై పొరలించితిని. అప్పుడీ యర్ధభాగమును బంగారమయ్యెను. కడమ సగము కూడ స్వర్ణవికారముగ జేయుటకై యట్టి త్యాగము చేసిన తావు వేరొం డెందైన కలదేమోయని ప్రపంచమంతయు తిరుగుచున్నాను, కాని ప్రయోజనము లేకున్నది. ఇందుచేతనే నే నిది యాగము కాదని చెప్పితిని".

భారతవర్షమునం దిట్టి త్యాగభావము దూరమగుచున్నది. మహాపురుషులు నానాట మృగ్యులగుచున్నారు. నా బాల్యమున నింగ్లీషు నేర్చుకొనునప్పు డొక చిన్న కథ చదివితిని. అందులో నొక బాలుడు పాటుపడి సొమ్ము గడించి తన ముసలి తల్లికి కొంత యిచ్చినందుకు మూడు నాలుగుపుటల మేరకు శ్లాఘించి యుండిరి. ఏలకో? ఏ హిందూ బాలుడును దాని నీతి యేమో యెన్నటికిని గ్రహింపజాలడు. ఎవరికి వారే యనెడి పాశ్చాత్య భావమును విన్నపిదప నేను దానియర్థమును గ్రహింప గలిగితిని. కొందరు సర్వమును స్వార్థముగ వినియోగించుచు తల్లిదండ్రులను, భార్యాపుత్రులను నెంతమాత్రము నరయబోరు. అది ఎన్నడు నెచ్చటను గృహస్థునియొక్క పరమధర్మముగ నుండదు.

కర్మయోగమన నేమో మీకిప్పుడు విశదమగుచున్నది. ఎవ్వనికైన, మృత్యుముఖమందు సహితము, నెట్టి సంకోచమును లేక తోడ్పడుటే కర్మయోగము. కోటిసారులు నిన్ను మోసగించుదురు గాక, నీవేమియు ప్రశ్నింపరాదు, ఏమి చేయుచుంటిమో యోచింపరాదు. నీవు దీనుల కిచ్చిన దానములం గూర్చి

దంభములు కొట్టకుము, వారికృతజ్ఞతకై ప్రతీక్షింపకుము; మరియు నీవు త్యాగము చేయుట కవకాశ మిచ్చినందులకు నీవే వారికి కృతజ్ఞతా బద్ధుడవై యుండుము. ఉత్తమ సన్యాసిగా నుండుటకంటె నుత్తమ గృహస్థుడుగా నుండుట బహు దుర్లభమని నా కిప్పుడు స్పష్టమగుచున్నది; యథార్థ కర్మ జీవనము యథార్థ సన్యాస జీవనముకన్న కష్టతరము కాకున్నను, దానితో తుల్యకష్టమనుట నిస్సంశయము.

# కర్మయోగము.

———:o:———

## చతుర్థాధ్యాయము

———

### స్వధర్మమన నేమి?

కర్మయోగమును గూర్చి పరిశీలించునప్పుడు స్వధర్మమన నేమో తెలియుట యావశ్యకము. నే నేకార్యమైనను చేయ వలసినయెడల, ప్రథమమున నాకది కర్తవ్యమనియు, అవ్వాల కరణావశ్యమనియు తెలిసికొనవలెను. స్వధర్మము వివిధజాతులందు వివిధరీతులుగా నగుచున్నది. మహమ్మదీయులకు కోరాను చెప్పునది స్వధర్మము; హిందువులకు వేదవిహిత మగునది స్వధర్మము; క్రైస్తవులకు బైబిలు శాసించునది స్వధర్మము. భిన్నజీవితావస్థలను, భిన్నకాలములను, భిన్నజాతులను బట్టి స్వధర్మమునకు భిన్నభావములు కన్పట్టుచున్నవి. స్వధర్మమన నేమో స్పష్టముగా నిర్వచించుట కష్టము. దాని ప్రత్యక్ష ప్రయోగములను ఫలితములను తెలిసికొన్నచో దాని భావము నొకవిధముగ గ్రహింపగలము. ఒక పని మన యెదుట జరుగునప్పుడు మనము సహజ స్వభావముచే గాని, యభ్యాసవశముచే గాని యొక మానసిక వేగమునకు లోనై యొక విధముగా ప్రవర్తింతుము. ఆ యావేగము కలిగినప్పుడు మనము మనస్సునందు దాని యుచితము నాలోచింతుము; ఒక తరుణమున నా పరిస్థితులయందు దాని కేతీరు

గ నాచరించుట యుక్తమని తలతుము; ఇంకొక తరుణమున, నా పరిస్థితులయందే యదేతీరుగ నాచరించుట యయుక్తమని యెంతుము. జనులు తమ యంతరాత్మ ననువర్తించుట స్వధర్మ మని సామాన్యముగ భావింతురు. కాని యే కార్యమునైన స్వధర్మముగా జేయున దేది? ఒక క్రైస్తవుడు తనకు లభించిన గోమాంసఖండమును స్వప్రాణరక్షణకై భక్షింపకున్నను, అన్యప్రాణమును గాపాడుట కీయకున్నను, తన స్వధర్మమును తప్పినట్లు తలంచును. కాని యొక హిందువు డా మాంసశకలమునే తాను తినుటకుగాని, సాటి హిందువున కిచ్చుటకుగాని సాహసించినచో తన స్వధర్మమును మీరినట్లెంచుకొనును; హిందూ సామ్రాజ్యపతనము, శిక్షాపద్ధతియు నాతని నట్లు భావింపజేసెను. గత శతాబ్దమున హిందూ దేశములో ఠగ్గులను దొంగ లుండిరి; అగపడిన వారి నందరను జంపి వారి మూటముల్లెల గొనిపోవుటయే తమ స్వధర్మముగ నాచరించుచుండిరి; ఎన్ని ప్రాణములను గొన్న నంత యుత్తములమని వారి యాశయము. ఒకడు శాంతిలో నింకొకని యాదృచ్ఛికముగ తుపాకివాత వేసినేని ఘోరకృత్యము గావించితినని మహాపరితాపముం బొందును. కాని యుద్ధమందే సైనికుడుగ నొక్కనిగాక యిరువదిమందిని జంపినను తన కర్తవ్యమును లెస్సగా నిర్వర్తించినట్లు సంతుష్టాంతరంగుడగును. కావున స్వధర్మమును నిర్ణయించుటది మన మొనరించు కార్యము కాదు. స్వధర్మమునకు బాహ్యనిరూపణను జేయుట యసంభవము. ఐనను, అంతరంగ పక్షమునుండి స్వధర్మము కలదు. ఈశ్వర సన్నిధిం

జేర్చు కర్మ యంతయు సత్కర్మ, అందుచే నది స్వధర్మము; అధోగతికి దించు కర్మ యంతయు దుష్కర్మ, అందుచే నది స్వధర్మేతరము. అంతరంగ దృష్టిని జూచినచో కొన్ని కర్మలు మనల నుద్ధరించి యభ్యున్నతికి దెచ్చును, కొన్ని హానుల జేసి పశుప్రాయుల నొనరించును. కాని యెట్టి కర్మలు సర్వజనులకు, సర్వావస్థలయందు నెట్టి ప్రవృత్తులు పుట్టించునో రూఢిగా నిర్ణయించుట యసాధ్యము. అయినను స్వధర్మ మనగా సర్వకాలములందును, సర్వదేశములందును, సర్వజాతుల మానవులచేత సంగీకృతమైన సర్వజనీనభావ మొక్కటి కలదు; అది సంస్కృతమున సూత్రరూపముగ నున్నది; దాని యర్థమేమనగా: "ఎవ్వరిని హింసింపకుము; అహింస పరమధర్మము; హింస పాపము."

భగవద్గీత జన్మమునకు, జీవితావస్థకు సంబంధించిన శాస్త్రవిషయములను సూక్ష్మతమముగా ప్రస్తావించును. జన్మమును, జీవితావస్థయు సంఘమునందలి స్థానమును వ్యవహార విషయములందు వ్యక్తుల నైతికదృష్టిని నియమించును. అందుచే మనము జన్మించిన సంఘముయొక్క యాచారములకు, నుద్యమములకు ననుగుణముగ నభ్యున్నతి నొందించు కర్మను జేయుట మనకర్తవ్యము. సర్వసంఘములందు, సర్వదేశములందు నొకే విధములగు నాచారములు, నుద్యమములు నుండజాలవని మనము ముఖ్యముగా గమనింప వలెను. ఈ సత్యమును గుర్తెఱుంగక పోవుటయే జాతిద్వేషమునకు ప్రధానకారణము. హిందువులు తమ సాంఘికాచారములే యుక్తములు, సర్వోత్కృష్టములు న

నియు, వానినుల్లంఘించువాడు పరమ దుర్మార్గుడనియు దలం
తురు. అమెరికనులు తమ దేశాచారము ననుసరించుట శ్రేష్ఠమ
నియు, వాని నతిక్రమించిన వా డధముడనియు భావింతురు. ఇది
మనవారలమున సామాన్యముగా నేయుతప్పు; ఇది సహజము,
కాని యమిత హానికరము; లోకమునందలి సంకుచిత భావ
మున కిది సగముకారణము. నేనమెరికాకు వచ్చి షికాగో
ప్రదర్శన శాలలో తిరుగుచుండగా వెనకనుండి యొక మనిషి
వచ్చి నా తల పాగను లాగెను. నేను తిరిగి చూడగా నాతడు
చక్కగా ముస్తాబు చేసి పెద్దమనుష్యునివలె తోచెను. నేనా
యనను పలుకరింపగా నాకింగ్లీషు వచ్చుట చూచి చాల సిగ్గు
పడి పోయెను. ఇంకొకమారు యీ ప్రదర్శనమందే నన్నొకడు
త్రోసెను. కారణ మడుగగా నాతడు లజ్జపడి క్షమాపణగా 'అ
ట్టి గుడ్డలు తొడిగితి వేల?' యనెను. ఈ యుభయుల యనౌ
దార్యమునకు తమ వేషభాషలను దాటి పోనేరదు. బలయుతులగుజా
తులు బలహీనజాతులను బాధలుపెట్టుటకీ సంకుచితభావమే
కారణము. ఇది సాటిమానవులయెడ్ల గల సహానుభూతిని శు
ష్కింపజేయును. తనతో సమానవేషము వేయలేదని యవ
మానపరచిన మనుష్యుడు తన గృహధర్మములను, పారిశుద్ధ్యకర్మ
ములను శ్లాఘామాత్రముగ నెరవేర్చుచుండవచ్చును; కాని భిన్న
వేషధారిని చూచినంతనే యాతని దయాధర్మములు పరారము
గ నేగెను. సకలదేశములందును నూతనులగు విదేశీయు లచ్చ
టి స్థితిగతులు తెలియకుంటచే మోసపోదురు; అందుచే నా దేశీయు
లంగూర్చి దురభిప్రాయములను స్వదేశమునకు గొంపోదురు.

నావికులును, సైనికులును, వర్తకులును విదేశములలో స్వదేశ మును స్వప్నమునందైన తలంపని విచిత్రరీతుల వర్తింతురు; ఇం దువల్లనే కాబోలు, చైనీయు లైరోపియులను అమెరికనులను 'విదేశీయపిశాచము' లని వాడుచుండుట! పాశ్చాత్యుల నహిం ధర్మలక్షణములను పరికించియున్నచో వా రట్లనజాలరు.

కావున మనము గమనింపవలసిన దేమనగా నితరుల స్వధర్మములను వారి దృష్టితో నిరీక్షింపవలెనే కాని మనప్రమాణముల ననుసరించి యన్యాచారములను నిర్ణయింపరాదు. ప్రపంచమున కింతకు నేను ప్రమాణము కాదు. నేను ప్రపంచము ననువర్తింపవలెను, కాని ప్రపంచము నన్ను కాదు. కావున పరిస్థితులచే స్వధర్మము మారుచుండుననియు, నెట్టిసమయమునందైన స్వధర్మమును నిర్వహించుటయే లోకమునకు మనము చేయగల యుత్తమ కార్యమనియు తేటపడుచున్నది. జన్మచే గలుగు కర్తవ్యమును చేయుటయు, ఆపైని తా నున్న సాంఘిక స్థానమును బట్టి వచ్చిన కర్తవ్యములను నిర్వర్తించుటయు. అయినను మానవ స్వభావమునందొక ప్రమాదము కలదు; అతడెప్పుడు నాత్మపరీక్ష కావించుకొనడు. తాను సింహాసన మెక్కి రాజ్యముచేయ నర్హుడని యూహించును. ఒకవేళ నర్హుడైనను ముందుగా తాను ప్రస్తుత స్థితియందలి కర్తవ్యములను తెన్నగా నిర్వహించినట్లు చూపవలెను. అపుడు నుత్తమకర్తవ్యములు తమంతట తామే వచ్చును. మనము ప్రపంచమున శ్రద్ధతో పనిచేయ దొడగితిమని ప్రకృతి మనలను కుడియెడముల గొట్టి మన స్వస్థానమును గ్రహింపజేయును. ఏవ్యాపకాని

తన కర్తృతలేనిస్థానమున చిరకాలముసంతృప్తితో నుండజాలడు. ప్రకృతి సరిచేసుకొనునప్పుడు మనము సణుగుకొని ప్రయోజనములేదు. కనుక యల్పకార్యమును చేయువాడల్పుడు కాడు. ఎవ్వని గొప్పకొలదులను ఆతని స్వధర్మములగౌరవలాఘవములనుబట్టి నిర్ణయింపరాదు; సర్వజనులును తమస్వధర్మములను నిర్వర్తించెడిప్రకారమును సంకల్పమును బట్టియే నిర్ణయపాత్రులగుదురు.

ఈస్వధర్మభావముకూడ ప్రదర్శనమొంది, స్వార్థప్రేరణము లేనప్పుడే మహాత్యాగములు నెరవేరును. అయినను స్వధర్మభావప్రేరితములగు కర్మయో స్వధర్మాతీతమగుకర్మయు మార్గదర్శకాగలవు. కర్మ యథార్థముగా— అంతకు నెక్కువగా— నైనప్పుడే కర్మనిమిత్తము కర్మచేయుట సాధ్యమగును. నైతికధర్మమునకు మించిన ప్రముఖధర్మముగ జూచినను, సర్వసిద్ధాంతములకన్న యోగములకన్న నిది యొక్కటే; దానియుద్దేశ్యము మనప్రకృతిస్వాభావ్యమును శిక్షింపజేసి సత్యమగు పరాప్రకృతిని వికసింపజేయుటే; దేహానుప్రాణములందే మనశక్తులను వ్యయముచేయక మనయాత్మను త్రమానస్థలందుప్రకాశింపజేయుటే. ఇందుకు మన క్షుద్రవాంఛలను నిరంతరము నిరోధించుటే సాధనము. సాంఘికసంస్థలన్నియు తెలిసియో, తెలియకయో, స్వార్థమును శిక్షింపజేసి, మానవుని స్వస్వరూపవికాసమునకే తోడ్పడుచున్నవి.

స్వధర్మము సాధారణముగా మధురము కాదు. ప్రేమచే స్నిగ్ధములైనప్పుడే దాని చక్రములు సరళముగా నడుచును;

లేనిచో నెల్లప్పుడును సంఘర్షణమే. ప్రేమయే లేకున్న తల్లి దండ్రులు తమ బిడ్డలయెడలను, భార్యాభర్తలు పరస్పరమును స్వధర్మము నెట్లు తీర్పఁగలుదురు? మన జీవితములం దనుదినమును మనకు సంఘర్షణలు కలుగుచుండుటలేదా? ప్రేమతో సమ్మిళితమైనప్పుడే స్వధర్మము మధురముగా నుండును; స్వాతంత్ర్యయుక్తమైనప్పుడే ప్రేమ ప్రదీప్తమగును. అయినను కామ క్రోధములకును మాత్సర్యమునకును, అనుదినజీవితమునందలి సహస్రవికారములకును దాసుల మగుట స్వాతంత్ర్యమేనా? మనలను కలంచు నీ స్వల్పవిషయములన్నెల్ల సహనము చూపుటయె యుత్తమ స్వాతంత్ర్యచిహ్నము. అసూయాహంకారగ్రస్తలగు స్త్రీలు తమ భర్తలను తూలనాడి తమ స్వాతంత్ర్యమును ప్రకటించుకొన్న మనుకొందురు! కాని తాము బానిసలగుట గ్రహింపనేరరు. అట్లె కొందఱు పురుషులును తమ పత్నులపై నిరంకుశము దోషారోపణ చేయుచుందురు.

పురుషునికిగాని స్త్రీకిగాని శుద్ధశీలమే ప్రధానసద్గుణము, శాంతిమూర్తి, ప్రేమమయి, శుద్ధశీలయగు సత్పత్నిలేనంతటి యనర్ఘసద్వస్తువగు పురుషుని యుత్తమమార్గమునకు రానీయదు. లోకమునను సంతతికి దుస్థితి రాలేదు. దుశ్శీలురు, పతితప్రాయులునగు పురుషులంగూర్చి మనము తెలుసుగా వినుచుందుము; స్త్రీలలోగూడ పురుషులతో సమానముగ దుశ్చరితలును పతితప్రాయులును లేరా? స్త్రీలందరును తాముచె ప్పుకొనునంత యుత్తమురాండ్రే యైనచో లోకము నెన్నడో దుర్గమమయిన నరకముగ లుండని నేను చెప్పగలను పరిణామము.

పుణ్యాసక్తినయు జయింపవలెనని శాస్త్రము చెప్పగలదు? పరపురుషుల నందఱను సోదరులుగను, పుత్రులుగను భావించి వాత్సల్యముతో జూచు పతివ్రతకును విశేష పుణ్యప్రభావము నార్జించి యెంతటి మహాత్మునైనను తన సాన్నిధ్యముచే పునీతభావునిగ జేయఁగలదు. అట్లే ప్రతిపురుషుండు పరకాంతలను తల్లులుగను, తోబుట్టువులుగను నెంచి పవిత్రప్రేమతో చూడవలెను. ధర్మోపదేశకుఁడుగా నుండగోరువాఁడు ప్రతిస్త్రీని మాతృభావముతో నాదరింపవలెను.

లోకమునందెవరికన్నను మాతృపూజనీయులు; అమ్మకే స్వార్థత్యాగము నభ్యసించుటకు, ప్రదర్శించుటకు నవకాశమున్నది. మాతృప్రేమకంటె నిస్స్వార్థప్రేమ మఱియొకటి యుండదు; ఇతరప్రేమలన్నియు స్వల్పములే. ఘనుఁడుగా పేర్కొనఁ దగిన మము నరసి యెంతో కన్నచూపునను తల్లి నిష్కాపట్యము. బిడ్డలకై తల్లిదండ్రులు పెంపుగా స్వార్థత్యాగముచే చూపెదరో సునెపుం వారి సంతానము, బిడ్డలు పెరిగిన పిమ్మట తమకు లవలెనే, మాతృభావమును నుంచి చూడఁగలిగినచో. ప్రతి స్త్రీని జగన్మాతృవిగ్రహముగా భావింపగలుగువాఁ డెంతటి ధన్యుఁడు. ఏ స్త్రీ పురుషుని జగత్పతియొక్క ప్రత్యక్షస్వరూపముగా దలంపగలదో ఆమెయు ధన్యురాలు. పిల్లలు జననీజనకులను పరమేశ్వరుని ప్రతినిధులుగా భావింపగలరో వారే ధన్యోత్తములు.

సమయసిద్ధములగు స్వధర్మములను నెరవేర్చుచు శక్తిని సంపాదించి యుచ్చస్థితిని చేరుకొనుటయే మనకు మార్గము.

ఒకప్పుడు పిన్నవయస్కుఁడగు నొక సన్న్యాసి యడవిలో చిరకాలము ఘోరతపము గావించి యొకచెట్టుక్రింద, గూరుచుండెను. అంత నాతని శిరస్సుపై కొన్ని యెండు టాకులు పడెను. ఆతఁడు తలయెత్తి చూడఁగా కొమ్మలపై నొక కాకియు కొంగయు తగవులాడుకొనుచుండెను. ఆతఁడు కోపావేశముచే 'ఓహో! నాపై నెండుటాకులు వేయ సాహసించితిరా?' యని వానిని, కనురెప్పలెత్తి చూచెను. ఆ యోగాగ్ని తీక్ష్ణతకు తాళలేక యవి భస్మీభూతము లయ్యెను. ఇట్లొక్క చూపులోనే కాకిని కొంగను కాల్చివేయఁగల తన ప్రభావ సామర్థ్య మయ్యెన! అనియాహ్లాదియు మానందముచే నుప్పొంగెను. కొంతసేపైనపిదప నాతఁడాహారముకై యూరికిఁ జేరెను. ఒకద్వారమునొద్ద నిలిచి 'భవతి! భిక్షాం దేహి' యని యడిగెను. 'కొంచెము తాళుము, నాయనా!' యను పలుకొకటి లోపలినుండి వినవచ్చెను. ఇది విని 'ఓసి అభాగ్యురాలా! నన్ను తాళుమనుటకు నీ సాహసమెంత? నాకను నా ప్రభావము నెఱుఁగవు గాఁబోలును!' అని తలపోసికొనెను. ఇట్లనుకొనుచుండఁగా లోపలినుండి 'ఓయీ! నీవు మహాఘనుఁడవని తలంచకుము; ఇక్కడనున్నది కాకియు కొంగయు కాదు.' అను వాక్యము వినవచ్చెను. అతఁడాశ్చర్యచకితుఁడై యట్లు కొంతసేపు తాళెను. అంతట నొక స్త్రీ యింటిలోనుండి వెలువడి వచ్చెను. అతఁడు తత్క్షణమే యామె పాదములపై వ్రాలి 'అమ్మా! నీ వెట్లు తెలిసికొంటివి?' యని యడిగెను. ఆమె 'బిడ్డా! నాకు నీ యోగముగాని సాధనలుగాని తెలియవు. నేను సాధారణస్త్రీని. వ్యాధిగ్రస్తుఁడగు నాభర్తను నుపచా

రములు, చేయుచుండుటచే నిన్ను కొంచెము వేచియుండుమంటిని. నా ధర్మములు నెరవేర్చుటకై యావజ్జన్మమును పాటుబడుచుంటిని. కన్యకగా నున్నప్పుడు నా మాతాపితలయెడగల విధులను దీర్చుచుంటిని; ఇప్పుడు వివాహిత నగుటచే నా పాతివ్రత్యధర్మముల ననువర్తించుచున్నాను; ఇదియే నే నభ్యసించు యోగము; ఇందువల్లనే నాకు జ్ఞానజ్యోతి లభించినది. దానివల్ల నీ వడవిలో చేసిన కార్యమును, నీ మనోభావమును గ్రహించితిని. ఇంతకన్న నధికము తెలియగోరెదవేని మిథిలానగరమం దొక వ్యాధుడు మాంసము నమ్ముకొనుచుండును. అతని దర్శించితివేని నీకు సంతృప్తికరముగ నుపదేశము చేయగలడు. ఆ సన్న్యాసి ముందుగా 'నే నా పట్టణమునకు పోయి యా వ్యాధు నేల చూడవలెను?' అని తలపోసెను. కాని యిక్కడ జరిగిన సమాచారము బట్టి యాచిత్రము చూతమని నగరోన్ముఖుండయ్యెను. అక్కడ దూరమునుండి యొక యంగడిలో నొక వ్యాధుడు కత్తితో మాంసమును ముక్కలుగ గోయుచు, జనులతో బేరసారము లాడుచు విక్రయించుచుండుట చూచెను. ఆతడు తనలో 'ఈశ్వరా! ఈ మనుష్యునివద్దనా నే నుపదేశము నొందబోవునది? ఈతడు భూతములా గున్నాడు' అని తలచుచుండెను. వ్యాధు డతని జూచి 'స్వామీ! మిమ్ము నా సాధ్వి పంపెనా? నా పనిముగియువరకు నిచ్చట గూరుచుండుడు.' అనెను. సన్న్యాసి కిది యెంతయు నద్భుతముగా దోచెను. అత డక్కడ యుచ్చట కూరుచుండెను. వ్యాధుడు తన వ్యాపారము ముగిసినంతనే యా ద్రవ్యము గైకొని సన్న్యాసిని 'స్వామీ! ఇంటికి దయచే

యుడు! అని తీసికొని వెళ్లెను. గృహమును జేరగనే యాతని నొక యాసనముపై గూర్చుండ నియోగించి తాను లోనికి పోయెను, అంతట నా వ్యాధుడు వృద్ధులగు తన తల్లిదండ్రులను జలకమార్చి మృష్టాన్నము పెట్టి సంతుష్టాంతరంగుల గావించెను. అవల సన్యాసిం డాసి అయ్యా! మీరు నావద్దకు వచ్చితిరి. నే నేమి చేయగలను? అనెను. ఆ సన్యాసి యాతని ననేక తత్త్వరహస్యము లడిగి సదుత్తరములుపడసెను. ఇదియే మహాభారతమందలి వ్యాధగీత. ఇంతటి విజ్ఞానవంతుడవగు మహానీయుడవు, ఏల యిట్టి వ్యాధశరీరముం దాల్చి హీనకర్మము చేయుచున్నావు? అని సన్యాసి యాశ్చర్యముతో నడిగెను. అందుకా వ్యాధుడు వత్సా! ఏస్వకర్మయు తుచ్ఛముకాదు, అపవిత్రము కాదు. ఇది జన్మచే గలిగిన కర్మ. బాల్యమున నే నీవృత్తి నభ్యసించితిని. నిర్లిప్తుడనై నాస్వకర్మముం గావించెదను. గృహధర్మములను శ్రద్ధతో చక్కబెట్టుకొనుచు, నా తలిదండ్రులను సంప్రీతుల జేయ యత్నింతును. నేను నీవలె నేయోగము నెఱుగను, సన్యాసిని గాలేదు, అడవులకు పోవలేదు. అయినను నా కిట్టిశక్తి సంగరహితమగు స్వధర్మాచరణవల్లనే లభించినది." అనెను.

నేనొక మహాయోగిని చూచితిని. ఆయన యసదృశుడు, అద్భుతవర్తనుడు. అట్టివాని నెందును జూచియెరుగను. ఆయన యెవ్వరితోను మాట్లాడడు. అడిగిన ప్రత్యుత్తరమీయడు. ఉపదేశములు కావించుట కాయనకిష్టము లేదు. ఏప్రశ్నయైన నడిగి కొన్నాళ్లు వేచియుందువేని, ఏప్రస్తావనామధ్యమందో నీసందేహము నాశ్చర్యకరముగ నివారించును. ఆయన

నాకు కర్మరహస్యము నిట్లుపదేశించెను, "సాధనమును సాధ్యమును ఏకముచేయుము." అని నీ వేపనిచేయుచున్నను వేరు విషయమునుగూర్చి యోచింపకుము. అదియే యీశ్వరారాధనగా జేయుము. అంతకు నుత్తమారాధన లేదనియెంచి నీ యావచ్ఛక్తిని దానికై ధారపోయుము. ఈ కథయందలి వ్యాధుడును సాధ్వియు నిట్లే తమ ధర్మములను సంతోషముతో హృదయపూర్వకముగ నిర్వహించుచు తన్మూలమున జ్ఞానసిద్ధి గాంచిరి. స్వధర్మమెయ్యదియైనను ఫలకాంక్షలేక కావించినచో తప్పక యాత్మోపలబ్ధికి తోడ్పడునని ఇందుచే స్పష్టమగుచున్నది.

సంగబద్ధునకే స్వధర్మస్వభావమునుగూర్చి సంకోచమును, అసంతృప్తియు నుండును, కాని సంగహీనునకు సర్వకర్మలును సమానములు. అతడు తనస్వార్థపరతను, విషయలోలతను సంహరించి సకల కర్తవ్యములను ముక్తిని బడయుటకై దివ్యాయుధములుగా నుపయోగించుకొనును. మనమందఱము నెంతో యధికులమనుకొనుట సహజము. మనయిచ్ఛానుసారముగ గాక మన యర్హతనుబట్టియే మన కర్తవ్యములు నిర్ణీతము లగుచుండును. స్పర్థచే నసూయ జనించి దానిచే దయాభావ మణగును. అసంతుష్టునకు సర్వధర్మములు నరోచకములే; ఆతని కేదియు సమాధానకరము కాదు. ఆతని జీవితమంతయు వ్యర్థమే. మనము సర్వధా కర్మ చేయుదము; ఏవేళ కెట్టిస్వధర్మము సంప్రాప్తమైన నద్దాని నాచరించుటకు, దాని చక్రములపై మన హస్తములు వేయుటకు నిత్యమును సన్నద్ధులమై యుందము. అప్పుడు మనము తప్పక జ్ఞానోపలబ్ధి నొందగలము.

# కర్మయోగము.

## పంచమాధ్యాయము

### లోకోపకారమా?

స్వధర్మతత్పరత్వము మన యాత్మాభివృద్ధి కెట్లు తోడ్పడునో యింకను విచారించుటకు ముందు కర్మను గురించి మఱొక యభిప్రాయమును చెప్పెదను. ప్రతిమతమునకు సిద్ధాంతము పురాణము, ఆచారకాండ, యీ మూడంగములు నుండును. సిద్ధాంతము ప్రతిమతముయొక్కయు సారాంశము; పురాణము దానిని అనుశ్రుతముగా వచ్చు మహనీయుల చరిత్రలు, అద్భుతగాథలు, కట్టు కథలు మున్నగువానివలన దృష్టాంత పూర్వముగ బోధించును; ఆచారకాండ యా సిద్ధాంతమునకు సర్వజనగ్రాహ్యమగునట్లు ప్రత్యక్షరూప మొసంగును, ఆచారకాండను, దృశ్యసిద్ధాంత మనవచ్చును. ఆచారమే కర్మ; మనలో ననేకుల మింకను పరోక్షములగు నాత్మీయ విషయములను గ్రహింపజాలనందున కర్మకాండ యెంతయు నావశ్యకము. దేనినైన గ్రహించుట సులభమని మనము తలంపవచ్చును: కాని పరోక్షవిషయము లెంతయు దుర్గ్రాహ్యములని యనుభవమున వెలిసికొనగలము. కావున రూపములు మనకు విశేష సాహాయ్యకరములు, రూపకల్పనను మనము పరిత్యజింప జాలము. అనాది కాలము నుండియు సర్వమతములును రూపము నుపయోగించుచుండెను. ఒక భావమున, మనము రూపములతో గాని

యోచింపలేము; శబ్దములు సహితము భావములయొక్క రూపములు. మఱియొక భావమున, విశ్వమునందలి సమస్తమును రూపమే యని చెప్ప వచ్చును. విశ్వమంతయు నీశ్వరుని రూపము. ఇట్టి రూపములు కేవలము మానవ కల్పితములు కావు. ఎవరోకొంద రొకమతస్థు లొకమూల కూర్చుండి యోచించి తమమనస్సుల నుండి యీరూపములను సృష్టింపలేదు. అవిసహజముగ పెరుగును లేనిచో కొన్ని రూపములు సకల మానవుల యొక్కయు భావములతో నెట్లుసంబంధించును? కొన్నిరూపములు సర్వమతసాధారణములు. శిలువయాకృతి క్రైస్తవ మతముతో పుట్టలేదు. అంతకు మునుపే, వేదములకును పూర్వమే, మానవుని యతిప్రాచీన కాలమందే యారూపముండెను. అత్యంతపురాతనములగు ఎజ్టెక్, ఫినీషియన్ జాతులు శిలువరూపమును వాడుచుండిరి. శిలువపై చంపబడిన రక్షకుని చిహ్నము పూర్వము ప్రతిజాతి యందును ప్రచారమున నున్నట్లు నిదర్శనములు కలవు. వలయ రేఖ లోకమందంతటను చిహ్నముగా నున్నది.  ఈ స్వస్తిక రేఖ సామాన్యముగ సర్వమతములందును గలదు. ఒకప్పుడు దానిని బౌద్ధులు ప్రపంచమం దంతటను వ్యాప్తముచేసిరి. కాని బౌద్ధమతమునకు చాలపూర్వమే యది సర్వజాతులలోను వాడుకలో నుండినట్లు తెలియుచున్నది. పురాతనపు బాబిలోను, ఈజిప్టు దేశములలో నది కన్పట్టుచున్నది. దీనివల్ల నేమి తేలును? ఈరూపములన్నియు కేవలరూఢసంకేతములు కాజాలవు. వీనికిని మానవ హృదయమునకునొకసహజసంబంధముండవలెను. భాష రూఢసంకేతములచే నుత్పత్తి కాలేదు; కొన్ని శబ్దములచే కొన్ని భావములను వ్యక్తీకరింతుమని

ప్రజలునిర్ణయించు కొనియుండలేదు; శబ్దములేని భావముకాని, భావములేనిశబ్దము కాని యెన్నడు నసంభవము. శబ్దభావములకు రెంటికిని సహజముగ నవినాభావము కలదు. భావములను ప్రకటించుటకు రూపములు శబ్దాత్మకముగ గాని వర్ణాత్మకముగగానియుండవచ్చును. బధిరులును మూకలును శబ్దాత్మక ములతోగాక యితరరూపములతో భావన చేయువలెను. ప్రతిభావమునకును రూపము కలదు. వీనినే నామరూపము లందురు. భాషాకల్పనవలెనే రూపకల్పనయు దుస్సాధ్యము. మానవజాతి యొక్క మతభావములు వారి కర్మకాండలందు ప్రకటితము లైనవి. ఆచారకాండతోను ఆలయములతోను అలంకారములతోను ప్రయోజనము లేదనుట సులభము. ఈకాలమున పసిబిడ్డలు కూడ నట్లు చెప్పుదురు. కాని యాలయమునకు పోయి యారాధించు వానికిని ఇతరునకును గల భేదము తేటతెల్లము. ఆయా మతములతో ఆయా యాలయములకును, సంస్కారములకును, ఇతరాచారములకును గల సంబంధము తన్మతస్థుల చిత్తములం దాయా భావముల నుద్దీపింప జేయుచుండును; ఆచారకాండను, రూపకల్పనను నిరసించుట యసమంజసము. వీని పరిశీలనయు, సాధనయు కర్మయోగమందొక భాగమే.

ఈకర్మశాస్త్రమునకు సంబంధించి యింకను బహువిషయములుకలవు. వానిలో భావమునకు శబ్దమునకు గల సంబంధమును గ్రహించి శబ్దప్రభావముచే నెట్టిమహాత్కార్యములు సాధ్యములగునో విచారించుట యొకటి. ప్రతిమతమును శబ్దప్రభావమును గమనించి యున్నది. కొన్ని మతములు శబ్దమునుం

డి యే విశ్వసృష్టి యైనదని నుడువుచున్నవి. ఈశ్వరుడు శబ్దబ్రహ్మ
ము; సృష్టికి పూర్వ మాయన సంకల్పాను సారముగ శబ్దమునుం
డి విశ్వోత్పత్తి యయ్యెను. మనవిషయ జీవన సంఘట్టన మునందు
మనయింద్రియములు పాటవము తప్పి మొద్దువోయి గ్రహణశ
క్తిని గోల్పోవును. మనము పెద్దవార మగుకొలదిని, ప్రపంచము
న దెబ్బలు తినుకొలదిని మన మనస్సులు బండవారి పోవును. అం
దుచే మన కండ్లయెదుట నిరంతరము జరుగు కార్యములనే మన
ము నిర్లక్ష్యము చేయుదుము. అయినను మానవస్వభావమూరకు
కొనదు; ఒకప్పుడు కాకున్న నింకొకప్పుడైన నీకార్యములయ
ర్థమును గ్రహించి మనమాశ్చర్య మగ్నుల మగుదుము; ఈయ
చ్చెరుపాటే జ్ఞానోపలబ్ధికి ప్రథమ సోపానము. శబ్దమునకు ప్రా
ధాన్యము మత వేదాంతవిషయములందు మాత్రమే కాదు; శబ్దా
త్మకరూపములు మన నిత్యనైమిత్తిక ములయం దెంతయు స
హాయభూతము లగుచున్నవి. నేను మీతో మాట్లాడుచున్నా
ను; మిమ్ము తాకుట లేదు; నావాక్కు చేగలిగిన వాయుసంచలన
ము మీశ్రోత్రపుటములందుజొచ్చి, యందలి నరములను స్పృశిం
చి మీమనస్సులందు భావములను పుట్టించుచున్నది. ఈవాక్య
మును నీవు నిరోధింపలేవు. ఇంతకన్న నద్భుతమేమి? ఒక మనుష్యు
డింకొకని మూర్ఖుడనును, ఆతడు లేచి పిడికిలి పోటుతో నీతనిచు
క్క బ్రద్దలుకొట్టును; ఆహా! ఏమి ఈశబ్దశక్తి! ఒక స్త్రీ యొకచో
రొమ్ముచరచుకొనుచు రోదనము చేయుచుండును; ఇంకొక స్త్రీ
వచ్చి మెల్లగా నాలుగు మాటలు చెప్పును; అంతట క్రుంగిపోయి
న యామె దేహము చెంగున లేచి నిలుచుండును; ఆమె శోక మేకడ
కేగినదో, మందహాసమామె పెదవులపై చిందులు ద్రొక్కుచుం

హను! శబ్దశక్తి యెట్టిదో గమనింపుడు. శబ్దములు తాత్త్వికవిషయములందువలెనే సామాన్య విషయములందును విశేష మహిమాత్మ్యములు. ఈశక్తి నిగుర్తింపకయే, దానింగూర్చి విచారింపకయే, యహర్నిశములును మనము దానిని వినియోగించుకొనుచున్నాము. ఈశక్తి యొక్క స్వభావ మెట్టిదో దానిప్రయోగ విధానమేమో తెలిసికొనుట గూడ కర్మయోగమునం దొకభాగమే.

ఇతరులమేలె స్వధర్మ మనగా నితరులకు తోడ్పడుట; లోకోపకారము చేయుట. మనము లోకోపకార మేల చేయవలెను? స్థూలదృష్టి కది లోకోపకారము, కాని వాస్తవమున స్వోపకారమే. నిరంతరము పరోపకారము చేయుటే మన యుత్తమోద్దేశ్యముగ నుండవలెను; కాని బాగుగా విమర్శించినచో, లోకము మన సహాయము నపేక్షించుట లేదని తేలుచున్నది. నీవుగాని నేనుగాని వచ్చి సహాయము చేయవలెనన్న యుద్దేశముతో నీ లోకము నిర్మింపబడలేదు. "పరోపకారము చేయుటకవకాశము నిచ్చుటచే నీసుందర ప్రపంచమంతయు నొప్పి యుంచిది" అని యొక క్రైస్తవోపదేశమున వదివితిని. ఇది చాల సుందరభావము, కాని లోకము మన సహాయము నపేక్షించుచున్న దనుట మహాపరాధము కాదా? లోకమున దుఃఖము లేదనజాలము; అందుచే మనము పోయి ఇతరులకు తోడ్పడవలసినదే కాని కాలక్రమమున పరోపకారము స్వోపకారమే యని మనము గ్రహింతుము. చిన్నతనమున నేనొకొన్ని సీమపందికొక్కులను పెంచుచుంటిని. వానికొక చిన్న పెట్టెను జేసియందులో చిన్న చక్రముల నమర్చితిని. అవి చక్రముల నెక్కి దాట యత్నించినప్పుడెల్లను చక్రములు గిఱుక్కున తిరుగుచుండును.

అందుచే నా కొఱ్ఱ లెప్పుడు నచ్చుటనే యుండెడివి. లోకము
ను మనలోకోపకారమునుగూడ నంతే. మనకు నైతిక శిక్ష కలుగు
టే యుపకారము. ఈప్రపంచము మంచిదియు గాదు, చెడ్డదియు
గాదు; ఎవనిప్రపంచమును వాడు సృజించుకొనుచుండును. ఒక
యంధుడీప్రపంచమును గూర్చి విచారింప నారంభించినచో నాతని
కిదిమృదువుగనో కఠినముగనో, ఉష్ణముగనో శీతలముగనో తో
చును. మనము సుఖమయులము, దుఃఖమయులముకూడను. ఇ
దిమనకత్యంతానుభవవిషయమే. సాధారణముగా యువకులా
శోత్సాహపూరితులై యుందురు; వృద్ధులు నిరాశులై, నిరుత్సా
హులై యుందురు. యువకులకు జీవితమంతయు ముందున్నది; వృద్ధు
లు తమకాలము గడచెనని విలపింతురు. తీరనికోరికలెన్నియో
వారిహృదయమును కల్లోలపరచును. కాని యుభయులు నవివే
కులే. జీవితమునకు స్వతః మంచిచెడ్డలు లేవు. మనమానసికస్థితిని
బట్టి మనదృష్టికది మంచిగనో చెడ్డగనో గోచరించును. అగ్ని చలి
పోగొట్టి మనకు వెచ్చదన మిచ్చునప్పుడు "ఆహా! ఎంత హాయిగా
నున్నది! అనియందుము కాని వేళ్ళను కాల్చినచో ఛీయందుము
అగ్ని స్వభావముచే నగ్నికి మంచిచెడ్డలు లేవు. మన కుపచరించు
విధమునుబట్టి దానిమంచిచెడ్డ లేర్పడుచున్నవి. అట్లేయీప్రపం
చమును. దానియందెట్టిలోపమును లేదు. దాని యుద్దిష్టకార్యము
నది చక్కగా సాధించుకొనగలదు. అదియిట్లే మనతో నిమిత్తము
లేకయే జరుగుచుండగలదు. దానికి సహాయము చేయుటకై మ
నమేమియు శ్రమపడనక్కఱలేదు.

అయినను మన ముపకారము చేయవలెను. ఉపకారపర
తకార్యోత్సాహమును పురికొల్పు సర్వశక్తులయందు నుత్తమ

మైనది; కాని యుపకారము చేయునప్పుడెల్ల నట్టి యవకాశ మొదవుట మన విశిష్టభాగ్యముగా నెంచవలెను. ఎక్కడనో యున్నతస్థానమున నిలిచి జేబులోనుంచి నాలుగుపైసలు తీసి సాహంకారముగ 'ఇదిగో అబ్బీ!' అనబోకుము. ఆ దీనునకు కృతజ్ఞత చూపుము; ఆతనికి ధర్మముచేయుటచే నీవు నీకుపకారమును చేసికొనగలిగితివి. దాతయే ధన్యుడు, కాని గ్రహీత కాడు. నీవు నీ పరోపకారశక్తిని, దాక్షిణ్యమును ప్రపంచమునందు చూపుటకవకాశ మొసగి నీవు శుద్ధుడవు, పూర్ణుడవు నగుటకు తోడ్పడినందుకై యాతనికి ప్రణామము చేయుము. సమస్త సత్కార్యములును మనలను పరిశుద్ధులుగ జేసి పరిపూర్ణులగావించును. మనము చేయగల మహోపకారము లేవి? వైద్యాలయములు కట్టుట, బాటలు వేయుట, ధర్మశాలలు నిర్మించుట! కొన్ని లక్షల రూప్యములు చందాలు వేయించి యొక వైద్యశాలను, ధర్మసత్రమును వేయింతుము; కాని యా వ్యయములో సగపాలు నుద్యోగులే యక్రమముగ హరింతురు. కడమ సగము నెట్లో యాబీదల జేరును; కాని యివన్నియు నేపాటివి? ఒక్క పెద్దగాలి పెట్టున కామందిరము లన్నియు నేలమట్టమగును. ఒకభూకంపముచే మనబాటలును, వైద్యాలయములును, పట్టణములును, అన్నియు భూమధ్యమున జేరును. మనముచేయునదేమి? చాలును, ఈలోకోపకార ప్రశంసనికకట్టి పెట్టుదము. లోకము నీ సహాయమునకై కాని, నా సహాయమునకై కాని నిరీక్షించుకొని కూర్చుండ లేదు; అయినను మనము నిరంతరము పరోపకారపరులమై యుండవలెను; దానివల్ల మనకు శ్రేయము కలదు. మనము పరిపూర్ణతను బడయుటకది

యొక్కటేమార్గము. ఏబిచ్చగాడును మనకొక్క కాసైన బాకీ యుండడు; కాని తనకుధర్మము చేయనిచ్చినందున మనమువాని కెంతో ఋణపడియుందుము. మనము లోకోపకారము కావించితిమని కాని, ఆయామనుష్యులకు సహాయము చేసితిమని కాని తలంచుట యెంతయు తప్పు. అది మూఢాభిప్రాయము. మూఢాభిప్రాయము లెప్పుడును దుఃఖకారణములు. మన మొకని కుపకారము చేసితిమనియెంచి యాతని కృతజ్ఞతకై యెదురు చూతుము; ఆతడు కృతజ్ఞత చూపకున్న పరితపింతుము. మనము చేయుదానికి ప్రతిఫలము నేల ప్రతీక్షింపవలెను? నీయుపకారము పొందువానికికృతజ్ఞత చూపుము; ఆతని భగవంతునిగా దలపోయుము. సాటిమానవునకు సహాయము చేయుట వలన నీశ్వరారాధనచేయుటమన ప్రత్యేక భాగ్యము కాదా? మనము ముక్తసంగులమైనచో నిట్టి ప్రతీక్షాదుఃఖము లేకయే సంతోష పూర్వకముగా లోకమున కర్మచేయ గలుగుదుము. ప్రపంచమున సుఖదుఃఖములు శాశ్వతకాలము నుండితీరును.

పూర్వ మొక దరిద్రుడుండెను. ఆతనికి కొంత ద్రవ్యము కావలసివచ్చెను. ఒక భూతమును వశపరచుకొన్నచో తాను కోరినదెల్ల తెచ్చియిచ్చునని యొకరివల్ల వినెను. అందుచే ముందుగా నొక భూతమును సంపాదింపగోరి యడవికి బోయెను. అచ్చట మహాప్రభావసంపన్నుడగు నొక యోగిని గాంచి యాతని సహాయము వేడెను. "భూతముతో నేమి చేయుదు"వని యోగి ప్రశ్నించెను. "దానిచే పనులు చేయుంతును; భూతమును పట్టుకొనుటెట్లో దయచేసి చెప్పుడు! అది నాకుముఖ్యముగా కావలెను." అని యాతడు బదులు చెప్పెను. అందుకు

యోగి "ఎందుకు నీ క్లేశము? ఇంటికి పొమ్ము" అనెను. ఆతఁడు మఱుసటి రోజున మరల వచ్చి యాయన పాదములపై బడి యేడ్చుచు "స్వామీ! నా కొక భూతము నిమ్ము; నాకు కావలెను, ఈసహాయము చేయుఁడు" అని ప్రార్థించెను. చివరకా యోగి విసుగెత్తి యొక మంత్రము నుపదేశించి "ఈ మంత్రమును పురశ్చరణ చేసిన భూతము వచ్చును. అది నీవుచెప్పిన పనులెల్ల చేయును. కాని నీవు జాగ్రతగా నుండవలెను; ఇవి చాల భయంకరజంతువులు; ఒక త్రుటిమాత్రమైనదానికి విరామము నీయరాదు; ఎప్పుడు పనిచెప్పకున్న నప్పుడే నిన్ను చంపగలదు." అని చెప్పెను. ఆత డంతట నొక మహారణ్యమధ్యమున ప్రవేశించి యా మంత్రమును జపించగా నొక పెనుభూతము ప్రత్యక్షమై "నేను భూతమును, నీ మంత్రముచే వశనైతిని; నాకు నిరంతరమును పని చెప్పవలెను; ~~ఎప్పుడు చెప్పవలెను~~; ఎప్పుడు చెప్పకున్న నప్పుడే నిన్ను చంపివేయుదును." అని చెప్పెను. ఆతఁడు "సరే, నా కొక మేడను కట్టుము" అనెను. "ఇదిగో నీ మేడ, తయారైనది." అని భూతము బదులుచెప్పెను. అనంతరము "నాకు ధనమును తెమ్ము." "అనెను. "ఇదిగో ధనము అని భూతము చెప్పెను.". ఈ యడవిని నరకి యిచ్చట నా కొక పురమును గట్టుము" " అని యాతఁడు చెప్పెను. "ఇదిగో నిర్మించితిని; ఇంకేమైన కావలెనా? "యని భూతము ప్రశ్నించెను. ఆదరిద్రునకు భయముపుట్టెను; ఏ పనియైన నొక్క త్రుటిలో చేయుచుండుటచే నేమియు తోచినది కాదు. భూతము "నాకు పని చెప్పుము; లేదా నిన్ను మ్రింగివేసెదను." అని గర్జించెను. ఆతని కేమియు తోచక బెదరి పారిపోవదొడగెను. తిన్న

గా నా యోగి వద్దకు పరుగెత్తి "స్వామీ! రక్షింపుము, రక్షింపుము "అని పాదములపై బడెను." ఇది యేమి? "యని యోగి ప్రశ్నించెను. "స్వామీ! ఇక నా భూతమునకు చెప్పట కెట్టి పనియు లేదు; ఏది చేయుమన్నను క్షణములో ముగించును; ఇప్పుడు పని చూపకున్న నిన్ను మ్రింగివేసెదనని భయపెట్టుచున్నది. "అని యాతడు ప్రత్యుత్తర మిచ్చెను. ఇంతలో నా భూతము "ఇదిగో నిన్ను మ్రింగివేసెదను" అని యరచుచు వచ్చి యాతనిపై నుఱుక బోయెను. పాప మాతడు వణకుచు నా యోగిని శరణువేడెను. ఆయోగి నీ కొక యుపాయముం జూపెదను. అల్లదే, యీ కుక్క వంకరతోకను ఖండించి తెమ్ము; దానిని సరిచేయుమని యీ భూతము నాజ్ఞాపింపుము "అనెను. తత్క్షణమే యాతడు తన కత్తితో నా కుక్కతోకను కోసి తెచ్చి యీ భూతమునకిచ్చి దీనిని సరిచేయు" మనెను. ఆ దయ్యము దానిని పైకొని తిన్నగా సరిచేసెను; కాని పట్టు విడిచినంతనే యది మరల వంకర పోయెను. ఆభూతము దానిని మరల సరిగా చేసెను; కాని చేయిదాటినంతనే యది మరల వంగిపోయెను. ఆ దయ్య మెన్నియో మారు లోపికతో యత్నించెను, కాని ప్రయోజనము లేకుండెను. అది రోజులకొలది సక్లేశప్టించి కడకు విసుగెత్తి "ఇదివరలో నా జీవితమం దెన్నడు నిట్లు చిక్కువడలేదు. నే నారితేరిన బంటునైనను ఈ యల్ప కార్యమునకు లొంగకున్నాను. ఇక నీతో రాజీకి వత్తును. నన్ను నీవు విడిచిపెట్టుము; అందుకు బదులుగా నేను నీకిచ్చినదంతయు విడిచిపెట్టెదను; నీ కెట్టి హానియు చేయను." అనెను. అందు కాతడెంతయు సంతోషించి యాదయ్యమును విడిచిపుచ్చెను.

ఈ ప్రపంచమూ కుక్కతోక వంటిది. దీనిని నిబ్బరముగా చేయవలెననియనేక శతాబ్దములనుండియు జనులు యత్నించుచున్నారు. కానివారిచేయి విడుచుటతోనే యది మరల వంకర వోవుచున్నది. అదియెట్లొక విధముగా నెట్లుండగలదు? మనము ముందుగా ననక్తులమై కర్మచేయుట నేర్చికొనవలెను; అట్లైనచో మనము మూఢావేశవశులము కాజాలము. మూఢావేశము లేకున్న మానవజాతి యింకను ముందుకుపోయెడిది. మూఢావేశము వల్లనే మానవకోటి యభివృద్ధి గాంచె ననుట కల్ల. దానిచే ప్రజలలో క్రోధద్వేషములును, కలహములును గలిగి యన్యోన్యభావము నశించి వారియభివృద్ధి కంతరాయ మేర్పడినది. ప్రపంచమునుగురించి నీవు వృథాగా నాయాసపడ నక్కర లేదు. నీనిమిత్తములేకయే యది లెస్సగా సాగగలదు. మూఢావేశము మానినప్పుడే నీవు బాగుగా పనిచేయుగలవు. ఆవేశరహితుడు, శాంతుడు, యుక్తవిచారుడు, సహానుభూతిపరుడు, ప్రేమపూర్ణుడు నగువాడే పరోపకారము కావించి స్వోపకారము చేసికొనగలడు. ఆవేశవశునకు వివేక ముండదు. సానుభూతి శూన్యము; ఆతడు ప్రపంచము నెన్నటికిని సంస్కరింపజాలడు. తాను పరిశుద్ధుడై పరిపూర్ణుడు కాజాలడు.

నేటి ప్రసంగమునందలి ప్రధానాంశము లేవనగా, మొదటిటిది, ప్రపంచమునకే మనమందఱమును ఋణగ్రస్తులము కాని ప్రపంచము మనకేమియు ఋణపడియుండలేదు. లోకోపకారముచేయుట కవకాశము లభించుట మహా భాగ్యము. లోకోపకారముచే మనము నిజముగా స్వోపకారమే కావించుకొనుచున్నాము. రెండవ యంశ మేమనగా, ప్రపంచమం దొక దేవు

డున్నాడు! ఈ లోకము దారి తెన్ను లేక యసహాయముగా త్రొక్కిటపడుచు నీ సాహాయ్యమును, నా సాహాయ్యమునుగోరుటలేదు. ఈశ్వరుడు సర్వాంతర్యామియై యున్నాడు; ఆయన యనశ్వరుడై, యనవరత క్రియాశీలుడై, నిత్యజాగరుడై వెలుగొందు చున్నాడు. విశ్వమంతయు నిద్రా నిమీలితమై యుండువేళ నాయన నిద్రించుట లేదు. ఆయన యశ్రాంతము కర్మ చేయుచున్నాడు; సమస్త జగదుత్పత్తి పరివర్తనములును ఆయనవే. మూడవది, మన మెవరినిగాని ద్వేషింపరాదు. ఈ ప్రపంచ మెల్లప్పుడును శుభాశుభములతో గూడియుండును. దుర్బలులయందు సానుభూతి గలిగి యపరాధులను సహితము ప్రేమించుట మన విధి. ఈ లోక మొక నైతిక వ్యాయామశాల. మన మిందులో నాత్మీయ బలసంపత్తి నార్జించునటుల సాధన చేయవలసియున్నాము. నాల్గవది, మన మే విషయముననను మూఢావేశవశులము కాగూడదు; ఆవేశము ప్రేమకు విరోధి. "నేను పాపమునే కాని పాపిని ద్వేషింపను." అని యావేశపరు లందురు. అట్లు చెప్పుట సులభము. మనము వస్తుగుణవివేచన బాగుగా చేయగలిగినచో పూర్ణులము కాగలము. కాని యది సులభసాధ్యము కాదు. మఱియు మనలో శమదమములు హెచ్చిన కొలదియు మన ప్రేమ కూలంకషమై, మన కార్యములు కల్యాణకరము లగును.

# కర్మయోగము.

## షష్ఠాధ్యాయము.

---

### సంగపరిత్యాగమే స్వార్థపరిత్యాగము.

మనము కావించు ప్రతికార్యమును మన హృదయమందు ప్రతిఫలమును కలిగించునట్లే, మనసమస్త కార్యములు నితర హృదయములందును, ఇతరుల కార్యములు మనహృదయములందును ప్రతిఫలములు కలుగజేయ వచ్చును. ఎవ్వడైన దుష్కర్మలు చేయుకొలది నత్యంతదుష్కర్ము డగుట మీరందఱు నెఱిగినవిషయమే; ఆతడు సత్కర్మలు చేయ మొదలిడినచో మఱియు మఱియు సత్కర్మాచరణశీలుడై యెల్లవేళలను సత్కార్యములనే యాచరించును. ఇందుకు హేతువు మనలో పరస్పరము మనకర్మకుగల వశీకరణశక్తి తప్ప నితరము కన్పట్టదు. నేనొక కార్యము చేయుచున్నప్పుడు నా మనస్సొక ప్రత్యేకస్థితియందున్నదని చెప్పవచ్చును. అదేస్థితియందుండు నితరమనస్సులు నామనస్సుచే వికారము నొందుట సహజము. ఇందుకొక దృష్టాంతము; ఒకగదిలో నేకశ్రుతికి మేలగింపబడిన వివిధసంగీతవాద్యము లున్నప్పుడు వానిలో నొక్క దానిని వాయించినచో నన్నియు నారాగమునే యాలాపించుటకై చలనమొందుట స్వభావము. అట్లేయేకస్థితియందలి మనస్సులన్నియు నేకభావముచే వికారము పొందును. భావమునకుగల యీశక్తి దూరమునుబట్టియు, నితర హేతువులనుబట్టియు మారుచుండినను, మనస్సుమాత్ర మెప్పుడును భావ

మున కధీనమం దుండును. నేనొక దుష్కార్యమును చేయు
చున్నా ననుకొనుము; అప్పుడునామనస్సొక విధమైన చలనస్థితి
యందుండును; ఆస్థితియందేయుండు మనస్సులన్నియు నామన
స్సువలన వికారము నొందవచ్చును. ఈమనశ్శక్తి చలనము
యొక్క స్థాయినిబట్టి హెచ్చుతగ్గులుగా నుండును.

కాంతితరంగము లొక వస్తువుపైపడుటకు పూర్వము
లక్షలకొలదిమైళ్లు సంచారము చేసినట్లే, భావతరంగములు
కూడ నొకమనస్సుతో గలయుటకు పూర్వము వత్సరశతములు
సంచారము చేయవచ్చును. కావున మనచుట్టునున్న వాతావ
రణమంతయు శ్రేష్ఠములు దుష్టములునగు భావతరంగములచే
పూరితమైయుండవచ్చును. ప్రతిమనస్సునుండియు బయల్వెడ
లు ప్రతిభావమును తన్నుస్వీకరింపగల యర్హవస్తువును గలయు
నంతవరకు సంచరించుచు పోవుచుండును. ఏమానసమైన ఈ
భావతరంగములలో నొన్నింటిని గ్రహింపగలుగునెడల తత్క్షణ
మే వానిని స్వీకరించును. కావున నొక మనుష్యుడు దుష్కా
ర్యము లేవైన చేయునప్పుడు వాని మనస్సొక చలనస్థితియం
దుండును. ఆస్థితికి సంబంధించిన వాతావరణము నందలి తరం
గములప్పుడా మనస్సునందు ప్రవేశించును. అందుచేతనే దు
ర్మార్గుడు సామాన్యముగా మఱింత దుష్కార్యములనే నూ
టిమాటికి చేయుచుండును. సత్కర్మచేయువాని విషయముకూ
డనంతే; వాతావరణమునందలి సద్భావతరంగముల నాతడు
స్వీకరించును; అందుచేనాతడు మఱింతసత్కర్మలనే మరల మ
రల నాచరించును. కావున దుష్కార్యము చేయుటచే మన
ము రెండువిధముల హానియొనరించు చున్నాము; ఒకటి, మన

చుట్టునున్న దుష్టభావమునకు మనము లోబడుట; రెండవది, ఇతరులకు శబ్దముల పిమ్మటనైనను హానిచేయుగల దుష్టభావములను మన ముత్పత్తిచేయుట. దుష్కార్యములచే మనము పరులను, మనలనుగూడ చెరుపుకొనుచున్నాము. సత్కార్యములచే నితరులను, మనలనుగూడ నుద్ధరించుకొనుచున్నాము; మానవునియొక్క యితరశక్తులవలెనే యీ సదసత్కార్యాచరణశక్తియు బాహ్యప్రపంచమునుండి బలము నాకర్షించుచున్నది.

కర్మయోగప్రకారము, మనము కావించు ప్రతికార్యమును దానిఫలమొసంగినగాని నశింపదు; అది ఫలమీయకుండ నాపగలశక్తి యేదియు లేదు. నేనొక దుష్కార్యమును చేసినచో దానిదుష్ఫలము ననుభవింపవలసినదే; ఈ ప్రపంచమున దానిని ప్రతిఘటింపగల శక్తియేదియు లేదు. అట్లే నేనొక సత్కార్యమును గావించినచో దాని సత్ఫలము ననుభవింపకుండ జేయగలశక్తి యేదియులేదు. కారణమునకు కార్యము కలిగితీరవలెను; దీనినేదియునడ్డజాలదు. కర్మయోగమునందిక్కడ నొకమంచిప్రశ్న కలుగుచున్నది; మన యీ సదసత్కర్మలకు విశేషమగు నన్యోన్యసంబంధము కలదు. మనమీరెంటికి మధ్యనొక హద్దుగీత గీసి 'యింతవరకు సత్కర్మ, యింతవరకు నసత్కర్మ'యని చెప్పజాలము. శుభాశుభఫలములు రెండును కలుగని కార్యమేదియు లేదనియే చెప్పవచ్చును. ఇందుకు సమీపదృష్టాంతమును తీసికొందము: నేనుమీతో మాట్లాడుచున్నాను; మీలోకొందరు నేను మేలుచేయుచున్నా

నని తలపవచ్చును; కాని యీసమయమందే నేను వాయువునం
దలి వేలకొలది సూక్ష్మజీవులను చంపుచున్నాను; ఈవిధము
గా నేను మఱికొన్నింటికి కీడు చేయుచున్నాను. ఏకార్యమైన
ను మన సమీపమున జరిగి మనమెఱిగినవారికి శుభకరముగ
నున్నచో దానిని సత్కార్యమందుము. నాసంభాషణను మీరు
సత్కార్య మనవచ్చును, కాని సూక్ష్మజీవు లట్లనవు; ఆ యు
ణుజీవులను మీరు చూచుటలేదు, కానిమిమ్మును మీరుచూ
చుచున్నారు. నాసంభాషణచే మీకుకలుగు ఫలితమును మీ
రు గ్రహించుచున్నారు; కాని యణుజీవులకు గలుగు ఫలము
ను మీ రెంతగా గ్రహించుట లేదు. అట్లే మన దుష్కార్యముల
నుగూడ మనము పరీక్షించినచో ప్రాయశః కొందఱ కిచ్చట
నో కొంతమేలు కలుగవచ్చును. ఎపుడు శుభమునందు కొం
త యశుభమును, అశుభమునందు కొంత శుభమును కలదని
గుర్తెఱుంగునో యాతడే కర్మ రహస్యవేది.

కాని దీనివలన నేమి తేలును? అహింస గలకార్యము
ను పరిశుద్ధమనియు, హింస గల కార్యమును అపరిశుద్ధమని
యు నందుమేని, ఈప్రపంచమున మన మెంత యత్నించినను కే
వల పరిశుద్ధకార్యము గాని, కేవల మపరిశుద్ధ కార్యము గా
ని యుండజాలదు. పరహింసలేకుండ మన ముచ్ఛ్వాస నిశ్వా
సములు సైతము చేయజాలము; మనము తిను ప్రతి అన్న క
బళమును మఱొకని నోటినుండి మనము లాగివేయుచున్నాము;
అన్యప్రాణములను త్రోసిపుచ్చి మన ప్రాణములు నిలుచుచు
న్నవి. మనుష్యులవి కాని, జంతువులవి కాని, సూక్ష్మజీవులవి

కాని, యెవరివో యొకరి ప్రాణములు మనము హరించుచునేయున్నాము. ఇట్టిస్థితిలో కర్మవలన మోక్షము బడయుటకల్లగా దోచును. మనము కలకాలమును యత్నింపవచ్చును; కాని యీవిషమమైన చిక్కునుండి తప్పించుకొనజాలము; నీ వెంత కాలమైనను కర్మ చేయవచ్చును, కాని యీ శుభాశుభమిశ్రమమైన కర్మఫలమునకు మాత్ర మంతముండదు.

మనము యోచింపవలసిన రెండవ యంశము, కర్మకంతమెయ్యది? ప్రతిదేశమునందును విస్తారిజనులు ప్రపంచమున కృతయుగ మొకటి వచ్చుననియు, అప్పుడు వ్యాధులుకాని, మృత్యువుకాని, దుఃఖముకాని, దౌర్జన్యముకాని లేక సర్వమును స్వర్గీయముగ నుండుననియు విశ్వసింతురు. అది చాల ప్రశస్తభావము, అది యజ్ఞానుల కుత్సాహమొసగి వారి యభ్యుదయమునకు తోడ్పడును, కాని యొక్క నిమిషమాలోచించినచో నది యసంభవమని తెలియగలదు. మేలు కీడులు రెండును ఒకే నాణెముయొక్క యుభయదిక్కులు నైనప్పుడది యెట్లుపోగలదు! కీడు లేని మేలునొకచోటనుండి వచ్చును. నిష్కలంకమనగా నేమిటిది? నిస్తబ్ధమైన మనశ్శాంతి. జీవనమనగా మనకును మన చుట్టునున్న యితరప్రాణులకును నిరంతర సంగ్రామము. ప్రతిక్షణమును మనకును మనపరిసర ప్రకృతికిని ఘోరముగా పోరు జరుగుచున్నది; ఈ పోరునందు మన మోడినచో మన ప్రాణములు పోవలసినదే. మనము నిరంతరము నాహార వాయువుల కొఱకు పెనగులాడుచుంటిమి; యిందుకు తార్కాణము. అన్నమును గాలియును తిన్నగా లభింపనిచో మన

కు మరణమే శరణము. జీవనము సరళముగా పోవు సులభవి
షయము కాదు. అది మిగుల జటిలమై క్లిష్టమైనది. అంతర
బాహ్యములకు జరుగు నీ జటిలసంగ్రామమునే జీవన మందు
ము. కావున నీ సంగ్రామాంతము తోనే జీవనముకూడ నంత
మొందుట స్పష్టము.

మనకు సంపూర్ణ సౌఖ్యమనునది యీసంగ్రామాంతమం
దేకలదు. కాని యప్పుడు జీవనమే లేదు. ఏమనగా నీసంగ్రా
మాంతమును జీవనాంతము నొక్కటే. లోకోపకారముచే స్వోప
కారమే చేసుకొను చున్నామని మన మిదివరలో గ్రహించితి
మి. పరోపకారము యొక్క ముఖ్య ఫలము ఆత్మ పరిశుద్ధి. ప
రోపకారము నందలి నిరంతర ప్రయత్నముచే మనము మనల
ను విస్మరించుచున్నాము. ఈయాత్మ విస్మృతి మనము నేర్చుకొ
నవలసిన ముఖ్య పాఠములలో నొకటి. మానవు డవివేకము
చే తనను సుఖాత్మునిగా జేసికొన గలనని తలచుచున్నాడు; కా
నిచిరకాలము కష్టానుభవము మీద స్వార్థవినాశ మందే య
థార్థ సౌఖ్యము కలదనియు తన సౌఖ్యమున కితరులు గాక తా
నేకర్తయనియు గ్రహించును. ప్రతిధర్మకార్యమును, ప్రతిదయా
భావమును, ప్రతిసహాయమును, ప్రతిసత్కార్యమును మన
స్వప్రాముఖ్యమును కొంతహరించి మనము పరమక్షుద్రులమను
వినీత భావమును మనకు జనింప జేయును; కనుక నది మంచి
దే. ఇక్కడ జ్ఞానమును భక్తియు కర్మయునొక్కచోటికే
వచ్చినట్లు మనకు తెలియుగలదు. "అహమ్" లేశమాత్రమును
లేక యంతయు "నీవే" యగు నిత్య సంపూర్ణస్వార్థత్యాగమే

సర్వోత్కృష్టమగు పరమావధి. కర్మయోగముకూడ నెటిగియో నెఱుగకో మానవుల నీపరమావధికే కొనిపోవుచున్నది. నిర్గుణవాదులు సగుణవాదులు అవతార వాదులునను భేదము లేక యెల్లర ధర్మ శాస్త్రములకు నిస్వార్థ పరిత్యాగమే మూలధర్మము. సకల నైతిక ధర్మములకు నిదియే మూలసూత్రము. దానివ్యాప్తిని మానవకోటి వరకు గాని, జంతుకోటి వరకుగాని, యింక నితర భూతజాలము వరకుగాని పెంచుకొనవచ్చును, కాని ముఖ్యసూత్రము మాత్రము స్వపరిత్యాగమే.

ఈ ప్రపంచమున పలురకముల మనుష్యులుందురు. కొందఱు దైవస్వభావులు; వారు పూర్ణత్యాగులై పరార్థముగ స్వప్రాణములనైన నవలీలగా పరిత్యజింతురు. వారే మానవులందఱిలో మహనీయులు. అట్టి వారొక్కరున్నచో నా దేశమునకు మోక్ష మఱచేతనే యుండును. కాని మన దౌర్భాగ్యముచే నట్టివా రత్యల్పముగ నుందురు. రెండవరకము తమకు హాని కలుగనంతవరకు పరోపకారము చేయుదురు; వీరు సామాన్యులు. మూడవ రకము తమ లాభమునకై యితరులకు హాని చేయుదురు. వీరు నరరూపరాక్షసులు. ఇక నాల్గవరకముకూడ నొకటి కలదని భర్తృహరి చెప్పుచున్నాడు; వారు హింసార్థమై పరులను హింసింతురు. వారు మానవులలోకెల్ల నధములు, వారి నేమనవలెనో యెఱుగము.

"శ్లో. ఏతే సత్పురుషాః పరార్థఘటకాః స్వార్థాన్ పరిత్యజ్య యే
సామాన్యాస్తు పరార్థ ముద్యమభృతః స్వార్థావిరోధేన యే
తేఽమీ మానుషరాక్షసాః పరహితం స్వార్థాయ నిఘ్నంతియే

యే తుఘ్నంతి నిరర్థకం పరహితంతే కేన జానీమహే."

శ్రేయముకొఱకే శ్రేయమునుజేయు సజ్జనులవలెనే హానికొఱకే హానిచేయు దుర్జనులు నుందురు. వారి కందుచే నెట్టి లాభమును గలుగదు; ఐనను హానిచేయుటే వారి స్వభావము.

ప్రపంచమున రెండు ధర్మములు కలవు; ప్రవృత్తి, నివృత్తి. ప్రవృత్తియనగా ప్రవర్తించుట; నివృత్తియనగా మళ్లుట. సంసారముప్రవృత్తి; "నేను, నాది"యను భావము ప్రవృత్తి; అహంకారమును పెంపొందించు నైశ్వర్యాధికారములు, గౌరవకీర్తులు మొదలుగుగనన్నియు ప్రవృత్తి; సకల ప్రదేశములనుండి సకల వస్తువుల నాకర్షించి 'అహమ్' అనెడి కేంద్రముచుట్టును జేర్చుట ప్రవృత్తి. ఇది మానవుని సహజస్వభావము. ఈ ప్రవృత్తి నుండి మళ్లుటే నివృత్తి. నివృత్తితోనే ధర్మజీవనమును, ఆస్తిక్యబుద్ధియు నారంభమగును. ప్రవృత్తి నివృత్తులు రెండును కర్మలే. ప్రవృత్తి దుష్కర్మ, నివృత్తి సత్కర్మ. నివృత్తి సకలధర్మమునకు, ఆస్తిక్యమునకు మొదలు; దాని సంసిద్ధి స్వార్థపరిత్యాగము, అనగా స్వప్రాణమనోధనముల నితరులకొఱకు సంతోషముతో సమర్పించుట. మానవుడీస్థితిని జేరుకొన్నచో కర్మయోగసిద్ధి గాంచినట్లే. ఇది సత్కర్మలచే గలుగు నుత్తమఫలము. ఏతత్వశాస్త్రమును పఠింపకున్నను, ఎట్టి యీశ్వర విశ్వాసమును లేకున్నను, జన్మమధ్యమున ప్రార్థనయన నేమో యెఱుగకున్నను, తన సత్కర్మలచే నెవ్వడేని జీవితమును సర్వస్వమును పరులకై ధారపోయగల స్థితికి వచ్చెనేని, ఆతడు ప్రార్థనలచే భక్తుడును,

తత్త్వవిచారముచే జ్ఞానియు చేరుకొను పదవినే చేరుకొన్నాడు.
కావున భక్తుడును, జ్ఞానియు కర్మపరుడు నొకే స్థానమునందు-
ఆత్మత్యాగమునందు జేరుచున్నారని స్పష్టమగుచున్నది.

మతము భేదించినను, శాస్త్రము వేరైనను, ఇతరులకై
యాత్మత్యాగము చేయఁగల మహాశయుని చూచినచో నెవ్వ
డైనను పాదాక్రాంతుఁడు కాకమానఁడు. ఇక్కడ మతసిద్ధాంత
ములతో నిమిత్తములేదు; మతమన్న నేవగించువారు కూడ
నిట్టి త్యాగమునుగాంచినపుడు ప్రణమిల్లకుండజాలరు. ఆస్తిక్య
మునువిడిచి యాత్మత్యాగమునుమాత్రమే బోధించినబుద్ధదేవుని
దివ్యచారిత్రమును జదువునపుడు, ఎంతటి మూఢాస్తిక్యాభిమాని
యైనను పులకితుఁడై పూజ్యభావము చూపకుండగలడా? ఆతడు
తనకును నాస్తికునకును జీవితాదర్శమం దీషద్భేదమైన లేదని
యెఱుఁగఁడు. భక్తుఁడు తన నిరంతర భక్తిభావముచేతను, సత్సం
గముచేతను తుదకిచ్చోటికే వచ్చి "దేవా! నీ యిచ్ఛయే
యగుఁగాక." యని సర్వసమర్పణచేయును. అది స్వార్థత్యాగ
ము. తత్త్వజ్ఞుఁడు తన యాత్మానాత్మ వివేకముచే అనాత్మను
మాయగా గుర్తించి యవలీలగా పరిత్యజించును. అది స్వార్థ
త్యాగము. కావున కర్మ భక్తి జ్ఞానములు మూఁడునిచ్చట గల
యుచున్నవి. 'ఈశ్వరుఁడు ప్రపంచమునకంటె వేరు' అని తొంటి
యాచార్యులు చేసిన యుపదేశమున కిదియే భావము. ప్రపం
చమను పదార్థమొకటి, ఈశ్వరుఁడను పదార్థ మింకొకటి; ఈ
విభేదము సత్యము; ప్రపంచమనగా వారి యభిప్రాయము
స్వార్థపరత్వము. స్వార్థరాహిత్యమే ఈశ్వరుఁడు. ఒకఁడు సువర్ణ

ప్రాసాదమున రత్నసింహాసనముపై నధిష్ఠించవచ్చును; ఐనను స్వార్థపరుడుకానిచో నాతడు దేవుడే. ఇంకొకడు పేలికలు కట్టుచు నన్నములేక కుటీరమున మాడవచ్చును; అయినను స్వార్థపరుడైనచో పరిపూర్ణముగా ప్రపంచమగ్నుడే.

మరల మన ప్రధానాంశమునకు వత్తము; శుభములేని యశుభము కాని, యశుభములేని శుభము కాని మన మెన్న డును చేయజాలమంటిమి. ఇట్లెటిగియు మనము కర్మచేయుటె ట్లు? ఇందుచేతనే కొందఱు మతప్రవర్తకు లీప్రపంచమునుండి తప్పించుకొనుటకై శరీరమును క్రమముగా శుష్కింపజేసి యా త్మహననము కావించుకొనుమని యుపదేశించియున్నారు; అట్లుకాక మనము జీవించునెడల ననేక క్షుద్రజంతువులను, పెక్కు మొలకలను చంపవలసివచ్చును. అనేక ప్రాణులకు హానిచేయవలసివచ్చును. అందుచే మరణము తప్ప మార్గాంత రము లేదని వారి భావము. జైను లీసిద్ధాంతమునే తమ యుత్త మాదర్శముగా బోధించియున్నారు. ఇది మిగులయుక్తి యుక్త ముగా గన్పట్టును. కాని యిందుకు సరియైన సమాధానము గీతలలో గలదు. గీత మన విధికృత్యములను నిర్లేపత్వముతో నాచరింపవలెనని యుపదేశించుచున్నది. నీ వీప్రపంచమున ను న్నను దీనికంటె భిన్నుడవు, నీవిందేమిచేయుచున్నను నీకొఱకు గాదు, అని తెలిసికొనుము. నీవు నీకొఱకు సత్కార్యము చేసినను, దుష్కార్యముచేసినను ఫలమును తప్పక కుడుతువు. సత్కార్యమైనచో సత్ఫలము, దుష్కార్యమైనచో దుష్ఫల ము ననుభవింపక తీరదు; కాని పరులకొఱకే కార్యము చేసి

నను ఫలము నిన్ను బాధింపదు. గీతయిట్లు ఘోషించుచున్నది:—

"యస్య నాహంకృతో భావో బుద్ధిర్యస్య నలిప్యతే
హత్వాస ఇమాన్ లోకాన్ నహంతి ననిబధ్యతే."

"ఎవనికి నేను చంపుచున్నానను భావము లేదో, ఎవని బుద్ధి నిర్లిప్తమో, యాతడు లోకులను చంపినను చంపినవాడు కాడు, ఆతనికి బంధములేదు." అందుచే కర్మయోగము "ప్రపంచమును పరిత్యజింపవలదు; ప్రపంచములో నుండి యందలి సుఖదుఃఖముల ననుభవింపుము. కాని నీభోగముకొఱకే యైనచో నెట్టి కర్మయుచేయవలదు. భోగము మన లక్ష్యముగ నుండరాదు. మొదట నిన్ను చంపుకొనుము; ఆవల విశ్వమంతయు నీవుగా భావించుకొనుము; ప్రాచీన క్రైస్తవులు చెప్పినట్లు "ప్రాతమనుష్యుడు చావవలెను." విశ్వమంతయు నీ నిమిత్తము సృజింపబడెనన్న స్వార్థభావమే యీ ప్రాతమనుష్యుడు. కొందఱు మూర్ఖులు తమ బిడ్డలచే "దేవా! ఈసూర్యచంద్రులను నీవు నాకొఱకే సృజించితివి." అని ప్రార్థనచేయింతురు. పరమేశ్వరునకు వారి బాలురకై సమస్తమును సృష్టిచేయుటకన్న వేరుపని లేదు కాబోలును! మీబిడ్డలకట్టి యవకతవకలు నేర్పకుడు. మఱికొందఱు మూర్ఖులు సకలజంతువులను మనము చంపి తినుటకే సృజింపబడెననియు, విశ్వమంతయు మన భోగార్థమే యనియు తలంతురు. ఇంతకన్న నవివేకముండబోదు. పెద్దపులికూడ నిట్లే "మానవుడు నాకొఱకై సృజింపబడెనని చెప్పి "దేవా! ఈమనుష్యులెంత దుర్మార్గులు! వారు తమంతనే వచ్చి నే నారగించుటకై నానోట బడకున్నారు. వారు నీ

నియమము నతిక్రమించుచున్నారు." అని మొఱ పెట్టవచ్చును. ప్రపంచము మనకొఱకు సృజింపబడినచో మనము ప్రపంచముకొఱకు సృజింపబడితిమి. ప్రపంచము మన సౌఖ్యార్థమన్న దుర్భావమే మన యధోగతికి కారణము. ఈ ప్రపంచము మనకొఱకుగాదు; అనేకలక్ష లిందుండి యేటేటను తరలిపోవుదురు; కాని ప్రపంచమునకు లెక్కలేదు; అనేకలక్షలు మరల వారి స్థానము నాక్రమింతురు. ప్రపంచము మనకొఱకెంతో, మనము ప్రపంచముకొఱకు నంతే.

కావున కర్మను యుక్తముగా జేయవలెనన్న, ముందుగా సంగమును వర్జింపవలెను. తరువాత నీవీ కోలాహలమున గలయక సాక్షివై యుండి పనిచేయుము; నాగురువర్యుడు తరుచు సెలవిచ్చుచుండునట్లు" మీ బిడ్డలను దాది చూచునట్లు చూడుడు. దాది మీబిడ్డను ప్రేమతో పెంచును, ఆట లాడించును, ఎత్తుకొని ముద్దాడును, కన్నబిడ్డను వలెనే కడు గారముతో చూచును; కాని మీరు మీయిల్లువదలి పొమ్మనినంతనే యామె తన మూటముల్లెలతో మీవాకిలివిడిచి పోవును; ఆమెలో సంగములేదు; అందుచే మునుపటి ప్రేమపోయినది. సామాన్యముగా దాదు లందఱు నింతే ప్రాతబిడ్డలను విడచిక్రొత్తబిడ్డలను గైకొను నప్పుడు వారి కిసుమంతయైన నొప్పియుండదు. నీవుకూడ నీస్వకీయముగా నెంచు సకలవస్తువులందునట్టి భావముతోనే సంచరింపుము. నీవుదాదివి, నీకీశ్వరవిశ్వాసముండునేని నీవిగా భావించు సకలము నాయనవి. అధికదౌర్బల్యమే కొన్నిసమయములందు మహాబలముగను, విశేషయోగ్యతగను

గన్నట్టును. ఒకఁడు నామీఁద నాధారపడియున్నాఁడనియు, నే నొకని కుపకారము చేయఁగలననియు తలంచుట దౌర్బల్యము. ఈ విశ్వాసమే సర్వసంగమునకు మూలస్థానము; ఈసంగము చేతనే దుఃఖము కలుగుచున్నది. ఈ లోకము మనపై నెవ్వరు నాధారపడియుండలేదు, ఒక్క బిచ్చగానిపైన మన ధర్మముపై నాధారపడియుండలేదు, మన దయపై నేప్రాణియు నాధారపడియుండలేదు, మన సహాయముపై నేజీవుఁడు నాధారపడియుండలేదు, అని మన మనస్సులకు బోధించుకొనవలెను. అందఱకును ప్రకృతియే తోడ్పడుచున్నది; మనలో ననేకలక్షలిచ్చుట లేకున్నను లోకనిర్వాహమునకు లోటుండదు. ప్రకృతి ప్రవాహము నీకొఱకు, నాకొఱకు నాగదు. ఇదివరలో చెప్పినట్లు పరోపకారము చేయుట కవకాశము లభించుట విశేష భాగ్యము; దానిచే మన కాత్మశిక్ష గలదు. ఇది మనము జీవితమున నేర్వవలసినమహాపాఠము; ఈ పాఠము నేర్చుకొన్నచో మనకే దుఃఖము లేదు; మన మెల్లయెడలను సంఘమునందు నిర్భయముగా సంచరింపవచ్చును. మీకు భార్యలు, భర్తలు, సేవకులు, పరిపాలించుటకు రాజ్యములు, ఎన్నియైన నుండవచ్చును; అయినను ప్రపంచము నీ యుపయోగముకొఱకు కాదనియు, ప్రపంచమునకు నీవు విధాయకముగ నవసరము లేదనియు, గ్రహించి యట్లు వర్తింతువేని నీకవి యెట్టిహానియుఁజేయవు. ఈయేఁడు నీ స్నేహితులు కొందఱు పరలోకగతులై యుండవచ్చును. వారు మరల వచ్చువరకు ప్రపంచవ్యాపారము జరుగక నిలిచి యున్నదా? దాని ప్రవాహ మాగిపోయినదా? లేదు, అది పో

వృద్ధిచేయున్నది. కాబట్టి లోకమునకు నీవేమో చేయవలెనన్న యూహను కట్టిపెట్టుము; లోకము నీసహాయము నపేక్షించుటలేదు. ఎవ్వడుగాని తాను లోకోపకారార్థమై జనించితినని తలంచుట వట్టి వెఱ్ఱితనము; అది యహంభావము, సౌజన్యముగా తోచు స్వార్థభావము ఇట్లు లోకము నీపైగాని, మఱియెవ్వరిపైగాని యాధారపడియుండలేదని నీమనస్సునకు నాటజేసినచో 'దుఃఖరూపమగు కర్మఫలము నిన్ను స్పృశింపజాలదు, నీవొకనికేమైన నిచ్చునప్పుడు ప్రతిఫలము నపేక్షింపకుము—అతని కృతజ్ఞతనైన నిరీక్షింపకుము; అప్పు డాతడు కృతఘ్నత చూపినను, నీవట్టి ప్రతిఫలము నాశింపనందున నీకు కష్టముతోచదు. అతని పాత్రతనుబట్టి నీవిచ్చితివి; ఆతడు తన కర్మచే దానిని పొందెను; నీకర్మ నిన్నందుకు నిమిత్తముగా జేసినది. ఏమోయిచ్చితినని నీవేల గర్వపడవలెను? నీవు లోకమునకిచ్చుటలో నంత విశేషమేమియులేదు. లోకముయొక్క కర్మ ననుసరించి దానికి సహాయము రావలసియుండెను; నీ వా సహాయమునకు వాహకుడవైతివి. ఇందు నీ యాధిక్యమేమున్నది? స్వార్థమే శుభాశుభవిభేదముచేయును; సంగమును విడిచినచో శుభాశుభము లుండబోవు. నీయిష్టములేక లోకమునం దేశక్తియు నిన్ను వశమొనర్చుకొనజాలదు. ఇది మిగుల దుర్గ్రాహ్యమైన యంశము; అయినను క్రమశః నీకు తెలియగలదు. నీయాత్మ యజ్ఞానముచే స్వాతంత్ర్యమును గోల్పోయినగాని యే మహాశక్తికిని లోబడజాలదు. అసక్తతచే నెట్టిశక్తినైన నవరోధింప గలుగుదువు. తనసెలవున్ననే కాని మానవుడేశక్తికిని లోగి

పోదని చెప్పుట సులభమే; కాని యేశక్తికిని స్వాధీనముకాక, బాహ్యానుభవములచే సుఖదుఃఖములను పొందక యుండువాని యథార్థలక్షణ మెయ్యది? ఆతడు లాభముచే పొంగడు; నష్టముచేఁ గ్రుంగడు: ఆత డేస్థితియందైన నిర్వాతదీపమువలె నిశ్చలముగా ప్రకాశించును.

శ్రీశుకుడు బాల్యమున తన జనకుడగు వ్యాసమహర్షి వద్ద, తత్త్వోపదేశముబడసి యావల తండ్రి యాజ్ఞానుసారముగా నింకను తత్త్వరహస్యమును గ్రహించుటకై జనక మహారాజు నొద్దకు పోయెను. జనకు డాతని రాకను ముందుగనే గుర్తెరిగి కొన్ని ఏర్పాటులు కావించెను; ఆ బాలుడు రాజభవనముం జేరి ద్వారము దగ్గఱ నిలిచెను. కాని యాతని నెవ్వరును పలుకరింపలేదు, ఆదరింపలేదు, లోనికి గొంపోవలేదు. మూడురాత్రులు, మూడు పగల్లు నాతడట్లే యన్నము లేక నీరు లేక కూరుచుండును. అంత నాకస్మికముగా రాజ మంత్రులు పరివారముతోవిచ్చేసి యాబాలుని విశేష గౌరవములతో లోనికిగొంపోయి యొక సుందర భవనమున ప్రవేశ పెట్టి సుగంధస్నానములు, స్వర్ణదుకూలములు, మృష్టాన్నములు నొసంగుచుండిరి. ఎనిమిది దినములు కడచెను; కాని యాయన నిర్మల ప్రసన్న వదనమున నెట్టి మార్పును తోచలేదు; రాజ ద్వారము కడ వేచి యుండు నప్పుడెట్టి నైర్మల్యమో యిప్పుడు నట్టి నైర్మల్య వికాసమే తేజరిల్లు చుండెను. అంత జనకు నాజ్ఞచే నాయనను రాజ సభకు గొంపోయిరి. రాజు సింహాసనముపై కొలువుతీరి యుండెను. నృత్యము, గానము, ఇతర వినోదములు మానసో

ల్లాసముగ జరుగుచుండెను. అంత జనకుడు శుకునిచేతి కొక్క పూర్ణ దుగ్ధ పాత్రము నిచ్చి యొక్క క్షీరకణమైన తొణకక కుండ సభ చుట్టు నేడు పర్యాయములు తిరిగి రమ్మనెను. నృత్య గానములు సాగుచుండెను. సుందరీ మణుల విలాస కటాక్షములు విద్యుద్వల్లుల గప్పుచుండెను. కాని యాబాలు డట్లే నిశ్చల చిత్తముతో నొక్క క్షీరకణ మైన చిందకుండ సభ నేడు సార్లు చుట్టి వచ్చెను. ఆతని యాజ్ఞ నొప్పినగాని యాతని చిత్త మెట్టి యాకర్షణకును వశము కాదు. జనకుడది కాంచి "నీజనకు డుపదేశించిన దానికన్న నీవు స్వయముగా నెఱింగిన దానికన్న అధికముగా నేనేమియు చెప్పజాలను. నీవు సత్యమును గ్రహించితివి, పొమ్ము" అని యాయనను పంపివైచెను.

విశేషముగా నాత్మ నిగ్రహము కల వానిని బాహ్యాకర్షణము లేమియు చేయజాలవు. ఆతని కింక దాస్యము లేదు. ఆతని చిత్తము ముక్తి పొందినది. అట్టివాడే లోకమున చక్కగా ప్రవర్తింపగలడు. ఈలోకమును గురించి తరుచుగా రెండు విధముల యభిప్రాయములు విందుము. ఒకటి నిరుత్సాహప్రేరితము, "ఈప్రపంచ మెంత ఘోరము! ఎంత క్రూరము!" అని. రెండవది యుత్సాహ ప్రేరితము, "ఆహా! ప్రపంచ మెంత రమ్యము! ఎంత యద్భుతము!" అని. మనోజయము లేనివారికే లోకము శోకపూర్ణముగ గాని, అథవా సుఖదుఃఖ మిశ్రితముగగాని తోచును. ఆత్మ నిగ్రహ శాలుర కీలోక ముత్సాహ ప్రదమై, సుసంపద్ధామమై యలరారును. వానికి శుభాశుభములు

లేవు; సర్వమును సమానమై సామరస్యముతో తమతమ స్థానములందు గోచరించును. ముందుగా లోకము నరక ప్రాయమనిచెప్పి కొందఱు మనుజులు మనోనిగ్రహము నభ్యసించిన పిమ్మట లోకము స్వర్గతుల్యమని సంస్తుతింతురు. మనము కర్మయోగ తత్పరులమై యిట్టి స్థితినిపొంద గోరుదుమేని ఎవ్వరైన ప్రారంభించినను స్వార్థత్యాగము సమగ్రముగా సిద్ధింపగలదు. అవిద్యాత్మకమగు నహంకారము నశించి సత్యమైన యాత్మభావోదయ మైనంతనే ప్రపంచమంతయు స్వర్గకాంతులతోను ప్రహ్లాదముతోను విరాజిల్లును. వాతావరణమంతయు సుగంధ భరితమగును; మానవ ముఖాంబుజములు మంగళ వికాసముతో విలసిల్లును. కర్మయోగము యొక్క మాహాత్మ్య భావమట్టిది! కర్మయోగముచే సాధ్యమగు పూర్ణజీవనోపలబ్ధి యట్టిది!

మన వివిధ యోగములకు పరస్పర విరోధము లేదు. అన్నియు నొకే గమ్యస్థానమునకు గొంపోయి మనలను పూర్ణులుగ జేయును! కాని దేనినైనను గాఢాభినివేశముతో నభ్యసింపవలెను. అభ్యాసమే యోగ రహస్యము. ప్రథమమున శ్రవణము, తరువాత మననము, ఆవల నభ్యాసము. ప్రతియోగమునకును నిదియే క్రమము. మొదట నీవు యోగమును నేమో వినవలెను; నిరంతర శ్రవణ మననములచే నగ్రాహ్యములగు విషయము లెన్నియో సుగ్రాహ్యములు కాగలవు. అంతయు నొక్క మారే గ్రహించుట దుర్లభము జ్ఞానము నీయందే కలదు. నీ వింకొకనివద్ద నెప్పుడును నేర్చుకొనుటలేదు

మనకు మనమే బోధ చేసికొనవలయును. బాహ్య గురువు సూచించును. ఆసూచన యంతర్గురువును విషయజ్ఞానము పొందుటకు ప్రేరేపించును. ఆవల దర్శన మననములచే మనహృదయములకు విషయములు విశదముగా గోచరించును. ఆపై క్రమముగా సంకల్ప శక్తి యుదయించును. మొదట భావము, పిదప సంకల్పము; ఆసంకల్పముచే నఖండమైన క్రియాశక్తి యుదయించి రక్తనాళములందు, స్నాయు పుంజమునందు, కండరములందు నలమికొని దేహ మంతయు స్వార్థ విరహిత కర్మయోగమున కుప కరణముగా పరిణమించును. ఆవలక్రమముగా నాత్మత్యాగము యొక్క పూర్ణ సిద్ధి లభించును. ఇందు మూఢ విశ్వాసము కాని యేమత సిద్ధాంతము కాని యావశ్యకము లేదు. హిందూ మహమ్మదీయ క్రైస్తవాది భేదము లేక సర్వ మతా వలంబకులు నీయోగము నవలంబింప వచ్చును. నీవుస్వార్థమును విడిచితివా? అదియేప్రశ్న. అట్లైనచో నీవే మత గ్రంథమును పఠింప నక్కఱ లేదు; ఏయాలయముకుగాని ఏమసీదుకు గాని పోనక్కఱలేదు. సర్వ యోగములకు నొక్కటే గమ్యస్థానము; ఏయోగమయినను యితరయోగ సహాయము తోనిమిత్తము లేకయే పూర్ణసిద్ధి నొసంగును. కర్మ, జ్ఞాన, భక్తి యోగములు మోక్షముకు స్వతంత్రసాధనములు. "మూఢులు మాత్రమే కర్మజ్ఞానములకు భేదము చెప్పుదురు, విద్వాంసుల ట్లుచెప్పరు." విద్వాంసులు మార్గములు వేఱైనను గమ్యస్థాన మొక్కటే- మానవప్రపూర్ణతయేయని గుర్తెఱుంగుదురు.

# కర్మయోగము

## సప్తమాధ్యాయము.

### మోక్షము.

కర్మ యనగా పనియనియేకాక కారణసూత్రమనియు నర్థము కలదని చెప్పియుంటిమి. ఫలము నుత్పాదించు నేకార్యమైనను, ఏభావమైనను కర్మయనబడును. కనుక కర్మసూత్రమనగా కారణసూత్రము, కార్యకారణముల సాహచర్యనియమము. కారణమున్నచోట కార్య ముండితీరవలెను; ఇది విధి. ఈ కర్మసూత్రము మన తత్త్వశాస్త్రానుసారముగ, విశ్వమునందంతటను వర్తించును. మన కింద్రియములచే గోచరమగునదంతయు, మనస్సుచే ననుభూతమగునదంతయు, మనము కర్మేంద్రియములచే గావించునదంతయు, విశ్వమునం దెచ్చట నేకార్యము జరిగినను, అది పూర్వకృతముయొక్క ఫలితమగుటే కాకయుత్తరకార్యమునకు మరల కారణమగుచున్నది. దీనితోగూడ, సూత్రమననేమో గ్రహించుటయు నావశ్యకము. ఏకార్యమైన మరల మరల జరుగు ప్రవృత్తిని సూత్రమందుము. రెండు కార్యము లొకటివెంట నొకటికాని, యేకకాలమునగాని తటస్థించుట చూచినచో, మరలనట్టే యవి యొకటివెంట నొకటికాని, యేక కాలమునగాని జరుగవలె నని మనము ప్రతీక్షింతుము. ఈ సూత్రమును నైయాయికులు

వ్యాప్తి యందురు. ఒక కార్య పరంపర మన మనోవిష యములతో నొక యాథక్రమమున సాహచర్య సంబంధము కలిగియుండును; అందుచే నొక విషయజ్ఞానము కలిగినపుడు తత్క్షణమే యది పూర్వమనోవిషయములతో నొక సంబంధమే ర్పరచుకొనును. ఏభావమైనను అనేక భావతరంగముల నుద్భ వింపజేయును; దీనినే యోగశాస్త్రము ఏ చిత్తవృత్తియైన నసే క చిత్తవృత్తుల నుత్పత్తి చేయునని చెప్పుచున్నది. దీనినే మనశ్శా స్త్రమున సాహచర్య సంబంధమందురు. కారణసూత్రమీా సం బంధమున నొక భాగము మాత్రమే. దీనిని న్యాయశాస్త్రమున వ్యాప్తి యందురు. అంతరంగవిషయములందు వలెనే బాహ్య ప్రపంచమందును సూత్రమనగా నీ భావమే — ఒక కార్యము వెంటనే యింకొక కార్యము పరంపరగా జరుగునను భావమే వర్తించును. కావున వాస్తవమునకు సూత్ర మనునది ప్రకృతి యందు లేదు. ఆకర్షణసూత్రము భూమియం దున్నదనికాని, ఏ యితరసూత్రమును, బాహ్యప్రకృతియం దెక్కడనైన గల దనికాని చెప్పుట తప్పు. కార్యపరంపరను మన మనస్సు గ్రహిం చు విధానమే సూత్రము; అది మనస్సునందున్నది. కొన్ని కార్యము లొకటి వెంబడి నొకటి జరిగి, మరల మరల నదే క్రమమున తటస్థించుననను నిశ్చయముతో గూడి, యీసమస్త కార్యపరంపరా విధానమును మన మనస్సు గ్రహింప గలుగు నట్లు చేయునదే సూత్ర మనబడును.

ఇక సూత్రముయొక్క ప్రపంచ వ్యాప్తి యన నేమో గ్రహింప వలసియున్నది. మన జగత్తు సత్తునందొక యంశము.

సత్తు అనంతము; జగత్తు దేశకాల నిమిత్తములతో గూడినది. అందుచే ఈ సోపాధిక జగత్తునందే సూత్రము కలదు; దాని కవ్వల నేసూత్రము నుండజాలదు. మనము జగత్తని చెప్పున ప్పుడు మనోబద్ధమగు సత్తు అనియే భావము; అనగా మనము చూచునట్టియు, వినునట్టియు, స్పృశించునట్టియు, గ్రహించున ట్టియు, భావించునట్టియు నింద్రియ విషయమగు జగత్తు; దాని కావలనున్న సత్తు సూత్ర బద్ధము కాదు; ఏమనగా మన మనోజగత్తున కవ్వల కార్యకారణ సూత్రము లేదు. మనస్సునకు పైన సాహచర్యసంబంధము లేదు, సాహచర్య సంబంధము లేక కార్యకారణసూత్రము లేదు. సత్తు నామ రూప విశిష్టమై కారణ సూత్రము ననుసరించునప్పుడే దానిని సూత్రబద్ధ మందుము; ఏలయన సకల సూత్రములును కార్య కారణ రూపములే. కాబట్టి యిక మానవునకు "స్వాతంత్ర్యే చ్ఛ" యనునది లేదని స్పష్టమగుచున్నది; అసలు స్వాతంత్ర్య + ఇచ్ఛ అను మాటలే విరుద్ధములు, ఏలయన ఇచ్ఛ మనోగ్రా హ్యమగు విషయము, మనోగ్రాహ్యమగు నదంతయు జగత్తులోనిది, జగత్తులోని సమస్తమును దేశకాల నిమిత్తము లతో గూడినది. మనకు గ్రాహ్యమగున దంతయు కారణబద్ధ ము, కారణబద్ధమగునది స్వాతంత్ర్యము కాజాలదు. అది యితర కారణములకు కార్యము; కొన్ని కార్యములకు మరల కారణ ము. కాని యేది యిచ్ఛ కతీతమై యిచ్ఛగా మారెనో, యేది దేశకాల నిమిత్తములద్వారా మారు వేచ్ఛగా మారెనో, అది స్వతంత్రము; ఈ యిచ్ఛ దేశకాలములు నతిక్రమించినప్పుడు

మరల స్వతంత్రమగును. అది స్వతంత్రమునుండి వచ్చుచున్నది, ఈ బద్ధరూపముగా మారుచున్నది, మరల నావలకు బోయి స్వతంత్రమునందు జేరుచున్నది.

ఈ జగత్తు ఎవ్వనినుండి వచ్చుచున్నది, ఎవ్వనిలో నున్నది, ఎవ్వనిలోనికి పోవుచున్నది? యను ప్రశ్నకు, అది స్వతంత్రము నుండి వచ్చుచున్నది, బంధములో నున్నది, స్వతంత్రములోనికి మరల పోవుచున్నది యని ప్రత్యుత్తరమిచ్చియున్నారు. అందుచే మానవుడు దేశకాలములను ఉపారించెడి యనంత సత్స్వరూపముకంటె భిన్నుడు కాడను సత్యమును మానవుడు దానిలో నతి సూక్ష్మాంశమని మాయాభిప్రాయము; మనము చూచెడి యీ దేహమును మనస్సును ఆ సర్వమునందలి యొక యంశము, ఆ యనంతమునందొక్క భాగము. ఈ సమస్త జగత్తును అనంతసత్తునందొక్క రేణువు; మన సూత్రములు, బంధములు, సుఖములు, దుఃఖములు, ఆశలు, నిరుత్సాహములు, అన్నియు ఈ చిన్న జగత్తులోనివే; మన యున్నతియు, అధోగతియు, ప్రసరణమును, సంకోచమును కూడ సంకుచితావరణము నందే. కావున మన మనఃకల్పిత మగు ఈ జగత్తువంటి జగత్తే యవ్వలగూడ నున్నదని తలంచుట బుద్ధిమాంద్యమనియు, ఈదృశ్యప్రపంచము కన్న భిన్నము కాజాలని స్వర్గాదిలోకములకు పోదుమని తలంచుట యవివేకమనియు తేటపడుచున్నది. దేశకాల నిమిత్త బాధ్యమును, మన మనోగ్రాహ్యమును నగు నీ ఖండజగత్తుతో నఖండ సత్స్వరూపము ననుబద్ధము చేయుచుండుట

యసాధ్యము, అసంభావ్యము. ఎవ్వడైన మరలమరల నిట్టిజగత్తునే కోరిన యెడల, ఆతడు తన ప్రస్తుతస్థితి కంటె నుత్తమ దశను భావింపలేనంత దుస్థితిలో నున్నాడని మనము గ్రహింపవచ్చును; ఆతడు తన వర్తమాన పరిస్థితులచే బద్ధుడు. ఆతడు తన యనంతభావమును మఱచి యీక్షుద్ర సుఖదుఃఖములందును, ఈ తాత్కాలిక రాగద్వేషములందును నిమగ్నుడయ్యెను. ఆతడు ఖండపదార్థమునే యఖండముగ నెంచి యీయజ్ఞానమును విడువ నిచ్చగింపకున్నాడు. ఆతడు తృష్ణాసక్తుడు; అది జీవనమునందలి తృష్ణ; దీనినే బౌద్ధులు 'తన్హా' లేక 'తృష్ణ' యందురు. మనకు గ్రాహ్యమగు నీ స్వల్పజగత్తున కవ్వల సృష్టియందు లక్షలాది విధముల జీవరాశులు, సుఖదుఃఖములు వృద్ధిక్షయములు, నియమములు నుండవచ్చును; కాని యది యంతయు నిది మన యనంతస్వభావమునం దొక్క యంశమగుచున్నది.

స్వాతంత్ర్యము పొందవలెనన్న యీజగత్తువలని బంధములను దాటిపోవలెను; అదియిచ్చటలేదు. పూర్ణశాంతి యీ ప్రపంచమున గాని, స్వర్గమునగాని, యింద్రియగోచరము, మనోగ్రాహ్యము, భావనాగమ్యము నగు మఱే యేప్రదేశమునందుగాని యలభ్యము. ఏలయన ఆ ప్రదేశములన్నియు జగత్తులోనివి; జగత్తు దేశకాలనిమిత్త బద్ధము; అందుచే నవి యేవియు స్వాతంత్ర్యములుకావు. మన భూమికంటె విశేషభోగాస్పదములగు తేజోమయలోకము లుండవచ్చును; కాని యవికూడ నీ జగత్తులోనివే యగుటచే కారణసూత్రబద్ధములే. అందుచే

మనము యథార్థమగు ఆస్తిక్యమున కాదియు, ఈ స్వల్పజగత్తున కంతము నగు నవ్వలిచోటికి పోవలెను. అస్థిరమును, అస్వతంత్రమునగు నీ జీవనతృష్ణను విడుచునందాక, అవ్వల నున్న యఖండస్వాతంత్ర్యము నించుకైన పొందజాలము. అందుచే మానవవాంఛల కెల్ల పరమావధియగు స్వతంత్రప్రాప్తి కిక నొక్కటే మార్గము కలదని సహేతుకముగ గన్పట్టుచున్నది; అది త్యాగము, ఈక్షుద్రజీవన పరిత్యాగము, భూపరిత్యాగము, స్వర్గపరిత్యాగము, దేహపరిత్యాగము, మనఃపరిత్యాగము, దేశకాలనిమిత్త బద్ధమగు సమస్తవస్తుపరిత్యాగము. క్షుద్రములగు మన యింద్రియ మనోజగత్తులను పరిత్యజించినచో తత్క్షణమే మనము ముక్తులమగుదుము.

కాని యీ ప్రపంచమును విడిచిపెట్టుట మిగుల కష్టము. ఎవ్వరో కాని యట్లు చేయజాలరు. అట్లు చేయుటకు మన శాస్త్రములు రెండు మార్గములు చూపుచున్నవి. ఒకటి "నేతి, నేతి" యనునది; రెండవది "ఇతి" యనునది. "నేతి" మార్గము చాల కఠినము; "నాకిదివలదు" అని చెప్పినంతనే మనోదేహము లాయాజ్ఞను శిరసావహించి నిగ్రహముతో పరిత్యజింపగల యసామాన్యదృఢచిత్తులగు మహనీయులు మాత్రమే యీమార్గము నవలంబింపగలరు. కాని యట్టివారు మిక్కిలి యరుదు. లోకములో బహుళసంఖ్యాకులు "ఇతి" మార్గమునే, సంసార మార్గమునే యనుసరించి, యందలి బంధములచే తనే తమ బంధములను త్రెంచివేయుదురు. ఇదికూడ నొకవిధమగు త్యాగమే; కాని యిది నెమ్మదిగను క్రమక్రమముగను

జరుగును; ఇందు మనస్సు విషయములను పరిత్యజింపక, వానిని గ్రహించి, భోగించి, యా యనుభవముచే విషయస్వభావము ను గుర్తెఱింగి, వానిని పరిత్యజించి సంగవిహీన మగును. మొదటిది యుక్తిమార్గమునను, రెండవది కర్మమార్గమునను అనుభవమువల్లను నిస్సంగత్వము నొందించును. మొదటిది జ్ఞానయోగము, ఇది సకల కర్మను నిషేధించును; రెండవది కర్మయోగము, ఇందు కర్మకు విరామము లేదు. ప్రతిమనుజుఁడును ప్రపంచమున కర్మ చేయవలసినదే. ఆత్మతో పూర్ణముగా తృప్తి నొంది, ఆత్మకంటె నన్యమును గోరక, సర్వదా ఆత్మనిష్ఠులై, ఆత్మరతులగువారు మాత్రమే కర్మచేయరు. తక్కినవారు తప్పక కర్మచేయవలసినదే. ఒక ప్రవాహము మార్గమధ్యమున పల్లమున ప్రవహించి, సుడిగుండముగానేర్పడి కొంతదూర మేగినపిమ్మట మరల సరళముగ, నిరాటంకముగ బారునట్లే ప్రతిమనుజుని జీవితమును సుడిలోఁజిక్కి, దేశకాలనిమిత్తరూపమగు నీ సంసారమున దగుల్కొని గిఱ్ఱున తిరుగుచు, నాతండ్రి, నాసోదరుఁడు, నాబిడ్డ, నాపేరు, నాప్రతిష్ఠయని యఱ్ఱులెత్తి యఱచుచు కొంతకాలమునకే యావర్తమునుండి తప్పించుకొని తన సహజస్వతంత్రమును మరల గాంచును. ప్రపంచమంతయు నట్లేచేయుచున్నది. తెలిసియో తెలియకో, మన మందఱము నీ జగద్భ్రాంతినుండి తప్పించుకొనుటకే యత్నించుచున్నాము. ఈ సుడినుండి విముక్తినొందుటకే మానవుని ప్రపంచానుభవమంతయు.

కర్మయోగ మననేమి? కర్మరహస్యజ్ఞానమే కర్మయో

గము. విశ్వమంతయు కర్మచేయుచున్నది. ఎందుకొఱకు? మోక్షముకొఱకు, స్వాతంత్ర్యముకొఱకు, ఆత్మస్వాతంత్ర్యముకొఱకు. సకల పదార్థములు స్వాతంత్ర్యముకొఱకు నిరంతరము శ్రమించుచున్నవి, బంధమునుండి దూరముగా పారిపోవుచున్నవి. సూర్యుడు, చంద్రుడు, భూమి, గ్రహములు, సమస్తమును ఈ బంధమునుండి పారిపోవుటకు ప్రయత్నించుచున్నవి. ఈ లోకమున నొక దెసనుండి యింకొక దెసకు కొట్టబడుచు, చిరకాలము దెబ్బలు తినిన పిమ్మట విషయముల యథార్థపరిజ్ఞానము నార్జించుటకు బదులుగా, కర్మయోగమునుండి కర్మమర్మమును, కర్మవిధానమును, కర్మకౌశలమును మన మభ్యసింపవచ్చును. మనము నిపుణముగా నుపయోగింపనిచో నెంతయో శక్తి వ్యర్థమైపోవును. కర్మయోగము కర్మను శాస్త్రపద్ధతిగా నేర్పరచి, లౌకికకర్మల నన్నింటి నెట్లు వినియోగించుకొనవలెనో తెలుపుచున్నది. కర్మచేయుటతప్పదు, అది యవశ్యాచరణీయము; అందుచే దాని నుత్తమసిద్ధికి సాధనముగా జేసికొనవలెను. కర్మయోగ మీ ప్రపంచము క్షణికమనియు, దీని ద్వారమున మనము పోవలెననియు, స్వాతంత్ర్య మిచ్చట శూన్యమనియు, సది దీని కవ్వలనే లభించుననియు నంగీకరించును. ఈ సంసారబంధములనుండి తప్పించుకొనుటకై మనము దానిగుండ మెల్లగా పోవలెను. సర్పము కుబుసమును విడిచి దూరముగా తొలగి దానిని చూచునట్లు, ఈ ప్రపంచమును పరిత్యజించి యవ్వలకు పోగల మహనీయు లెచ్చటనో యుండవచ్చును; కాని సామాన్యమానవులందఱును కర్మద్వారమున పోవలసినదే. కర్మయోగ మీ

విధానమును, ఈ మర్మమును బోధించును.

దాని యుపదేశమేమి? "నిరంతరము కర్మచేయుము, కాని కర్మసంగము విడువుము." దేనియందును సంగము వలదు. నీ మనస్సును స్వతంత్రముగ నుంచుము. నీవు చూచెడు సమస్తమును, ఈ బాధయు, దుఃఖమును ప్రపంచము యొక్క విధాయక లక్షణములు; దారిద్ర్యము, భాగ్యము, సౌఖ్యము, దుఃఖము క్షణభంగురములు; అవి మన యథార్థ ప్రకృతిలోనివి కావు. మన ప్రకృతి సుఖదుఃఖములకు, ఇంద్రియములకు, మనస్సునకు గూడ నతీతమైనది; అయినను నిరంతరము మనము కర్మచేయవలసినదే. "దుఃఖము సంగముచేత కలుగును, కాని కర్మవలనగాదు." మనము చేయు కర్మయందు మమత్వముకలిగినచో తత్క్షణమే మనము దుఃఖభాజనుల మగుదుము; మమత్వములేనిచో దుఃఖములేదు. ఇతరుని చిత్రరువ్వేదైన తగులబడినచో మనకు సాధారణముగా విచారము కలుగదు; కాని మన చిత్రరువే యైనచో మన విచారమునకు మేరయుండదు. ఎందుచేత? రెండును చిత్రరువులే, బహుశః రెండును నొక దాని ప్రతులే; అయినను ఒకదానికంటె నింకొకటి యేల యధికవిచారము కలిగింపవలెను? ఏలయనగా, నొకదానియందు మమకారము కలదు, ఇంకొకదానియందు లేదు. ఈ "యహంకార మమకారములే" సర్వదుఃఖములకును మూలము. మమకారముచే స్వార్థము, స్వార్థముచే దుఃఖము కలిగెను. స్వార్థయుక్తమగు ప్రతికార్యమును, ప్రతిభావమును మనకొక వస్తువునందు సంగము కలిగించి దానికి బానిసలను

గా జేయును. చిత్తమునందు లేచు "నేను, నాది" యనుప్రతిత రంగమును మన చుట్టు నొక శృంఖలమును వైచి మనలను బంధించుచున్నది. 'నేను, నాది'; యనుకొలదియు మన బంధములు కూడ పెరిగి మనకు మఱింత దుఃఖము నాపాదించును. కావున కర్మయోగము 'లోకము నందలి సకల చిత్రపటములను జూచి యానందించుము, కాని యేపటము నందును మమత్వమువహింపకుము.' అనిచెప్పుచున్నది. ఎన్నడును 'నాది' యనకుము, తోడనే దుఃఖము వాటిల్లును. 'నాబిడ్డ' యనియైన తలపోయకుము; సర్వదాబిడ్డను కాపాడుము, కాని 'మమకారమును' వదలుము; లేనిచో దుఃఖముతప్పదు. 'నాయిల్లు' అనకుము' నా దేహము' అనకుము. ఇక్కడనే కష్టమున్నది. ఈదేహము నీదికాదు, నాది కాదు, ఎవ్వరిది కాదు. ఇది ప్రకృతి సూత్రానుసారముగా వచ్చుచు పోవుచున్నది; కాని మనము స్వతంత్రులమై సాక్షుల వలె చూచుచున్నాము. ఒకపటము కంటెను, గోడ కంటెను, ఈదేహ మెక్కువ స్వాతంత్ర్యముకాదు. ఒకదేహమునందుమనకంత 'మమకార' మేలయుండవలెను? చిత్రకారుడు చిత్తరువు వ్రాసిపోవును. "అదినాకుండవలెను" అన్న స్వార్థమును దానియందు జొనుపకుము; చొనిపితివేని దుఃఖమే.

అందుచే కర్మయోగము ముందుగా నీస్వార్థమును జొనుపు ప్రవృత్తిని మాపవలెననియు, దానిని నిరోధింప గలిగిన పిదప మనస్సును దానియందు ప్రవేశింప నీయకు మనియుచెప్పుచున్నది. అప్పుడు నీవు ప్రపంచములోనికి పోయి నీయిష్టము వచ్చినంత పనిచేయవచ్చును. ఎక్కడనైన తిరుగ వచ్చును;

ఎవ్వరితోనైన గలయవచ్చును; కాని నీమనస్సునుకాలుష్యమం టజాలదు. ఉదకములందు నళినీదళమున్నది; కాని యుదకము లు దానినంటవు; అట్లే నీవును ప్రపంచమునం దుందువు. దీనినే వైరాగ్యము, అసంగము నందురు. అసంగము లేక యేయోగ మునుండజాలదు. అసంగమే సర్వయోగములకుమూలబీజము. గృహావాసమును, శుభ్రచేలములను, మృష్టాన్నమును పరిత్య జించి యెడారికేగువాడు సంగపూర్ణుడు కావచ్చును. ఆతనికున్న యొక్క పదార్థమే, ఆతని దేహమే యాంతనికి సమస్తమును గావచ్చును; ఆదేహము కొంచెము కాత చెప్పుడు నెంతో సంక్షో భ పడుచుండును. అసంగము బాహ్యమునకు సంబంధించినది కాదు; అది మనస్సునకు జెందినది. 'నేను, నాది' యను శృంఖల మనలను దేహముతో బంధించుచున్నది. మనకు దేహముతో ను, ఇంద్రియ విషయములతోను సంబంధము లేకున్న నేచ్చట నేస్థితియం దున్నను ముక్తసంగులమే. ఒకడు సింహాసనాసీనుడ య్యు సంగలేశమైన లేకుండవచ్చును. ఇంకొకడు జీర్ణవస్త్రధా రియై సంగనిమగ్నుడు కావచ్చును. ముందుగా నిస్సంగత్వము నార్జించి యవ్వల నిరంతర కర్మపరులము కావలెను. సంగపరి త్యాగము మిగుల దుర్లభమైనను కర్మయోగమందుల కుపాయ మును బోధించుచున్నది.

సంగత్యాగమునకు రెండు మార్గములున్నవి. ఒకటియీ శ్వరునందు గాని యితర బాహ్యసాహాయ్యమునందు గాని వి శ్వాస రహితులకు. వారు తమ సాధనములను తామే చూచు కొన వలసి యుందురు. వారు తమ వివేకము చేతను, సంకల్ప

బలిము చేతను 'నేను నిస్సంగుడను కావలెను' అని తలంచుచు కృషిచేయువలయును. ఈశ్వర విశ్వాసము కలవారికి మరియొక సులభోపాయ మున్నది. వారు కర్మఫలమును పరమేశ్వరునకే వదలి కర్మ నాచరించుచు సంగహీనులై యుందురు. వారేది విన్నను, ఏదికన్నను, ఏదితాకినను, ఏదికావించినను సమస్తము నీశ్వరుని కొఱకే. మన మేసత్కార్యము నైన జేసినచో నందుకు కీర్తినిగాని, లాభమునుగాని ప్రతిఫలముగ గోరకుందుముగాక. అదిపరమేశ్వరునిది; దానిఫలము నాయనకే వదలుదము. మనమొక ప్రక్కగా నిలిచి యాయన మనప్రభువనియు, మనమాయన యాజ్ఞలను శిరసావహించు సేవకుల మనియు, మన ప్రతిసంకల్పము నాయన ప్రేరణ యనియు భావించెదముగాక. నీవు చూచున దంతయు, చేయున దంతయు నీయారాధన యంతయు నాయనకే వదలి నిశ్చలచిత్తముతో నుందుము. మనము సంతుష్టులమై ప్రశాంత భావముతో మనదేహమును, ప్రాణమును, మనస్సును, సర్వమును పరమేశ్వరార్పణముగా నిత్యయజ్ఞము చేయుదము.అగ్నిలోనాహుతులొనర్చుటకన్న నహోరాత్రము లీమహాయజ్ఞమును ఈ యహంకార యజ్ఞము నాచరింపుదు. "ఈ ప్రపంచమున ధనమునకై వెదకుచుండగా నాకు దొరకిన పెన్నిధి నీవు; నీ కిదే యాత్మసమర్పణ చేయుచున్నాను. ప్రియాన్వేషణమున దిరుగుచుండగా నాకు లభించిన ప్రియ నిధానము నీవు; నీ కిదే నాయాత్మ సమర్పణ చేయుచున్నాను." ఇట్లని యహర్నిశము లుచ్చరించుచు "నాకేమియు వలదు; మంచిదికాని, చెడ్డదికాని, ఏదియు

నేను గణింపను; సర్వమునునీకు సమర్పించెదను". అని చెప్పవ
దము. ఆత్మత్యాగము మనకు నిరంతరాభ్యాసమై, మన యస్థి
మాంసములందు, స్నాయుశోణితములందు మిళితమై, మన దే
హములు ప్రతిక్షణమును త్యాగమునకు సంసిద్ధములగుదాక
మన మనుక్షణమును అహంకారమును పరిత్యజించుచుండ
వలెను. అనంతరము నీవు శతఘ్నీకానిర్ఘోషముతోను, యుద్ధ
ధ్వానములతోను సంకులమగు సమరరంగమధ్యమున నిలిచినను
నీచిత్తము నిశ్చలమై, స్వతంత్రమై ప్రశాంతమై, యుండును.

మనము సాధారణముగా స్వధర్మమని చెప్పు భావము
నిమ్నావస్థలోనిదని కర్మయోగము బోధించుచున్నది; ఐనను
మన మందరము స్వధర్మమును నిర్వహింప వలసియున్నాము.
ఈ స్వధర్మభావము విశేష దుఃఖకారణ మగుచుండుట మనకను
భవసిద్ధమే. మనకు స్వధర్మము జాడ్యప్రాయముగ నగుచున్న
ది; అది మనల నెప్పుడును ముందుకు లాగుచున్నది. అది మనలను
గట్టిగా పట్టుకొని మనజీవితమునంతను దుఃఖ భూయిష్ఠము కా
వించుచున్నది. అది మానవ జీవితమునకు విషతుల్యముగా పరి
ణమించినది. ఈస్వధర్మము మానవకోటి హృదయాంతరాళము
ను దహించివేయు మధ్యాహ్నమార్తాండుడగుచున్నది. దీనులైన
యీ స్వధర్మదాసులను జూడుడు! వారికి స్వధర్మముచే ప్రార్థ
నకు తీరిక లేదు, స్నానమునకు తీరిక లేదు. స్వధర్మము నిత్యము
వారి నెత్తిపై నూరుచుండును. వారు బయటకుపోయి పనిచేయు
దురు. స్వధర్మము వారితలపై తన్నుచుండును! ఇంటికి వచ్చిమ
ఱునాటి కృత్యములను యోచింతురు. స్వధర్మము వారిని వెంటా

డించును! అది బానిస బ్రతుకు, బండి యెద్దులాగు బొటపై కాడి క్రింద నెప్పుడో నేల మ్రొగ్గవలసినదే. మనము సాధారణముగా ననుకొను స్వధర్మ మిట్టిది. ఇక సత్యమగు స్వధర్మ మేమనగా మనము సంగబద్ధులము కాక స్వతంత్రులవలె కర్మచేయుచు దాని నీశ్వరార్పణము చేయుటే. మనస్వధర్మము లన్నియు నాయనవి. ఆయన మనల నిక్కడకు పంపినందుకు ధన్యులము. మన జీవితకాల మంతయు సేవ చేయుదము; మనము బాగుగా చేయుదుమో, ఓగుగా చేయుదుమో, ఎవ్వరి కెఱుక? బాగుగా చేసినచో నాఫలము మనకురాదు; ఓగుగా చేసినను మనకు విచారములేదు. శాంతచిత్తులై, స్వతంత్రచిత్తులై కర్మ చేయుము. ఇట్టి స్వతంత్రము పొందుట మిగుల దుర్లభము. దాస్యమును స్వధర్మముగా — తుచ్ఛ విషయాసక్తిని స్వధర్మముగా నిరూపించుట ఎంతసులభము! మనుష్యులు దారాద్రవ్యములందలి సంగముచే ప్రపంచ రంగమున ప్రవేశించి నిరంతర కల్లోలమున జిక్కుకొని కులిల పడుచుందురు. ఇట్లేల చేయుచుంటివని యడుగుము. 'అదిస్వధర్మ'మని ప్రత్యుత్తరమిస్తురు. అది యసంగతమగు ధనాశ; దానిని కొంచెము పూలచే గప్పజూతురు.

ఇంతకును స్వధర్మమనగానేమి? అది నిజముగా విషయప్రేరణము, మన సంగప్రేరణము; ఒక సంగము మనయందు పాదుకొన్నచో దానిని స్వధర్మ మందుము. ఇందుకు దృష్టాంతము, వివాహాచారము లేని దేశములలో భార్యాభర్తలకు నడుమ స్వధర్మములేదు. వివాహము కల చోట్ల సంగముచే భా

ర్యా భర్తలు కలిసి యుందురు; కొన్ని తరము లిట్లు కలిసియుం
డుటచే నా యాచారము స్థిరపడును; అంత నది స్వధర్మము
గా పరగును. అది గీర్ఘజాడ్యము వంటిది. బాధ హెచ్చినప్పుడు
వ్యాధియందుము, తక్కినప్పుడు స్వభావమందుము. కాని యిది
జాడ్యము. అట్టి సంగము కూడ దీర్ఘకాల మున్నచోని దాని
కే స్వధర్మమను పెద్దపేరుతో శుద్ధిస్నాన మిత్తుము. దానిపై
పుష్పములు చల్లుదుము; దానికై వాద్యములు మోయింతు
ము; దాని కొఱకు మంత్రములు పఠింతుము. అంతట లోకమం
తయు దానికై పెనగులాడును. ఈ స్వధర్మము నిమిత్తమై ప్ర
జలొకరి నొకరు దోచుకొని, యొకరి కుత్తుక లొకరు కోసికొం
దురు. పశుత్వము నశించు నంతవరకు స్వధర్మము మంచిదే.
స్వధర్మముకన్న నుత్తమాదర్శమును గ్రహింపలేని యధమజా
తి మానవులకు దానివల్ల కొంత మేలుకలదు; కాని కర్మయో
గులుగా నుండగోరువాకి స్వధర్మ భావమును తోసివేయు న
లెను. నీకుగాని నాకుగాని యే స్వధర్మమును లేదు. నీవు లో
కమునకు చేయవలసిన వెల్ల చేయుము. కాని స్వధర్మముగా
ను. భావిని గూర్చి చింతింపకుము. నిర్బంధముచే నేకార్యము
ను జేయకుము. నీకు నిర్బంధ మేల? నిర్బంధముచే జేయునది
తయు సంగమును వృద్ధిచేయును. నీకు స్వధర్మ మేల? సర్వము
ఈశ్వరునకు వదలుము. స్వధర్మానల జ్వాలలచే సర్వజనులను
దహించు నీ భీషణాగ్నికుండమున ఈ యమృతపాత్రను సేవిం
చి సుఖింపుము. మనమందఱము నాయన యిచ్ఛను నిర్వహిం
చుచున్నాము. మనకు శిక్షాబహుమానములతో నిమిత్తము

లేదు. బహుమానము గోరినచో శిక్షకూడ ననుభవింపవలసిన దే; శిక్షనుండి తప్పించుకొనుట కుపాయము బహుమానాపేక్ష లేకుండుటే; దుఃఖవిముక్తి కుపాయము సుఖకాంక్షను వీడుటే; సుఖదుఃఖములకు రెంటికి నవినాభావము కలదు. ఒక ప్రక్క సుఖము, ఇంకొక ప్రక్క దుఃఖము; ఒక ప్రక్క జీవనము, ఇంకొక ప్రక్క మరణము. మృత్యువు నతిక్రమించుటకు జీవనాసక్తిని పరిత్యజించుటే మార్గము. జీవన మరణములొక్కటే; భిన్నదిశలనుండి చూచినప్పుడు భిన్నరూపములుగ తోచుచున్నది. కావున దుఃఖరహితమగు సుఖమును మృత్యువిహీనమగు జీవనమును బడిపిల్లలకు బాలకులకు చెప్పదగిన మనోహర విషయము లగును; కాని తత్త్వజిజ్ఞాసు వీయుభయమును విరుద్ధములని విసర్జించును. నీ వేకార్యమును చేసినను ప్రతిష్ఠను, ప్రతిఫలమును గోరకుము. మన మేసత్కార్యమైన ప్రారంభించుటకు ముందే ప్రతిష్ఠను గోరుదుము; ఏ ధర్మమునైన చేయకమునుపే మన పేరు పత్రికలలో పెద్ద యక్షరములతో చిత్రింపవలెనని యభిలషింతుము. అట్టి కాంక్షలకు ఫలముగా దుఃఖము తప్పక కలిగితీరును. ఈ లోకములోని మహాపురుషు లెవ్వరికి నెఱుకబడకయే పరమపదించిరి. మనకు గానవచ్చు బుద్ధులును, క్రీస్తులును మనకు తెలియని మానవశిరోరత్నములగు మహానీయుల ముందఱ వెలవెల పోవుదురు. అజ్ఞాతులగు నిట్టి మహాత్ములు ప్రతిదేశమునందును వందలకొలది నుందురు. వారు గూఢవర్తనులై గూఢముగా నిర్యాణము చెందుదురు. కొంతకాలమునకు వారి భావములు

బుద్ధుల యందును, క్రీస్తుల యందును ప్రకాశితము లగును. వీరినే మన మెఱుంగునది; లోకోత్తరులగు మహాపురుషు లెవ్వరును తమ జ్ఞానముచే యశస్సంపాదన చేయజూడరు. వారు తమ భావములను లోకమున విడిచి పోవుదురు; వారు తమ పేరిట నెట్టి మత సంప్రదాయములను ప్రతిష్ఠింప జూడరు. వారి స్వభావమున కట్టి కార్యములన్న వెగటు. వారు శుద్ధ సాత్త్వికులు, వారు కదలజాలరు: వారు ప్రేమలో కరగి పోదురు. నే నొక గుహాయం దట్టి యోగిని చూచితిని. అట్టి యద్భుత మహిమ గల సాధు పుంగవుని మ తెచ్చటను గని యుండలేదు. ఆయన యందు జీవ భావము పూర్తిగా నశించి విశ్వ వ్యాపకమగు పరమాత్మ భావము మాత్రమే మిగిలియున్నదని చెప్పవచ్చును. ఏ జంతువైన నొక చేతిని గఱచినచో నాయన రెండవ చేతిని గూడ నిచ్చి, అది యీశ్వ రేచ్ఛ యనును. ఆయనకు తటస్థించు ప్రతి విషయమును ఈశ్వర సంకల్పమే. ఆయన మానవుల కంట బహుమ; అయినను ఆయన హృదయము ప్రేమ సాగరము; ఆయన భావములు సత్యములు, సుమధురములు.

ఆ మహాత్ముల తరువాత వారి కంటె నధిక రాజసుల ను పేర్కొన నగును; వారు సంగ్రామ శీలురు; వారు సిద్ధ పురుషుల భావములను గైకొని లోకము నందు బోధించెదరు. సాధు సత్తములు తత్త్వ రహస్య ములను, ఉదాత్త భావముల ను గుహ్యముగ సేకరించి యుంచుదురు; ఇతరులు — బుద్ధ క్రీస్తు ప్రముఖులు వానిని ప్రపంచమం దంతటను ప్రచారము

గావించెదరు. గౌతమ బుద్ధుడు తా నిరువది యైదవ బుద్ధుడన ని తరుచుగా పలుకుచుండెను. ఆయనకు పూర్వ మందలి యి రువది నలువురును లోక విఖ్యాతులు కాలేదు; వారి బోధలే గౌతమబుద్ధుని యుపదేశములకు బీజములై యుండును. ప్రథ మ వర్గమునకు చెందిన సత్పురుషులు శాంతులు, మౌనవ్రతు లునై యజ్ఞాత వాసము చేయుదురు. వారికి ధ్యానముల యొ క్క యద్భుత శక్తి ద్యోతకముగా నుండును. వారు గుహాంత రాళమున ద్వారములను బంధించి కూర్చుండి, సత్యములగు నాల్గు భావములను మాత్రమే ధ్యానించి మరణించినను, అవి శైలములను భేదించి, సాగరములను దాటి, భూవలయము నం దెల్ల సంచారము చేయునని వారి దృఢ నిశ్చయము. అవి మానవ జాతి హృదయములందు నెలవు కొని వానిని జీవిత మునం దనుష్ఠింప గల వీర సతులను, వీర పురుషులను ఉత్ప న్నము చేయును. సాత్త్విక వర్గము లోని సాధువు లీశ్వరుని పరమ సాన్నిధ్యమునం దుండుటం జేసి లోకమునం దుపదేశిం చుటకు, కర్మ చేయుటకు, ఖడ్గము ఝుళిపించుటకు, మానవ కోటికి మంగళములు సమకూర్చుటకు నిచ్ఛగింపరు. కార్యో త్సాహులగు పురుషు లెంతటి జ్ఞానులైనను వారియం దించుక యవిద్య శేషించియే యుండును. మన స్వభావమునం దింకను కాలుష్యలవ ముండిననే కాని కర్మ చేయ జాలము. సామా న్యముగా కామమును, సంగమును మనలను కర్మకు ప్రేరేపిం చును. సర్వ దిశ లందు సర్వ కార్యములను— అణుసంచలన మును గూడ సహస్ర చక్షువులతో పరికించెడి పరమేశ్వరు

డుండగా మానవు డెట్లు తన కావించు కర్మకు ప్రాముఖ్య లేశము నైన నీయగలడు? అత్యంత సూక్ష్మ కార్యములను గూడ నాయన యతిజాగ్రతగా నడుపుచున్నాడని గ్రహించియు నిట్లు చేయుట యాయన నవమానించుట కాదా! మనము భక్త్యాశ్చర్యములతో నాయన యెదుట వినమ్రులమై నిలిచి "నీ సంకల్పము నెరవేరు గాక." యని విన్నవింప వలెను. పరమనాత్మ్యైకులు పూర్ణముగా సంగనర్జితు లగుటచే కర్మ చేయజాలరు. సర్వ భావము తోడ నాత్మ ప్రవిష్టులై, యనన్య మగు నాత్మ నిరతితో నాత్మ సంగులగు ముక్తాత్ములకు కర్మ లేదు. అట్టి వారు మానవ కోటిలో నగ్రగణ్యులు; మిగిలిన వారిందఱు కర్మ నాచరింప వలసినదే. అట్లు చేయునప్పుడు మనము మాత్ర సహాయమునైన నీలోకమునం దేయల్ప ప్రాణికిని గావించుచున్నట్లు భావింపరాదు. మన వల్ల నేమియు కాదు. ఈప్రపంచ మను గరిడి సాల యందు మనము స్వయం సహాయ మొనరించు కొనుచున్నాము. కర్మ చేయుట కిదియే యుక్త భావము. ఈవిధముగా కర్మ చేయుదుమేని, కర్మచేయుటకు లభించు నవకాశము మన విశేష భాగ్యముగా నిత్యము ను స్మరించుదు మేని, మనము దేని యందు నెప్పుడును సక్తులము కాము. లోకమునందు మే మధికులమని యస్మదాదు లనేకులు తలంతురు; కాని మనమందఱము పరలోక గతుల మగుదుము; ఈలోకము మనల నైదు నిమిషములలో మఱచి పోవును. కాని ఈశ్వర జీవన మనంతము. "కో హ్యే వాన్యాత్ కః ప్రాణ్యాత్, య ఏష ఆకాశ ఆనందో నస్యాత్."

ఈ సర్వ శక్తి సంపన్నుని సంకల్పము లేక యెవ్వడు ముహూర్త మాత్రి ముచ్ఛ్వసింపగలడు? జీవింప గలడు? ఆయన జగద్భారమును వహించి నిత్యమును కర్మ శీలుడై యుండును. సర్వ శక్తియు నాయనది. ఆయన యాజ్ఞలోనిది. ఆయన యాజ్ఞచేతనే వాయువు వీచుచున్నది, సూర్యుడు ప్రకాశించుచున్నాడు, భూమి నిలుచుచున్నది, మృత్యువు తాండవము చేయుచున్నది. ఆయన సర్వ మయుడు, సర్వము నాయనయే. ఆయన యారాధనయే మనము చేయుగలుగునది. సమస్త కర్మ ఫలము నాయనకు వదలుడు; నిష్కాముల్తై సత్కర్మ కొఱకే సత్కర్మ చేయుడు; అట్లయిన సంపూర్ణముగా నిర్లిప్తులగుదురు. ఈవిధమున హృదయ బంధములు ఛిన్నా భిన్నములగును; మనకు పూర్ణ స్వాతంత్ర్యము సిద్ధించును. ఈస్వాతంత్ర్యమే కర్మయోగము యొక్క పరమావధి.

---

# కర్మయోగము.

## అష్టమాధ్యాయము.

### కర్మయోగాదర్శము.

మనము భిన్నమార్గములచే నేకలక్ష్యమును జేరవచ్చు ననెడిభావము వేదాంతమతములో నెల్ల మహోత్కృష్టమైనది; ఈ మార్గములను కర్మయోగము, భక్తియోగము, రాజయోగము, జ్ఞానయోగము అనునాల్గు సామాన్య విభాగములుగా నేనువిభజించి యుంటిని. కాని యీ మార్గములు ప్రత్యేక విలక్షణములు కలిగి పరస్పర భిన్నములు కావు. ఇవి యొక దానితో నొకటి కలయుచుండును. అయినను ముఖ్య లక్షణములను బట్టి వాని నాయా నామములతో వ్యవహరింతుము. కొందఱు కర్మ చేయుటకే కాని మఱే యెందుకును సమర్థులు కారనియు, కొందఱు భక్తి తత్పరులై యర్చనలు సేయుటకే కాని యన్య కార్యముల దక్షులు కాజాలరనియు, నింక కొందఱు కేవల జ్ఞాన నిష్ఠులై కూరుచుందు రనియు తలంపరాదు. ఆయా మనుష్యుల ప్రధాన లక్షణమును, ముఖ్య ప్రవృత్తిని బట్టి కర్మ మార్గులు, భక్తి మార్గులు, జ్ఞానమార్గులు, నని చెప్పుచుందుము. చివరకీ నా

ల్గు మార్గములును సమ్మేళనమై యొక్కటగును. సర్వ మతములును, సర్వ కర్మ మార్గములును, సకలారాధనా విధానములును ఏకపరమావధికే కొనిపోవును.

ఆ పరమావధిని చూపుటకు నే నిదివరకే యత్నించితిని. అది స్వాతంత్ర్య మని నాభావము. మన చుట్టు నున్న ప్రతి పదార్థమును, జడము నిర్జీవము నగు అణువు మొదలు కొని సర్వోత్కృష్టమగు మానవాత్మ పర్యంతమును స్వాతంత్ర్యము కొఱకు పోరాట పడుచున్నది. ఈ పోరాటము యొక్క ఫలితమే సమస్త ప్రపంచమును. సర్వ పదార్థ సమ్మేళనము లందును ప్రత్యణువును తక్కిన యణువుల నుండి పారిపో జూచుచున్నది; కాని యితరాణువులు దానిని నిరోధించుచున్నవి. సూర్యుని నుండి మన భూమియు, భూమినుండి చంద్రుడును పారి పో యత్నించు చున్నారు. సకల పదార్థములకు ననంతముగా చెదరి పోవు స్వభావము కలదు. ఈస్వాతంత్ర్యాభిలాషయే జగత్తు నందలి సమస్త వ్యాపారములకును మూలకారణము; ఈ యిచ్ఛచేతనే యోగి నిమీలిత నేత్రుడై ప్రార్థించుచున్నాడు; ఈ ప్రేరణచేతనే దొంగ యనిమీలిత నేత్రుడై చౌర్యము సలుపుచున్నాడు. కర్మ చేయు మార్గము యుక్తము కానప్పుడు దుర్మార్గ మందుము; అది సత్ఫలప్రదమైనప్పుడు సన్మార్గ మందుము. కాని ప్రేరణ యొక్కటే — స్వాతంత్ర్యము కొఱకు సంక్షోభమే. యోగి తన బద్ధావస్థను గుర్తించుటచే సంకటమునొంది దానినుండి వినిర్ముక్తుడు కాగోరుచున్నాడు; అందుచే నీశ్వరారాధన చేయుచున్నాడు. చోరుడు తనకు కొన్ని

పదార్థములులేవను భావముచే వ్యథనొందుచు, ఆదారిద్ర్యము నుండి తప్పించు కొనుటకై దొంగతనము చేయుచున్నాడు. చైతన్యసహితము చైతన్య రహితము నను భేదము లేక ప్రకృతి యంతయు స్వాతంత్ర్యమే లక్ష్యముగా గలిగి దానిని జేరుకొనుటకే సర్వదా సంకుల పడుచున్నది.; ఎఱిగియో యెఱుగకో, ప్రతి పదార్థమును స్వాతంత్ర్య సిద్ధి కొఱకే పాటు పడుచున్నది. యోగి యన్వేషించు స్వాతంత్ర్యమునకును, చోరు డన్వేషించు స్వాతంత్ర్యమునకును విశేష తారతమ్య మున్నది. యోగి వాంఛించు స్వాతంత్ర్యముచే నాయన యవిచ్ఛిన్న మగు నవ్యయానంద సౌఖ్యము నొందును; చోరుడు కోరు స్వాతంత్ర్యముచే నాతని యాత్మ నూతన శృంఖలాబద్ధ మగును.

ప్రతి మతమును సందు నీ స్వాతంత్ర్య సిద్ధికై యావేదన బహిర్గత మగుచున్నది. ఈ యావేదనయే సకల నీతి వర్తనకును విస్తారగతికును — అనగా మానవు డహంకృతి దేహ మనెడు భావమును దూరము చేయుటకు మూలాధార మగుచున్నది. ఒక మనుజుడు సత్కార్యములు చేయుచు నితరులకు సహాయము చేయుచున్నా డనగా, 'ఆతడు నేను, నాది' యను సంకుచితావరణమునందు బద్ధుడై యుండజాలడని భావము. స్వార్థము నుండి యిట్లు విడివడుట కంతము లేదు. సర్వ ధర్మ శాస్త్రములును సంపూర్ణ స్వార్థ రాహిత్యమునే యాదర్శముగా బోధించుచున్నవి. ఈయాదర్శమును జేరుకొన్నవాని స్థితి యెట్లుండును? ఆత డింక మునుపటి ప్రత్యేక నామరూప బద్ధుడగు క్షుద్రవ్యక్తి కాడు. ఆతడు విశ్వ వ్యాప్తి పొందెను. తొల్లింటి

క్షుద్ర వ్యక్తిత్వ మాతని నుండి యిక శాశ్వతముగ తొలగిన ది. ఆత డనంతు డయ్యెను. ఈ యనంతత్వ సిద్ధియే సర్వమత ములకు, సకల నీతి బోధలకు, తత్త్వోపదేశములకు చరమ లక్ష్యము. మానవాత్మ వ్యక్తిగతము మాత్రమే యని విశ్వసిం చువా రీభావమును విన్నంతనే భీతిల్లి పోవచ్చును. కాని వారు నీతివర్తనము నుపదేశించు నప్పు డీ భావమునే బోధించుచు న్నారు. వారు మానవుని స్వార్థత్యాగమునకు హద్దు పెట్టుట లేదు. వారి పద్ధతి చొప్పున నొక మనుష్యుడు సంపూర్ణ స్వా ర్థరాహిత్యము నొందినచో, ఆతనికిని తదితర విధానముల నవ లంబించి పూర్ణత్వము నొందిన వారికిని గలుగు భేద మెయ్య ది? ఆతడు విశ్వముతో నైక్యము పొందెను; అట్లు పొందుటే యందరి లక్ష్యమును. కాని పాపము, వారు తమ తర్కపద్ధ తుల నే పూర్ణముగా ననుసరించి యుక్త రీతిని సిద్ధాంతము చే య జాలకున్నారు. మానవునకు సహజ పరమావధి యగు నీ స్వతంత్రమును స్వార్థ శూన్య మగు కర్మ ద్వారమున సాధిం చుటే కర్మయోగము. అందుచే స్వార్థ ప్రేరిత మగు ప్రతి క ర్మయు మన లక్ష్యమును చేరుకొనుటకు ప్రతిరోధ మగుచున్న ది; స్వార్థ త్యాగము గల ప్రతి కర్మయు మనలను గమ్య స్థల ము వద్దకు గొని పోవుచున్నది; కావుననే ధర్మ నిరూపణ చే యునప్పు డీ యొక్క రీతిని మాత్రమే నిర్వచింప గలుగుచు న్నాము.— స్వార్థ సహిత మగునది యధర్మము, స్వార్థ ర హిత మగునది ధర్మము.

ధర్మా ధర్మములను వివరముగా నిర్దేశించుట మిగుల

కష్టము. ఏలయన, ఇది వరలో చెప్పినట్లు పరిస్థితులనుబట్టి వివరములు మారుచుండును. ఒకే కర్మ యొక సందర్భమున స్వార్థ రహితముగను, మఱొక సందర్భమున స్వార్థ పూర్ణముగను నుండ వచ్చును. అందుచే మనము ధర్మము యొక్క సాధారణ స్వరూపమును నిరూపించి, విశేషములను దేశ కాల స్థితుల ననుసరించి నిర్ణయము చేయుటకై వదలవచ్చును. స్థితి భేదమును బట్టి యొక దేశమున ధర్మ మగునది యింకొక దేశమున నధర్మముగ నెన్నబడుచున్నది. స్వాతంత్ర్యమే సమస్త ప్రకృతికిని పరమావధి. అది సంపూర్ణ స్వార్థ త్యాగము చేతనే సాధ్యము కాగలదు. స్వార్థ రహితమగు ప్రీతి భావమును, ప్రీతి వాక్యమును ప్రీతి కర్మయు నీ పరమా వధికే కొని పోవుచున్నది, అందుచే నది ధర్మము. ఈ నిర్వచనము సకల మతములకు, సకల ధర్మ పద్ధతులకు సమ్మతమైనది. కొన్ని సంప్రదాయములు ధర్మ మీశ్వరుని వలన జనించెనని చెప్పును. ఈ పని నేల చేయరాదని యడిగినచో "అది దేవుని యాజ్ఞ" యని ప్రత్యుత్తర మిచ్చును. ధర్మోత్పత్తిని గూర్చి వారిభావ మెట్టిదైనను, స్వార్థ త్యాగమే వారికిని మూల ధర్మము. ఇట్టి యుత్తమ ధర్మా దర్శము కలిగియు, కొందఱు తమ యల్ప 'వ్యక్తిత్వమును' పరిత్యజింపవలె నన్న భావమును విని నంతనే బెదరి పోవుదురు. అట్టి వారిని ఒక మనుజుడు సంపూర్ణ స్వార్థ త్యాగియై, స్వవిషయ మెన్నడును యోచింపక, ప్రస్తావింపక, స్వలాభార్థ మెట్టి కర్మయు చేయకున్నచో, అతనియం దింకను 'స్వ' త్వము —'వ్యక్తి' త్వము ఎక్కడ నున్నదని ప్రశ్నింపుడు.

ఆ 'స్వ'త్వమును — ఆ 'వక్తి'త్వమును ఆతడు స్వవిషయమై చింతించుచు, భాషించుచు, స్వార్థముగా కర్మ చేయునంత కాలమే గుత్తెయుంగును. ఆత డితరులను, విశ్వ జగత్తును మాత్రమే గుత్తెటిగి యున్నప్పుడు ఆతనియం దింకను వ్యక్తిత్వ మెక్కడ? అది నాడే సమగ్రముగ నశించినది.

కావున కర్మయోగ మనగా స్వార్థ రాహిత్యము వలనను, సత్కార్మల వలనను స్వతంత్రమును పొందుట కుద్దేశింపబడిన యొక ధర్మ విధానము. కర్మయోగి యేసిద్ధాంతమును విశ్వసింప నక్కఱ లేదు. ఈశ్వరుడు, ఆత్మ మొదలగు నాధ్యాత్మిక విషయములను గూర్చి యాత డెట్టి విచారణయు చేయ నక్కఱ లేదు. స్వార్థ రాహిత్యమే యాతని ప్రత్యేకాదర్శము; దాని నాతడు స్వయముగా సాధింప వలసి యున్నాడు. ఆతని జీవితము నందలి ప్రతి ముహూర్తము నీ యాదర్శోపలబ్ధి నోంద వలసి యున్నాడు; ఏలయన జ్ఞాని తన వివేకము చేతను, భక్తుడు తనప్రేమ చేతను దేనిని సాధింప బూనుచున్నారో, దానినే కర్మయోగి యెట్టి మత సిద్ధాంత సాహాయ్యమును లేకయే కేవలము కర్మవలన సాధింపవలసి యున్నాడు.

ఇక తరువాత ప్రశ్న, ఈకర్మయోగ మనగా నేమి? ఈ లోకశ్రేయ మనగా నేమి? లోకమునకు మనము శ్రేయము చేయగలమా? వాస్తవార్థమున చేయజాలము; వ్యవహారార్థమున చేయగలము. లోకమున కెట్టి శాశ్వత శుభమును మనము చేకూర్పజాలము; అట్లు చేయ గలిగినచో లోక మీ లోకముగ నుండదు. ఒకని యాకలి నైదు నిముసముల సేపు

తీర్ప వచ్చును, కాని యాతడు మరల క్షుత్పీడితు డగును. మనము మానవునకు కల్పింప గల ప్రీతి సౌఖ్యమును క్షణికమనుట స్పష్టము. మరల మరల వచ్చెడి యీ సుఖ దుఃఖ జ్వరమును శాశ్వతముగ నెవ్వడును మాన్పజాలడు. లోకమునకు శాశ్వత సుఖమును మనము సమకూర్ప గలమా? సముద్రము నం దొకచో నిమ్నము గాక మఱొకచో తరంగ మేర్పడుట లేదు. మానవుని యాశలకు, అపేక్షలకు సంబంధించి నంత వరకు లోకమున సుఖ మెప్పుడును సమానమే. దానిని హెచ్చింప జాలము, తగ్గింపజాలము. మనకు తెలిసి నంత వరకు మానవ జాతి చరిత్రను పరిశీలింపుడు. ఆ సుఖములే, ఆదుఃఖములే, ఆస్థితివిభేదములే కన్పట్టుట లేదా? కొందఱు ధనికులు, కొందఱు దరిద్రులు, కొంద ఱధికులు, కొంద ఱల్పులు, కొందఱారోగ్య శాలురు, కొంద ఱామయ పీడితులు కాదా? నే డీదేశమునం దెట్లో ప్రాచీన కాలమున ఈజిప్టు, గ్రీసు, రోము మున్నగు దేశములందు నట్లే కాదా? మనకు చరిత్ర తెలిసి నంతవర కంతియే. అయిన నీ యనివార్య మగు సుఖ దుఃఖ విభేదమును మాపుటకై యనవరత ప్రయత్నము జరుగుచునే యున్నది. ఇతరుల జీవితములను సుఖ మయముగ జేయుటకై ప్రతికాలమునందు వేలకొలది స్త్రీపురుషులు కృషి సలిపి యుండిరి. కాని వారి కృషి యెట్లు ఫలించినది? ఒక చోటి నుండి యింకొక చోటికి తరుముచు మనము కందుక క్రీడ సలుప గలము. మనము దేహము నుండి బాధను తొలగింతుము, కాని యది మనస్సును జేరును. అది కొండ మీదికి బరువు నెత్తుట

వంటిది; ఒక్క యడుగు పై కెత్తిన నాలు గడుగులు క్రిందికి జారును. ధర్మ యుగమును గురించిన మన ప్రసంగము లన్నియు బడి పిల్లల వినోద కథలే కాని యంతకు నెక్కువ కావు. ధర్మయుగ మవతరించి నప్పుడు ప్రతి జాతియు లోకము నందలి జాతులలో నెల్ల తానే యగ్రఫలము ననుభవింతు నని విశ్వసించుచున్నది. ధర్మయుగమును గురించిన పరార్థ భావ మిట్టిది!

మనము లోక సుఖమును పెంపొందింప జాలము; అట్లే దుఃఖమును పెంచ జాలము. లోక మందలి సుఖ దుఃఖ శక్తుల మొత్త మెప్పుడును సరి సమానముగ నుండును. మన మీవల నుంచి యావలకు, ఆవల నుంచి యీవలకు దానిని త్రోయుదుము; కాని యది యట్లే యుండును; యథాస్థితి యం దుండుటే దాని స్వభావము; ఈ పోటు పాటులు, ఈ పడుట లేచుటలు ప్రపంచ స్వభావము లోనే యున్నవి. అన్యథా యెంచుట చావు లేని బ్రతుకు నెంచుట యగును. ఇందర్థము లేదు; జీవన మన్న భావమునందే మరణము కలదు; సుఖ మన్న భావము నందే దుఃఖ మున్నది. దీపము సంతత జ్యోతిగా వెలుగు చున్నది, అదే దాని జీవనము. నీవు జీవనము కోరుదు వేని దాని కొఱకు ప్రతి క్షణమును చావవలెను. జీవన మరణములు రెండు నొక్కటే; దృక్కోణభేదముచే భిన్నముగా గన్పట్టుచున్నవి. అవి యొకే తరంగము యొక్క యుత్థాన పతనముల వంటివి. ఒకడు పతనము దెస చూచి నిరుత్సాహుడగుచున్నాడు. ఇంకొక డుత్థానముం గాంచి పరమోత్సాహ

భరితు డగుచున్నాడు. బాలుడు బడికి పోవుచు తల్లి దండ్రులు బరువు మోయునంత కాలమును ఆతనికి సర్వము సంతోష ప్రదముగ నుండును; కాని వృద్ధుడు వివిధానుభవములచే శాంతించి యుత్సాహము గోల్పోవును. అట్లే పురాతన జాతులు తమ పార్శ్వములందుండు విలయచిహ్నములం గాంచి నూతన జాతులకన్న మందోత్సాహము కలిగియుండును. "వేయేండ్లు పురము, వేయేండ్లు వనము" అని యొక సామెత కలదు. పురము వనమగుటయు, వనము పురమగుటయు సర్వత్ర జరుగుచునే యున్నది; ఈ రెంటిలో తాము చూచిన దెసనుబట్టి జను లుత్సాహులు, నిరుత్సాహులు నగుచున్నారు.

ఇక సమత్వముంగూర్చి వివేచన చేయవలసియున్నాము. ధర్మయుగోదయముం గూర్చిన భావములు మనుజులను సత్కార్యానుష్ఠానమునకు పురికొల్పెను. అనేక మతము లీ విషయమున దేవుడే భూమిని పాలించుట కవతరించుననియు, అప్పుడు సర్వజనులును సమానసౌఖ్యముల నోలలాడుదురనియు బోధించుచున్నవి. ఈ సిద్ధాంతమును బోధించువారు వట్టి మూఢ విశ్వాసులు; మూఢ విశ్వాసులే మానవులలో నెల్ల సత్యపరాయణులు. ఈ మూఢ విశ్వాసముయొక్క యాకర్షణ వల్లనే క్రైస్తవమతము మొదట వ్యాప్తిని గాంచెను. గ్రీసు, రోము దేశములందలి బానిసలకీ యుపదేశ మమృతప్రాయముగ నుండెను. ధర్మయుగము వచ్చునంతనే తమ దాస్యము తొలగుననియు, తినుటకు త్రాగుటకు పుష్కలముగా లభించుననియు వారు విశ్వసించి క్రైస్తవపతాకముచుట్టును జేరిరి.

మొదట నీ భావమును బోధించిన వారు మూఢవిశ్వాసులు; కాని నిష్కపటులు. నవీనకాలమందీ ధర్మయుగాభిలాష సమత్వరూపమును—స్వతంత్రము, సమత్వము, సోదరభావము, వీని రూపమును ధరించుచున్నది. ఇదియు మూర్ఖ విశ్వాసమే. యథార్థమగు సర్వసమత్వ మీ లోకమునం దెప్పుడు నుండ లేదు, ఎప్పుడు నుండబోదు. మన మందఱము నిక్కడ నెట్లు సములమై యుండగలము? అట్టి యసంభవమగు సమత్వము సంపూర్ణ ప్రళయమును సూచించును. ఈ ప్రపంచ మిట్లుండుటకు హేతువేమి? సామ్యావస్థ పోవుటే. నామ రూపములు లేని యాద్యస్థితియందు ప్రకృతి సామ్యావస్థయం దుండెను. విశ్వనిర్మాణశక్తులన్నియు నెట్లు వచ్చుచున్నవి? సంక్షోభము, స్పర్థ, కలహము, వీనిచేతనే కదా! ప్రకృతి మూలపదార్థముయొక్క యణువులన్నియు సామ్యావస్థయం దుండెననుకొందము. అప్పుడు సృష్టి రచన యుండునా? అది యసాధ్యమని ప్రకృతి శాస్త్రములు చెప్పుచున్నవి. ఒక జలభాగమును గదల్చుము. తత్క్షణమే జలకణము లొండొంటిని జేరి మరల శాంతముగ నుండుటకు యత్నించును; ఇట్లే మనము జగత్తునదంతయు, అందలి సమస్త పదార్థములును, సంపూర్ణసామ్యావస్థ చెందుటకు మరల యత్నించుచున్నవి. మరల చలనము కలుగును, మరల సమ్మేళనము, సృష్టియు కలుగును. భేదమే సృష్టికాధారము. అయినను సామ్యావస్థను సమకూర్చుశక్తులు కూడ సామ్యావస్థను నాశముచేయు శక్తులవలెనే సృష్టి కార్యమునకు సమానావశ్యకములు.

ఈ ప్రపంచమం దెప్పుడును సంపూర్ణమగు సామ్యావస్థ, అనగా నన్యోన్య విరుద్ధములగు సర్వశక్తుల సామ్యావస్థయుండ జాలదు. అట్టి యవస్థ తటస్థించుటకు పూర్వమే ప్రపంచము ప్రాణికోటి జీవనమున కనర్హమగును; అందుచే నే ప్రాణియు నుండదు. కావున ధర్మయుగమును, సంపూర్ణసమత్వమును గూర్చిన మన యభిప్రాయము లన్నియు నసంభవము లగుటమాత్రమేకాక, వాని ననువర్తింపబూనినచో తప్పక ముప్పు వాటిల్లును. మన మందఱమును సమానమేధాశక్తితో పుట్టితిమని యెవ్వడు ననజాలడు. మనము భిన్నశక్తులతో ప్రపంచమునందవతరించుచున్నాము. పుట్టుపూర్వమే పరిష్కృతమైన యీ తారతమ్యము నుండి మనము తప్పించుకొనజాలము. సమగ్రమగు నభేదావస్థ మృత్యువు. ప్రపంచ మున్నంతకాలము భేదముండును, ఉండి తీరవలెను; ఒక సృష్టికల్ప మంత మొందినప్పుడు మాత్రమే సర్వసమత్వము గల ధర్మయుగ మేతెంచును. తత్పూర్వము సమత్వము సున్న. అయినను ధర్మయుగాదర్శము కార్యోత్సాహమునకు ప్రేరకముగా నున్నది. సృష్టికి భేద మెంత యావశ్యకమో, ఆ భేదమును తగ్గించుటకూడ నంతియే యావశ్యకము. స్వతంత్రమును, ఈశ్వర సాయుజ్యమును పొందుటకై యత్నము లేకున్న సృష్టియే యుండజాలదు. ఈ భేదాభేదశక్తులకు గల తారతమ్యమే మానవులబంధ మోక్ష భావములకు హేతువు. ఈద్వివిధ భావము లెల్లప్పుడు మనలను కర్మకు పురికొల్పుచు మన బంధమోక్షములకు కారణము లగును.

ఈ ప్రపంచ యంత్రము చక్రములోపల చక్రముకలిగి మిగుల భయంకరమైనది; దానిలో చేయిపెట్టినచో వెంటనే మనము తుత్తునియలై పోదుము. ఒక కర్తవ్యమును తీర్చిన పిమ్మట నికహాయిగా విశ్రమింపవచ్చునని మన మందఱము తలంతుము; కాని దానిలో సరసగమైన ముగియకమునుపే మఱియొక కర్తవ్యము వేచియుండును. విషమము, దుర్వార్యమునగు నీ ప్రపంచమహాయంత్రము మనల నందఱను లాగుకొని పోవుచున్నది. దీని నుండి తప్పించుకొనుటకు రెండుమార్గములే కలవు; ఒకటి యంత్రము జోలి కసలే పోకుండుట, దానిని తిరుగ నిచ్చుచు దూరమునం దుండుట, మనకోరికల నన్నింటిని పరిత్యజించుట. ఇది చెప్పుట తేలిక, కాని చేయుట దుర్లభము. కోటిలో నొక్కడైన నట్లు చేయుజాల డనుకొందును. రెండవది ప్రపంచములో దుమికి కర్మరహస్యమును గ్రహించుట; ఇదియే కర్మయోగమార్గము. లోపల నుండి యుపాయమగు కర్మచే వెలుపలకు రావచ్చును. ఈ యంత్రద్వారముననే బయటకు గూడ మార్గము కలదు.

మన మిప్పుడు కర్మయన నేమో చూచితిమి. అది ప్రకృతి యొక్క మూలబీజములో నొకభాగము. ఈశ్వరవిశ్వాసుల కిది సుగ్రాహ్యము; ఆయన మన సహాయ మపేక్షించునంతటి యసమర్థుడు కాడని వారెఱుంగుదురు. ఈ ప్రపంచము నిత్యమైనను మోక్షమే మన లక్ష్యము; స్వార్థనివృత్తియే మన పరమావధి; కర్మయోగాను సారముగ నీ పరమావధిని మనము కర్మమూలముననే చేరగలము. ప్రపంచమును స్వర్గప్రాయముగా

చేయుదమన్న భావము మూఢవిశ్వాసులకు సత్కార్యోత్సాహమును పురికొల్పవచ్చును; కాని మూఢ విశ్వాసముచే లాభమువలెనే నష్టముకూడ గలుగును. మోక్షమునందలి సహజానురాగముకంటె కర్మచేయుటకు అన్యప్రేరణ మేమి కావలెను? అని కర్మయోగి ప్రశ్నించును. సామాన్యలౌకిక భావముల నతిక్రమించుము; "కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన." నీకు కర్మయందే కాని ఫలమునం దెప్పుడు నధికారము లేదు. ఈ సత్యమును గ్రహించి యాచరణ యందు పెట్టుట సుసాధ్యమని కర్మయోగి చెప్పును. లోకసంగ్రహభావ మాతనిలో నొక భాగమైనప్పుడు కార్యోద్దేశముకొఱకు బాహ్యమున వెదుక నక్కఱలేదు. మనము శ్రేయమునే చేయుదము, శ్రేయము చేయుట శ్రేయస్కరము; సత్కర్మ స్వార్థాపేక్షతో చేసినను బంధహేతు వగుచున్నదని కర్మయోగి చెప్పును. ఏ కార్యమైన నణుమాత్రము స్వార్థముతో గూడినను, మనలను ముక్తులను జేయుటకు బదులు మన కాళ్లకు మఱియొక సంకెలను తగుల్చుచున్నది.

కావున సకలకర్మఫలమును పరిత్యజించుటే, కర్మానుషంగము లేకయుండుటే యేకమార్గము. ఈ ప్రపంచమనగా మనము కాదు, మనమీ ప్రపంచమును గాదు. మనము నిశ్చయముగా దేహములము కాము; మనము వాస్తవమున కర్మచేయుటలేదు. మన మాత్మస్వరూపులము, నిష్కర్ములము, నిత్యశాంతులము. మన కొక బంధ మేల? మనము సంపూర్ణముగా సంగవర్జితులమై యుండవలెనని చెప్పుట మంచిదే; కాని

యుందుకు మార్గమెయ్యది? ఫలోద్దేశము లేక మనము కావిం చు ప్రతి సత్కార్మయు నూతన బంధమును నిర్మించుటకు బదులుగా నొక ప్రాతసంకెలనే బ్రద్దలు చేయును. ప్రతిఫలము నాశింపక మనము లోకములోనికి పంపు ప్రతి సద్భావమును మన శృంఖలలలో నొక దానిని భిన్నముచేసి, మన కల్మషములను నానాట గడిగి, మనలను లోకపావనులను గావించును. ఇది యంతయు సత్యోక్తిగ, శుష్క వేదాంతముగ, అసంభవముగ గన్పట్టవచ్చును. నేను భగవద్గీతపై వ్రాసిన యనేక ఖండనలను జదివితిని; నిష్కామకర్మ చేయుట యసంభవమని పలువురు చెప్పియుండిరి. మూఢ విశ్వాసముచేగాని పరార్థముగ కర్మ చేయుట వారెఱుగరు, అందుచే వారట్లందురు.

ఇక నీ కర్మయోగోపదేశమును సాకల్యముగా ననువర్తించెనని చెప్పదగిన యొక మహాపురుషుని గురించి యించుక ప్రస్తావించి యీ విషయమును ముగించెదను. ఆయన శ్రీ బుద్ధదేవుడు. కర్మయోగమును సమగ్రముగ నాచరించిన దాయన యొక్కడే. ప్రపంచమునందు బుద్ధుడుతప్ప తక్కిన మత ప్రవక్తలందఱును తమ లోకసంగ్రహమునకు బాహ్యసంకల్పములచే ప్రేరితులైరి. ఈ మహనీయు నొక్కనిదక్క లోకమునందలి తక్కిన ప్రవక్తలనందఱను రెండు తరగతులుగా విభజింపవచ్చును; ఒక రీశ్వరుని యవతార పురుషులమనియు, నింకొక రీశ్వరుని దూతలమనియు చెప్పుదురు; వారెంత యాధ్యాత్మికముగ మాట్లాడినను తమ సత్కార్మాచరణకు బాహ్య సంకల్పముచేతనే ప్రేరితులై, బాహ్యమునుండి ఫలము నాశిం

చుచుండిరి. కాని బుద్ధుఁడొక్కఁడే "ఈశ్వరుని గుఱించిన మీ వివిధమతములను నేను తెలిసికొనఁగోరను. ఆత్మవిషయమగు సూక్ష్మసిద్ధాంతముల నన్నింటిని చర్చించుటచే గలుగు ప్రయోజనమేమి? సత్కార్యములు చేయుచు సజ్జనులై యుండుఁడు. ఇదియే మిమ్ము ముక్తులుగ జేసి, సత్యమేది కలదో దానియందు జేర్చును." అని యుద్ఘోషించెను. ఆయన కర్మాచరణమం దెప్పుడును స్వార్థభావ మిసుమంతయు నెఱుఁగఁడు; ఆయనకన్న మానవకోటి కధిక సేవకు డెవ్వఁడు? అందఱికన్న నంత యున్నతికి పోజాలిన మహనీయుని మానవేతిహాసమునుండి మఱొక్కని జూపుఁడు. మానవజాతియంతయు నంతటి యుత్తమవర్తనుని, అంతటి యుత్తమ తత్త్వబోధకుని, అంతటి యుత్తమ కారుణ్యమూర్తిని, ఒక్కని మాత్రమే సృజింపగలిగెను. ఈ మహాతాత్త్వికుఁడు పరమతత్త్వము నుపదేశించుచు గూడ నత్యంతస్వల్పప్రాణులందును పరిపూర్ణదయామయుఁడై స్వసుఖము నించుకైన పాటింపలేదు. ఆయన నాదర్శ కర్మయోగి. ఆయన లోకమునం దవతరించిన మహనీయులలో నెల్ల మహనీయుడని మానవేతిహాసము చాటుచున్నది. అంతటి బుద్ధివైదగ్ధ్యము, అంతటి దయార్ద్ర భావము—ఇట్టి యసదృశ సమ్మేళనము మఱియొక మానవునియందు జరిగియుండలేదు; అంతటి యాధ్యాత్మికశక్తిని మఱెవ్వరును ప్రదర్శించియుండలేదు. లోకమునం దవతరించిన సంస్కర్తలలో నాయనయే ప్రప్రథముఁడు. "ప్రాచీన గ్రంథములను ప్రమాణముగ జూపుటచే విశ్వసింపకుఁడు, మీ జాతియొక్క విశ్వాసమనియు విశ్వసింపకుఁడు, బాల్యమునుండి

విశ్వసింపజేయుటచే విశ్వసింపకుడు; మీ యుక్తిచే పూర్ణముగా విచారణ చేయుడు; ఆవల సర్వజనులకును శ్రేయోదాయకమని తోచినచో విశ్వసింపుడు, ఆ విశ్వాసము ననువర్తింపుడు, ఇతరులుకూడ దాని ననుసరించునట్లు తోడ్పడుడు." అని ప్రథమమున చెప్పసాహసించిన దాయనయే. ద్రవ్యమునుగాని, కీర్తినిగాని, మఱెట్టి ఫలమునుగాని కాంక్షింపక కర్మచేయువాడే సర్వోత్తమముగ కర్మచేయుగలడు; ఎవ్వడైన నట్లు చేయగలిగినచో నాత డొక బుద్ధుడగును; ఆతని నుండి ప్రపంచమునంతను పరివర్తనము చేయగల మహాశక్తి యుదయించును. ఇట్టి పురుషుడే కర్మయోగమునకు పరమాదర్శము.

# తప్పొప్పుల పట్టిక

| పుట | పంక్తి | తప్పు | ఒప్పు |
|---|---|---|---|
| 7 | 17 | వచింపనచ్చును | వంచింపనచ్చును |
| 8 | 23 | స్వర్గముకై | స్వర్గముపై |
| 11 | 7 | వృధా | వృద్ధి |
| 12 | 3 | కరస్య | కర్యస్య |
| 12 | 19 | శ్లో | శ్లిష్లో |
| 12 | 19 | మత్యము | మాత్స్యము |
| 12 | 20 | లేనాదు | లేనాదును |
| 13 | 20 | పదార్థ | పదార్థ |
| 24 | 1 | బహ్మాసిష్టో | బ్రహ్మానిష్ఠో |
| 24 | 16 | హింత్వ | హింత్వా |
| 32 | 20 | రామకుమారులు | రాజకుమారులు |
| 42 | 9 | సత్ప్రవృత్తులు | సత్ప్రవృత్తుల |
| 42 | 11 | మునస్సునం | మనస్స్నానం |
| 43 | 9 | లము లన్నియు | ఖము లన్నియు |
| 43 | 10 | ఖను | లను |
| 44 | 7 | పకృతి | ప్రకృతి |
| 51 | 7 | త్యాగభాగము | త్యాగభావము |

| | | | |
|---|---|---|---|
| 53 | 13 | మాఃసి | మాఃసి |
| 55 | 9 | సర్వజనన | సర్వజనీన |
| 70 | 17 | అను | అసలు |
| 73 | 9 | నన్ను | నిన్ను |
| 73 | 13 | ఎప్పుడుచెప్పవలెను | కొట్టివేయువలెను |
| 76 | 4 | యునశ్వరుడై | యునశ్వరుడై |
| 92 | 18 | ఆ | ఆది. |
| 92 | 20 | అని | ఆది. |
| 97 | 5 | స్పృశించు | స్పృశించు |
| 99 | 13 | స్వభావమునం | ప్రకృతియం |
| 104 | 1 | "నేనునాది" | "నేను,నాది" |
| 104 | 3 | 'నేనునాది'; | 'నేను,నాది' |
| 108 | 19 | స్వధర్త్ర | స్వధర్త్ర |
| 109 | 17 | డు. | గాడు. |
| 110 | 5 | దుఃఖము | దుఃఖము; |
| 110 | 10 | జీవనముకు | జీవనమును |
| 110 | 10 | బడిపిల్లలను | బడిపిల్లలకు |
| 114 | 11 | భిన్నాభిన్నములు | భిన్నాభిన్నములు |
| 116 | 17 | నేత్రుడే | నేత్రుడై |
| 122 | 7 | మిట్టిది. | మిట్టిది! |
| 126 | 23 | కర్త్రమాలమునసే | కర్మమూలమునసే |